
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 262
బుధవారం 13-12-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ ముఠా కక్షల జోలికి వెళ్లరు'



భారత్ అదరహో
జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీలో సెమీస్‌లోకి...
-12లో



పరిశ్రమలు రయ్.. ధరలు షాక్!
అక్టోబర్‌లో పారిశ్రామిక వృద్ధి 11.7%. నవంబర్‌లో ద్రవ్యోల్బణం 5.55%
-13లో




చరిత్ర తెలియక తిరగరాస్తున్నారు
మాజీ ప్రధాని నెహ్రూపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపణలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు.
వివరాలు 6లో ▸



...మనీ హేస్ట్ ఎందుకు?
వెబ్‌సిరీస్ 'మనీ హేస్ట్'ను ఐటీ సోదాల్లో దొరికిన రూ. 351 కోట్ల ఉదంతంతో పోలుస్తూ కాంగ్రెస్‌ను మోదీ విమర్శించారు.
వివరాలు 6లో ▸



దానికన్నా చనిపోవడం మేలు
పదవి కావాలని అధిష్టానాన్ని కోరుకోవడం కంటే చనిపోవడం మేలని దిగిపోనున్న ఎంపీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు.
వివరాలు 6లో ▸



భారత్‌కు బైడెన్ రావట్లేదు
గణతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యేందుకు అమెరికా అధ్యక్షుడు భారత్ రావట్లేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.
వివరాలు 6లో ▸

పరీక్షలు ఆలస్యం!

సీఎస్, డీజీపీ, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తదితరులతో సీఎం రేవంత్ సుదీర్ఘ సమీక్ష

- ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం, ఉద్యోగ నియామకాలు, పరీక్షల నిర్వహణపై చర్చ
- మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఐదుగురు కమిషన్ సభ్యులు
- రాజీనామాకు సిద్ధం.. నేడో, రేపో గవర్నర్‌ను కలిసి రాజీనామాల సమర్పణ
- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా, నూతన చైర్మన్‌ను నియమించాల్సి ఉండటంతో పరీక్షలు జాప్యమయ్యే చాన్స్


మంగళవారం సచివాలయంలో టీఎస్‌పీఎస్సీపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డీజీపీ రవి గుప్తా, సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి ఇప్పటికే రాజీనామా చేయడం, ఐదుగురు సభ్యులు కూడా ఒకటీ రెండురోజుల్లో గవర్నర్‌ను కలిసి రాజీనామాలు సమర్పించే అవకాశమున్న నేపథ్యంలో కమిషన్ నిర్వహించాల్సిన పరీక్షలు ఆలస్యమవుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టీఎస్‌పీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా, ఎలాంటి లీకేజీలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని చెబుతున్నారు. అయితే కొత్త చైర్మన్‌ను, సభ్యులను నియమించాల్సి ఉండటం, అందుకు సమయం పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రూప్-1 (మెయిన్స్), గ్రూప్-2, గ్రూపు-3లతో పాటు సంక్షేమ అధికారి పరీక్షలు ఆలస్యం అయ్యే సూచనలున్నాయని టీఎస్‌పీఎస్సీ వర్గాలు చెబుతున్నాయి. టీఎస్‌పీఎస్సీపై ముఖ్యమంత్రి మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్త కమిషన్ ఆధ్వర్యంలో పూర్తి పారదర్శకంగా పరీక్షల నిర్వహణ ద్వారా నిరుద్యోగుల్లో ఆత్మవిశ్వాసం నింపేలా చర్యలకు ఉపక్రమించారు. నూతన కమిషన్ మిగతా 2వ పేజీలో ▶

అత్యున్నత ఫలితాలే లక్ష్యం కావాలి
విద్యాశాఖకు సీఎం రేవంత్ స్పష్టీకరణ

పరీక్షల నిర్వహణలో గుణాత్మక మార్పు తేవాలి.. ప్రైవేటుతో సమానంగా ఫలితాలు రావాలి

- వివరాలు 2లో

హైదరాబాద్ సీపీగా కొత్తకోట శ్రీనివాసరెడ్డి


కొత్తకోట శ్రీనివాసరెడ్డి

- సైబరాబాద్ కమిషనర్‌గా అవినాష్ మహంతి
- రాచకొండ సీపీగా సుధీర్ బాబు
- సీఎం కార్యదర్శిగా షానవాజ్ ఖాసిం నియామకం
- ముగ్గురు సీపీలతో సహా మరికొందరు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు.. స్టీఫెన్ రవీంద్ర, చౌహాన్‌లను డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలని ఆదేశం

-వివరాలు 2లో


షానవాజ్ ఖాసిం

పరామర్శకు రావొద్దు

ప్రజలు, నేతలకు మాజీ సీఎం కేసీఆర్ విజ్ఞప్తి



తనను పరామర్శించడానికి ఎవరూ రావొద్దని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. తుంటి ఎముక మార్పిడి సర్జరీ తర్వాత సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో కోలుకుంటున్న కేసీఆర్ మంగళవారం ఓ వీడియో ప్రకటన విడుదల చేశారు. 2లో

రాజస్తాన్ సీఎం పీఠంపై ఫస్ట్‌టైం ఎమ్మెల్యే

- భజన్‌లాల్ శర్మను సీఎంగా ప్రకటించిన బీజేపీ
- డిప్యూటీ సీఎంలుగా దియా కుమారి, ప్రేమ్‌చంద్ బైర్వా

6లో

చూపంతా లోక్‌సభపైనే
- అన్ని కులాల్లోనూ ఆదరణే లక్ష్యం
- రూటు మారుస్తున్న బీజేపీ.. అద్దం పట్టిన సీఎంల ఎంపిక..


మంగళవారం రాజస్తాన్ నూతన సీఎంగా ఎన్నికైన భజన్‌లాల్ శర్మ, డిప్యూటీ సీఎంలు, స్పీకర్‌గా ఎన్నికైన ప్రేమ్‌చంద్ భైరవా, దియా కుమారి, వాసుదేవ్ దేవ్‌నానితో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ జోషి

పాక్ ఆర్మీ పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి

23 మంది సైనికులు మృతి
- ఖైబర్ పంక్తున్వా ప్రావిన్స్‌లోని డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలో ఘటన

6లో



న్యూస్‌రీల్

అధికార పార్టీ ట్రాప్‌లో పడొద్దు

'అధికార పార్టీ మన మానసిక స్థైర్యాన్ని దెబ్బ తీయాలని చూస్తుంటుంది.. దాని ట్రాప్‌లో పడొద్దు.. తెలంగాణ కోసం పేగులు తెగేదాకా కొట్లాడిన మనం అలా కుంగిపోతే రాష్ట్రం వచ్చేదా? ప్రభుత్వం రానంత మాత్రాన బాధపడొద్దు' అని హరీశ్‌రావు అన్నారు.
- వివరాలు 2లో ▶

పెండింగ్‌లోనే టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి రాజీనామాను గవర్నర్ తమిళిసై ఇంకా ఆమోదించలేదని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ ద్వారా పుదుచ్చేరిలో ఉన్న గవర్నర్‌కు పంపించినట్లు అధికారులు చెప్పారు
- వివరాలు 2లో ▶

ఏపీకి ప్రత్యేక హోదా బాధ్యత కేంద్రానిదే

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రానిదేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఢిల్లీలో తనను కలిసిన ఏపీ ప్రత్యేక హోదా విద్యార్థి యువజన ఐక్యకార్యాచరణ సమితి సభ్యుల పోరాటానికి మద్దతు పలికారు.
- వివరాలు 3లో ▶

కోడ్ మూడ్‌లోనే రెవెన్యూ!

రాష్ట్రంలో రెవెన్యూ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు మినహా ఆ శాఖ పరిధిలో లావాదేవీలు జరగట్లేదని, ఎన్నికల కోడ్ కారణంగా రెండున్నర నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని తెలుస్తోంది.
- వివరాలు 5లో ▶


నిర్మల్: మహిళలతో కిటకిటలాడుతున్న బస్సు

'మండే' మహాలక్ష్మి @ 31 లక్షలు

సోమవారం ఆర్టీసీ బస్సుల్లో మొత్తం 51 లక్షల మంది ప్రయాణించినట్లు ఆర్టీసీ లెక్క తేల్చగా అందులో టికెట్ తీసుకున్న ప్రయాణికుల సంఖ్య 20.87 లక్షలుగా వెల్లడైంది. అంటే మిగతావారు మహిళలే అని స్పష్టమవుతోంది. సోమవారం రూ. 11.74 కోట్ల ఆదాయం లభించింది. సాధారణంగా ప్రయాణికుల సంఖ్య 50 లక్షలు దాటితే ఆ రోజు ఆదాయం రూ. 18 కోట్లుగా ఉంటుందని అంచనా.
- వివరాలు 5లో



పదహారుపై గురి

లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ కార్యాచరణ షురూ

- అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వారికి అవకాశం లేనట్టే
- మైనంపల్లి, జగ్గారెడ్డికి మినహాయింపు ఇచ్చే చాన్స్
- అసెంబ్లీ సీట్లు త్యాగం చేసిన వారికి మాత్రం ఖాయం
- ఈ జాబితాలో జానా, వంశీ, పటేల్‌ల పేర్లు పరిశీలన



సాక్షి, హైదరాబాద్: రానున్న మూడు నెలల్లో జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు గాను 16 స్థానాలు దక్కించుకోవడమే లక్ష్యంగా పావులు కదపడం ప్రారంభించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో ఒకరిద్దరికి మాత్రమే పార్లమెంటుకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని, మిగిలిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికలే ధ్యేయంగా బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన ముఖ్య నేతలు కొందరిని బరిలోకి దింపే ప్రయత్నాలను కూడా ప్రారంభించినట్టు తెలుస్తోంది.

10–12 చోట్ల క్లియర్: ఎంపీ సీట్లకు టికెట్ల ఖరారు వ్యవహారం 10–12 స్థానాల్లో సులభమేనని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. దక్షిణ తెలంగాణ పరిధిలోకి వచ్చే నల్లగొండ, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, చేవెళ్ల, మల్కాజ్‌గిరిలతో పాటు
మిగతా 3వ పేజీలో ▶

కన్నెత్తి చూడని కమలదళం

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పోస్టుమార్టం ఏదీ?

జాతీయ నాయకత్వానికి కిషన్‌రెడ్డి నివేదిక!



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి పదిరోజులు కావొస్తున్నా..ఓటమికి గల కారణాలపై ఇంతవరకూ సమీక్షించలేదు. పోటీ చేసిన అభ్యర్థులతో రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలెవరూ కనీసం మాట్లాడకపోవడంపై ఆ పార్టీ శ్రేణుల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఏ ఎన్నికలు జరిగినా, ఫలితాలు వెలువడిన కొద్దిరోజుల వ్యవధిలోనే గెలుపోటములపై రివ్యూ చేయడం ఆ పార్టీ ఆనవాయితీ. కానీ ఈసారి అలాంటిదేమీ లేదు. శాసనసభ ఎన్నికల్లో పార్టీకి ఎదురైన పరిస్థితి, అందుకు కారణాలను విశ్లేషించుకుని త్వరలోనే జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాల్సి ఉండగా, అలాంటి ప్రయత్నమేదీ ఇప్పటివరకు జరగకపోవడంతో కేడర్‌లో నిరుత్సాహం నెలకొంది.

మొహం చాటేసిన జాతీయ నేతలు

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, ఆ పార్టీ ముఖ్యనేతలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అయితే ఆ స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో జాతీయ నాయకత్వం నుంచి పార్టీలోని వివిధ స్థాయిల్లో కొంత నిరాశ, నిస్పృహలు ఎదురయ్యాయి. గెలుపోటములకు గల
మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామాను ఆమోదించని గవర్నర్

నేడు పుదుచ్చేరి నుంచి హైదరాబాద్ రానున్న తమిళిసై



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి రాజీనామాను రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఇప్పటి వరకు ఆమోదించలేదని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. జనార్దన్ రెడ్డి సోమవారం రాజీనామా సమర్పించగా, పుదుచ్చేరిలో ఉన్న గవర్నర్‌కు దానిని ఆన్‌లైన్ ద్వారా పంపినట్టు అధికారులు తెలిపారు. బుధవారం గవర్నర్ హైదరాబాద్‌కు తిరిగి రానున్నారని, రాజీనామాను ఆమోదించే విషయంలో అప్పుడే నిర్ణయం తీసుకుంటారనే చర్చ జరుగుతోంది. టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణం చోటుచేసుకోవడంతో రాతపరీక్షలు రద్దు అయ్యాయి. దీంతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు జరిపిన దర్యాప్తుపట్ల గవర్నర్ అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామాపై గవర్నర్ నిర్ణయం తీసుకోలేదని తెలిసింది.

శాసనసభ స్పీకర్ ఎన్నికకు నేడు నామినేషన్లు

దాఖలు చేయనున్న గడ్డం ప్రసాద్‌కుమార్.. రేపు స్పీకర్ ఎన్నిక




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మూడో శాసనసభ స్పీకర్ ఎన్నిక ప్రక్రియ కీలకదశకు చేరుకుంది. దీనికి సంబంధించి సోమవారమే అసెంబ్లీ సెక్రటేరియట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ నుంచి స్పీకర్ అభ్యర్థిగా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. పోటీకి దూరంగా ఉండాలని ఇప్పటికే బీఆర్‌ఎస్ సూత్రప్రాయంగా నిర్ణయించడంతో గురువారం జరిగే స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. స్పీకర్ ఎన్నిక ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ నేతృత్వంలో జరగనుంది.

16న నగరానికి ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్



సాక్షి, హైదరాబాద్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురాంరాజన్, రచయిత, ఆర్థికవేత్త రోహిత్ లాంబాలు ఈ నెల 16న హైదరాబాద్ రానున్నారు. సాయంత్రం 6.30 గంటలకు ముఫకం జా కాలేజీలో 'రీ ఇమేజినింగ్ ఇండియాస్, ఎకనమిక్ ఫ్యూచర్'అంశంపై రఘురాంరాజన్ ప్రసంగిస్తారు. ఇదే సదస్సులో పలు పుస్తకాలను కూడా ఆయన ఆవిష్కరిస్తారు.

మాజీ డీజీపీ అంజనీకుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేత



సాక్షి, హైదరాబాద్: మాజీ డీజీపీ అంజనీకుమార్‌పై ఉన్న సస్పెన్షన్‌ను ఎన్నికల సంఘం ఎత్తివేసింది. ఈ మేరకు సీఈసీ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెల్లడి కాకముందే ఎన్నికల ప్రవర్తనానియమావళి ఉల్లంఘిస్తూ పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అంజనీకుమార్, మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులు సంజయ్‌కుమార్, మహేశ్ భగవత్ కలిసిన విషయం తెలిసిందే. దీనిపై సీరియస్ అయిన ఎన్నికల కమిషన్ అంజనీకుమార్‌ను విధుల నుంచి తప్పిస్తూ సస్పెన్షన్ వేటువేసింది. అయితే, ఉద్దేశపూర్వకంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించలేదని, ఎన్నికల ఫలితాలరోజు రేవంత్‌రెడ్డి పిలిస్తేనే వెళ్లానని అంజనీకుమార్ సీఈసీకి వివరణ ఇచ్చారు. ఇలాంటి ఘటన మరోసారి జరగదని సీఈసీకి హామీ ఇచ్చారు. అంజనీకుమార్ విజ్ఞప్తిని సీఈసీ పరిగణనలోకి తీసుకుంది. దీంతో సస్పెన్షన్ ఎత్తివేస్తూ సీఈసీ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా ఆమోదించొద్దు

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ



సాక్షి, హైదరాబాద్: విచారణ జరపకుండా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్ జనార్దన్‌రెడ్డి రాజీనామాను అంగీకరించవద్దని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ కారణంగా లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయని, గత ప్రభుత్వం ఎలాంటి సమగ్ర విచారణ చేపట్టలేదని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యవహారంలో బాధ్యులను గుర్తించిన తర్వాత చైర్మన్ రాజీనామా ఆమోదించాలని కోరారు. పేపర్ లీకేజీపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈఘటనపై తమ సంఘం ఆధారాలు సమర్పించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నిలిచిపోయిన నియామకాలు చేపట్టాలని, కాంగ్రెస్ మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలని ఝాన్సీ కోరారు. అన్ని శాఖల్లో ఉన్న ఖాళీల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ సీపీగా కొత్తకోట శ్రీనివాసరెడ్డి

సైబరాబాద్ కమిషనర్‌గా అవినాశ్ మహంతి

- రాచకొండ సీపీగా సుధీర్ బాబు
- ముఖ్యమంత్రి కార్యదర్శిగా షానవాజ్ ఖాసీం నియామకం
- ముగ్గురు సీపీలతో సహా మరికొందరు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు
- స్టీఫెన్ రవీంద్ర, చౌహాన్‌లను డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పలువురు సీనియర్ ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఒకేసారి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్లకు సీపీలను మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాస రెడ్డి నియమితులయ్యారు. సైబరాబాద్ జాయింట్ సీపీ అడ్మిన్‌గా పనిచేస్తున్న 2005 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతికి సైబరాబాద్ సీపీగా బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్‌గా పనిచేసిన 2001 బ్యాచ్ ఐపీఎస్ అధికారి జి సుధీర్‌బాబు రాచకొండ సీపీగా నియమితులయ్యారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన 1993 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్యను తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా బదిలీ చేశారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మాదక ద్రవ్యాల నియంత్రణ అంశంపై నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయం మేరకు పూర్తి స్థాయి డైరెక్టర్‌ను నియమించారు. ఇప్పటి వరకు సైబరాబాద్, రాచకొండ సీపీలుగా పనిచేసిన స్టీఫెన్ రవీంద్ర, దేవేంద్రసింగ్ చౌహాన్‌లను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని సీఎస్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం మరో ఉత్తర్వును జారీ చేశారు.


అవినాశ్ మహంతి


సుధీర్ బాబు

ఒకేసారి భారీ మార్పులపై సీఎం కసరత్తు!

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మంగళవారం జరిగిన ఐపీఎస్‌ల బదిలీలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ కసరత్తే చేసినట్టు తెలుస్తోంది. గతానికి భిన్నంగా అత్యంత కీలకమైన హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లను ఒకేసారి బదిలీ చేయడం అందులో భాగమని చర్చ జరుగుతోంది. మొత్తంగా సీఎం రేవంత్‌రెడ్డి తన మార్క్ టీంను సెట్ చేస్తున్నారు. త్వరలోనే పలు జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు సహా భారీ సంఖ్యలో ఐపీఎస్‌ల బదిలీలు ఉండే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

కొత్తకోటకు చాలాకాలం తర్వాత కీలక పోస్టింగ్

హైదరాబాద్ సీపీగా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి, అడిషనల్ డీజీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డికి చాలా ఏళ్ల తర్వాత అత్యంత కీలక పోస్టింగ్ దక్కింది. గతంలో ఆపరేషన్స్ అడిషనల్ డీజీగా పనిచేసిన ఆయన తర్వాత అడిషనల్ డీజీ ఆర్గనైజేషన్స్, లీగల్‌గా బదిలీ అయ్యారు. గత కొన్ని నెలలుగా అక్కడ పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం అత్యంత కీలక పోస్టింగ్‌లోకి బదిలీ చేసింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న స్టీఫెన్ రవీంద్రను తప్పించిన సర్కార్ ఆయన స్థానంలో అవినాశ్ మహంతికి బాధ్యతలు అప్పగించింది. సైబరాబాద్ సీపీ పోస్టు ఐజీ ర్యాంకు అయినా..డీఐజీ ర్యాంకులో ఉన్న అవినాశ్ మహంతికి అనూహ్యంగా ఆ బాధ్యతలు అప్పగించడం గమనార్హం. ఇక రాచకొండ పోలీస్ కమిషనర్‌గా డిసెంబర్ 2022లో బాధ్యతలు తీసుకున్న సీనియర్ ఐపీఎస్ అధికారి డీఎస్ చౌహాన్ కేవలం పదకొండు నెలలకే బదిలీ అయ్యారు. ఇదే కమిషనరేట్‌లో గతంలో సుదీర్ఘ కాలంపాటు పనిచేసిన సుధీర్‌బాబుకు కొత్త ప్రభుత్వం పోలీస్ కమిషనర్‌గా అవకాశం కల్పించింది.

శాండిల్యకు యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ బాధ్యతలు



ఎన్నికల కమిషన్ అనూహ్య నిర్ణయంతో హైదరాబాద్ సీపీగా అసెంబ్లీ ఎన్నికల ముందు బాధ్యతలు చేపట్టిన సందీప్‌శాండిల్యను సైతం ప్రభుత్వం తప్పించింది. సమర్థవంతమైన అధికారిగా పేరున్న సందీప్‌శాండిల్యకు తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ బాధ్యతలు అప్పగించింది. మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దృఢ నిశ్చయంతో ఉండడంతో నిక్కచ్చిగా వ్యవహరించే సందీప్ శాండిల్యకు నార్కోటిక్స్ బ్యూరో బాధ్యతలు అప్పగించినట్టు చర్చ జరుగుతోంది.

పరీక్షలు ఆలస్యం!

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు, చైర్మన్, సభ్యుల నియామకానికి సంబంధించిన నిబంధనలు, కమిషన్ కార్యాచరణ తదితరాలపై అధికారులతో చర్చించారు. సీఎస్ శాంతికుమారి, సీఎం కార్యదర్శి శేషాద్రి, డీజీపీ రవిగుప్తా, అదనపు డీజీ సీవీ ఆనంద్, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితారామచంద్రన్, ఆర్థిక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారానికి సంబంధించిన కేసును విచారిస్తున్న సిట్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల్లో ఎలా నిర్వహిస్తున్నారో తెలుసుకోండి

టీఎస్‌పీఎస్సీ ద్వారా చేపడుతున్న నియామకాలు, జారీ చేసిన నోటిఫికేషన్లు, నిర్వహించిన పరీక్షలు, మిగతా పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి.. కమిషన్ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగ నియామకాలు, ఉద్యోగ ప్రవేశ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహిస్తున్న యూపీఎస్సీతో పాటు ఇతర రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరును అధ్యయనం చేసి సవివరమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. యూపీఎస్సీకి, ఇతర రాష్ట్రాలకు ఉన్నతాధికారుల బృందాన్ని పంపి అక్కడి నియామకాల ప్రక్రియపై అధ్యయనం చేసి నివేదిక రూపొందించించాలని సూచించారు. కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా తగు నిబంధనలు రూపొందించాలని ఆదేశించారు. కమిషన్‌కు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, కావాల్సిన సిబ్బందిని, ఇతర సదుపాయాలను వెంటనే కల్పించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో కమిషన్‌ను సమూల ప్రక్షాళన చేయాలని సీఎం నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం కమిషన్ ఉద్యోగులు ఎవరెవరికి ఏయే బాధ్యతలున్నాయి? మార్పులు చేర్పులు, ఖాళీలు, కొత్తగా ఉద్యోగాల భర్తీ తదితరాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై నమోదైన కేసు, దర్యాప్తు పురోగతిపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. దర్యాప్తును వేగవంతం చేయాలని సిట్‌ను ఆదేశించినట్లు తెలిసింది.

సీఎంను కలిసిన కమిషన్ సభ్యులు

టీఎస్‌పీఎస్సీ సభ్యులు కారం రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, బి.లింగారెడ్డి, సుమిత్రా ఆనంద్ తనోబా, కోట్ల అరుణ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. చైర్మన్ రాజీనామా నేపథ్యంలో తాము కూడా రాజీనామా చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సాయంత్రమే గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను కలిసేందుకు రాజ్‌భవన్‌కు వెళ్లారు. కానీ గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో ఆమె వచ్చిన తర్వాత బుధ, గురువారాల్లో రాజీనామా లేఖలు సమర్పించాలని నిర్ణయించుకున్నారు. కాగా సభ్యుడు ఆర్.సత్యనారాయణ రాష్ట్ర నిరుద్యోగులను ఉద్దేశించి ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు. ఎలాంటి పొరపాటు చేయనప్పటికీ సభ్యుడి హోదా నుంచి తప్పుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు.

కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ మేరకు పరీక్షలు!

గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన నోటిఫికేషన్లకు అనుగుణంగా వివిధ ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించారు. గ్రూప్-1(మెయిన్స్), గ్రూప్-2, గ్రూప్-3, హెచ్‌డబ్ల్యూఓ, లెక్చరర్ కొలువులకు సంబంధించి పరీక్షలు నిర్వహించలేదు. మరోవైపు పరీక్షలు నిర్వహించిన వాటికి వివిధ కారణాల వల్ల ఫలితాలను వెల్లడించలేదు. తాజాగా టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనకు ముఖ్యమంత్రి పూనుకోవడం, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా ఉద్యోగ అర్హత పరీక్షలు నిర్వహించే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఆయా పరీక్షల నిర్వహణకు కొంత సమయం పట్టే అవకాశం ఉందని టీఎస్‌పీఎస్సీ వర్గాలు వివరిస్తున్నాయి.

త్వరలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- సొంత శాఖలోకి గృహనిర్మాణ విభాగాలు
- సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టే సమీక్షలో విధివిధానాలపై స్పష్టత
- మంత్రి పొంగులేటి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో రోడ్లు భవనాల శాఖలోకి మారిన గృహ నిర్మాణ శాఖ విభాగాలను పునరుద్ధరించనున్నట్టు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. త్వరలో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గాను ఆ విభాగాన్ని పునరుద్ధరిస్తూ, చాలినంత సిబ్బందిని ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై సమకూర్చుకోనున్నట్టు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మూడు, నాలుగు నమూనాలను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి గృహనిర్మాణ సంస్థ, రాజీవ్ స్వగృహ, గృహనిర్మాణ మండలి అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నందున, వాటి నిర్మాణానికి కార్యాచరణ ప్రారంభిస్తామని పొంగులేటి చెప్పారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి గృహనిర్మాణ శాఖపై సమీక్షించనున్నారని, ఈ సందర్భంగా విధివిధానాలపై స్పష్టత ఇవ్వనున్నారని తెలిపారు.

రాజీవ్ స్వగృహ ఇళ్ల విక్రయాల కోసం మార్కెటింగ్ నిపుణులను నియమించండి

కొనుగోళ్లు కాకుండా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను విక్రయించేందుకు వీలుగా మార్కెటింగ్ చేయాల్సి ఉందని, ఇందుకు నిపుణులను నియమించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న రాజీవ్ స్వగృహ సముదాయాలను ఏ ధరకు విక్రయించాలన్న విషయంలో కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్టు వెల్లడించారు. వాటి ద్వారా సమకూరే మొత్తాన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వినియోగించనున్నట్టు పేర్కొన్నారు.

అత్యున్నత ఫలితాలే లక్ష్యం కావాలి

విద్యాశాఖకు సీఎం రేవంత్ స్పష్టీకరణ

- పరీక్షల నిర్వహణలో గుణాత్మక మార్పు తేవాలి
- ప్రైవేటుతో సమానంగా ఫలితాలు రావాలి
- నాణ్యమైన బోధనకు ప్రణాళిక రూపొందించండి


అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: పరీక్షల నిర్వహణలో గుణాత్మక మార్పు తేవాలని విద్యాశాఖ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు స్వేచ్ఛాయుతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని కోరారు. అత్యున్నత స్థాయి ఫలితాలే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ తొలిసారిగా మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. కార్యదర్శి వాకాటి కరుణ, ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి హోదాలో నవీన్ మిత్తల్, పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన హాజరయ్యారు. ఇంటర్, టెన్త్ పరీక్షలకు సంబంధించిన సమగ్ర వివరాలు సీఎం అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలు, రాబోయే ఫలితాలపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెరుగైన ఫలితాల కోసం తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కోరారు. గత ఏడాది పేపర్ లీకేజీ ఘటనలను ఈ సందర్భంగా ప్రస్తావించినట్టు తెలిసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేయాలని కోరారు. కాగా ఆన్‌లైన్ మూల్యాంకన విధానాన్ని ఇంటర్ అధికారులు సీఎంకు వివరించారు. దీనివల్ల అతి తక్కువ సమయంలో ఫలితాల వెల్లడికి ఆస్కారం ఉందని చెప్పారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ దిశగా ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం ఇచ్చిన సిఫారసులు, వాటి సాధ్యాసాధ్యాలపై సమగ్ర వివరాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు తెలిసింది.

ప్రైవేటుతో సమానంగా ఫలితాలు రావాలి

ప్రైవేటు విద్యా సంస్థలతో సమానంగా ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో మెరుగైన ఫలితాలు రావాల్సిన అవసరాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. దీంతో గురుకులాల్లో మెరుగైన ఫలితాలు వస్తున్న తీరును అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఈ క్రమంలోనే గురుకులాల్లో మాదిరిగా ప్రభుత్వ స్కూళ్లలోనూ ఫలితాలు పెంచాల్సిన అవసరం లేదా? అని ఆయన ప్రశ్నించినట్టు సమాచారం. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన బోధన, పరీక్షలకు సన్నద్ధమయ్యే మెళకువలు మెరుగు పర్చేందుకు సరికొత్త కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. ఇంటర్ తర్వాత జరిగే పోటీ పరీక్షలకు రాష్ట్ర విద్యార్థులను, ముఖ్యంగా ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థులను సన్నద్ధం చేయాలని, ప్రత్యేక కోచింగ్ ఇవ్వాలని సూచించారు.

మండలానికో కాలేజీ

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ విద్యార్థులకు కాలేజీలు అందుబాటులో ఉండాలని సీఎం చెప్పారు. ప్రతి మండలానికి ఓ కాలేజీ ఏర్పాటు అవసరమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో అవసరాన్ని బట్టి అధ్యాపకులను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ తెలిపారు. డిగ్రీ కాలేజీల్లో సీట్లు మిగిలిపోతుండటంపై ఆయన ఆరా తీశారు.

పదోన్నతులు చేపడితే ఖాళీలపై స్పష్టత

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు, పరీక్షలు, ఫలితాల గురించి దేవసేన సీఎంకు వివరించారు. వివిధ సబ్జెక్టు టీచర్ల కొరత, ఖాళీల భర్తీ, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి గతంలో జరిగిన కసరత్తు చర్చకు వచ్చినట్టు తెలిసింది. 5 వేల పైచిలుకు పోస్టుల భర్తీకి ఎన్నికల ముందు చేపట్టిన ప్రక్రియ ఆగిపోయిందని అధికారులు తెలిపారు. పాఠశాల విద్యాశాఖలో 18 వేలకు పైగా ఖాళీలున్నాయని, పదోన్నతులు చేపడితే ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై స్పష్టమైన సమాచారం వస్తుందని వివరించారు. టెట్ ఉత్తీర్ణులకే పదోన్నతులు ఇవ్వాలన్న కోర్టు తీర్పు అడ్డంకిగా ఉందని చెప్పగా, దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుందామని సీఎం చెప్పినట్లు సమాచారం.


యశోద ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న సిద్దిపేట మహిళలు

పరామర్శకు రావొద్దు

ప్రజలు, నేతలకు మాజీ సీఎం కేసీఆర్ విజ్ఞప్తి

- ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని ఆందోళన

సాక్షి, హైదరాబాద్: తనను పరామర్శించడానికి ఎవరూ రావొద్దని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. తుంటి ఎముక మార్పిడి సర్జరీ తర్వాత సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో కోలుకుంటున్న కేసీఆర్ మంగళవారం ఓ వీడియో ప్రకటన విడుదల చేశారు. అందులో ఏమన్నారంటే..

మంచిగ అయినంక కలుస్తా...

''రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన అభిమానులకు నా హృదయ పూర్వక వందనాలు. అనుకోకుండా జరిగిన ప్రమాదం కారణంగా యశోద ఆస్పత్రిలో ఉన్న సందర్భంలో అనేకమంది నన్ను కలవడానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉండటం వల్ల సమస్య ఇంకా పెరిగి అవస్థలు వస్తాయని, అదే జరిగితే నెలల తరబడి బయటకు పోలేనని వైద్యబృందం సీరియస్‌గా హెచ్చరించింది. దీనిని గమనించండి... మీ అభిమానానికి చేతులెత్తి దండం పెడుతున్నా. మీరంతా బాధపడకుండా మీ స్వస్థలాలకు క్షేమంగా వెనుదిరిగి పోవాలి. ఇతర పేషెంట్లు, ప్రజలు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా మీరు వెంటనే తరలివెళ్లిపోవాలి.. మీ ఇళ్లకు క్షేమంగా చేరుకోవాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నా. నా మాటను మన్నించి గౌరవించి ఏ మాత్రం ఇబ్బందులు పడకుండా మీరందరూ తిరిగి ఇళ్లకు చేరండి. ఇంకో 10 రోజుల దాకా ఎవరూ తరలిరావొద్దని రాష్ట్ర ప్రజలకు వినయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నా. దీని వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు, అంతేకాక వందలాది మంది రోగులున్నారు వారి క్షేమం కూడా మనకు ఎంతో ముఖ్యం. కాబట్టి అన్యథా భావించకండి. నేను మంచిగ అయిన తర్వాత తప్పకుండా అందర్నీ కలుస్తా. నిత్యం ప్రజల మధ్యే ఉండేవాడ్ని కాబట్టి మళ్లీ కలుసుకోవడానికి ఏ ఇబ్బంది లేదు''.

కొనసాగిన పరామర్శలు

రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు. ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ.పాల్ మంగళవారం కేసీఆర్‌ను పరామర్శించారు. మేఘాలయ సీఎం సంగ్మా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫోన్ చేసి కేసీఆర్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ కూడా మరోసారి కేటీఆర్‌కు ఫోన్ చేసి కేసీఆర్ కోలుకుంటున్న విషయాన్ని తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు.

యశోద ఆస్పత్రి వద్ద మహిళల ధర్నా

బంజారాహిల్స్: కేసీఆర్‌ను చూసేందుకు మంగళవారం సిద్దిపేట నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. అయితే వారిని ఆస్పత్రి లోపలకు అనుమతించ లేదు. దీంతో వారంతా అక్కడే బైఠాయించి ధర్నాకు దిగారు. తమను కేసీఆర్ వద్దకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటామని మహిళలు కోరారు.

నేడు గవర్నర్ పరామర్శ

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కేటీఆర్‌కు ఫోన్ చేసి ఆరా తీసిన విషయం తెలిసిందే. బుధవారం ఆమె స్వయంగా ఆస్పత్రికి వచ్చి కేసీఆర్‌ను పరామర్శించనున్నారు.

అధికార పార్టీ ట్రాప్‌లో పడొద్దు

మన మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తారు: హరీశ్‌రావు


సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/జహీరాబాద్: 'అధికార పార్టీ మన మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తుంటుంది.. దాని ట్రాప్‌లో పడొద్దు.. కుంగిపోవద్దు.. తెలంగాణ కోసం పేగులు తెగేదాక కొట్లాడిన మనం అలా కుంగిపోతే రాష్ట్రం వచ్చేదా? ప్రభుత్వం రానంత మాత్రాన బాధపడొద్దు'అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డిలో జరిగిన కృతజ్ఞత సభలో హరీశ్‌రావు మాట్లాడారు. స్థానిక సంస్థలు, ఎంపీ ఎన్నికలు రాబోతున్నాయని, ఈ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నో జయాపజయాలు చూసిందని, ఎన్నో ఇబ్బందులు పడ్డామని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం ఎన్నోసార్లు పడిలేచినా ఎక్కడా కుంగిపోలేదని గుర్తు చేశారు.

భవిష్యత్ బీఆర్‌ఎస్‌దే..

భవిష్యత్ అంతా బీఆర్‌ఎస్‌కే ఉంటుందని హరీశ్‌రావు అన్నారు. అధికారపక్షంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా మనం ప్రజల పక్షంగానే ఉంటామని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణను ఎంతో అభివృద్ధి చేశామని, ఇప్పుడు ప్రతిపక్షంలో ప్రజల కోసం పనిచేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో పకడ్బందీ కార్యాచరణతో ముందుకు పోదామని పిలుపునిచ్చారు. ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని, తప్పుడు ప్రచారం చేయడంలో కాంగ్రెస్ పైచేయి సాధించిందని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని హరీశ్ అన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఏడాదైతే కాంగ్రెస్ పాలన గురించి తెలుస్తది

మనకంటే కాంగ్రెస్ వారు బాగా పనిచేస్తారేమోనని భావించి ప్రజలు వారికి అధికారం కట్టబెట్టారని హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జరిగిన కృతజ్ఞతా సభలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో పరుగులు పెట్టించాం. అయితే దురదృష్టం వెంటాడింది.. కేవలం రెండు శాతం ఓట్ల తేడాతో అధికారం కోల్పోవాల్సి వచ్చింది' అని పేర్కొన్నారు. ఏడాది గడిచాక కాంగ్రెస్ ప్రభుత్వం మంచి చేస్తుందా..? చెడు చేస్తుందా అనేది ప్రజలు గ్రహిస్తారని, అప్పటి వరకు ఓపిక పడుదామని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు.

'కేడర్ వివాదం'లో కేంద్రమే నిర్ణయం తీసుకోవాలి

ఆ మేరకు ఆదేశాలిస్తాం

- క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తాం: హైకోర్టు
- అలా కాకుండా కేసుల వారీగా విచారణ జరపాలి: పిటిషనర్లు
- వచ్చే నెల 2వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) అధికారులను రాష్ట్రాల మధ్య కేటాయించే అప్పీలేట్ అథారిటీ బాధ్యతను కోర్టులు నిర్వర్తించనందున.. క్యాట్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసి, కేంద్రమే నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తామని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇరు రాష్ట్రాల మధ్య అధికారుల కేటాయింపును మరోసారి పరిశీలించి పదేళ్లకు పైగా తెలంగాణలో ఉంటున్న వారు, త్వరలో సర్వీస్ ముగిసేవారికి సంబంధించి సహేతుక నిర్ణయం తీసుకుంటుందని అభిప్రాయపడింది. అయితే అలా వద్దని పిటిషన్ వారీగా విచారణ జరపాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. దీంతో అధికారుల కేటాయింపునకు సంబంధించిన కేడర్ వివాదంలో వాదనలను వచ్చే నెల 2వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

2014 నుంచి కొనసాగుతున్న కేడర్ వివాదం

2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో పలువురు అధికారులను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. అయితే వీరిలో కొందరు ఈ కేటాయింపులపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించి.. తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. ఈ క్రమంలోనే గత జనవరిలో తెలంగాణ సీఎస్ సోమేశ్‌కుమార్‌ను ఏపీకి వెళ్లాల్సిందేనంటూ ఇదే హైకోర్టు సీజే ధర్మాసనం తీర్పునిచ్చింది. అయితే కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా తమ పిటిషన్లను విడిగా విచారణ జరపాలని డీజీపీ అంజనీకుమార్ సహా ఇతర అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఓ పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కె.లక్ష్మీ నర్సింహ వాదనలు వినిపిస్తూ.. ధర్మాసనం అలా నిర్ణయాన్ని కేంద్రానికి వదిలేయ వద్దని విజ్ఞప్తి చేశారు. పిటిషన్ల వారీగా విచారణ చేయాలని కోరారు. ఇతర పిటిషన్ల న్యాయవాదులు కూడా దీన్ని సమర్థించారు. దీంతో తదుపరి విచారణ కోసం ధర్మాసనం .. విచారణను వచ్చే నెల 2కు వాయిదా వేసింది.

క్లుప్తంగా...

'మహాలక్ష్మి'కి అర్హతలివే..

వచ్చే జనవరి నుంచి అమలుకు కసరత్తు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2500 అందజేస్తామన్న హామీని వచ్చే ఏడాది జనవరి నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కానీ ఈ పథకానికి పలు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. భార్య, భర్త ఆధార్ కార్డు, 18 ఏళ్ల నుంచి 55 ఏళ్ల వయసున్న వారు అర్హులు. తెల్ల రేషన్‌కార్డు ఆన్‌లైన్ జిరాక్స్, ఓటర్ ఐడీ కార్డు (ఐచ్ఛికం), విద్యుత్ బిల్లు, గ్యాస్ బిల్లు (ఐచ్ఛికం) బ్యాంక్ పాస్ పుస్తకం, పాస్‌పోర్టు సైజు ఫొటో, వార్షికాదాయం, కుల ధ్రువ (ఐచ్ఛికం) పత్రం, మండలం, ఫోన్ నంబర్లను ఇవ్వాల్సి ఉంటుంది.

సీఎం ఇంటి వద్ద మీడియా పాయింట్ వద్దు

మీడియా ప్రతినిధులను పంపించేసిన పోలీసులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): జూబ్లీహిల్స్ రోడ్ నెం.44లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద నాలుగు రోజుల నుంచి మీడియా.. సీఎం రాకపోకలను, అక్కడికి వచ్చేవారిని చిత్రీకరిస్తోంది. అయితే ఇంటి వద్ద మీడియా పాయింట్ వద్దని ఆదేశాలు రావడంతో మంగళవారం బందోబస్తులో ఉన్న పోలీసులు మీడియాను అక్కడి నుంచి పంపించారు. ప్రజాభవన్ వద్ద, సచివాలయం వద్ద మీడియా పాయింట్లు ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఇంటి వద్ద కూడా మీడియా పాయింట్లు వద్దని సీఎం భావించినట్లు తెలుస్తోంది. ఆ మేరకు ఉన్నతాధికారుల నుంచి స్థానిక పోలీసులకు ఆదేశాలు జారీ అయ్యాయి. సీఎం ఇంటి వద్దకు మీడియాను ఆహ్వానిస్తేనే రావాల్సి ఉంటుందని, ఇతర సమయాల్లో కుదరదని స్పష్టంచేశారు.

ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర

డీజీపీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నాయంటూ ఆ పార్టీ అధికార ప్రతినిధులు పున్నా కైలాష్ నేత, చారకొండ వెంకటేశ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి మంగళవారం డీజీపీ రవిగుప్తాను ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరిలు పలు సందర్భాల్లో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందని చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. కాగా, ఆరు గ్యారంటీల అమలు కోసం కార్డులంటూ ఫేక్ కార్డులు అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ డీజీపీకి లేఖ రాశారు. రూ.200–500 వరకు వసూలు చేసి 6జీ పేరుతో కొందరు అక్రమార్కులు కార్డులిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్‌కు వంతపాడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

రఘునందన్‌రావు ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: ఇటీవలి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచి వంతపాడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు. పోలింగ్ తేదీకి మూడు రోజుల ముందు తూప్రాన్ డీఎస్పీ, సిద్దిపేట, గజ్వేల్ ఏసీపీలు, సీఐలు, ఎస్సైల టెలిఫోన్ కాల్స్‌పై విచారణ జరిపించాలని విజ్ఞప్తిచేశారు. స్థానిక ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలకు వీరు ఎన్నిసార్లు ఫోన్ చేశారో వెలికి తీయాలన్నారు. పోలింగ్‌కు ముందు డబ్బు పంపిణీ జరుగుతోందని బీజేపీ నేతలు, కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆ సమాచారం బీఆర్ఎస్ అభ్యర్థి, నాయకులకు చేరిపోయిందని రఘునందన్‌రావు ఆరోపించారు. దీని వల్ల ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై దుబ్బాక నుంచి పోటీ చేసిన తనకు నష్టం జరిగిందని తెలిపారు. గతంలోని బీఆర్ఎస్ సర్కార్, సిద్దిపేట జిల్లాకు చెందిన మాజీ ఆర్థిక మంత్రి టి.హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డిల ఆదేశాల మేరకు పనిచేసిన పోలీసు అధికారులపై కేసు పెట్టి వారి పర్సనల్ ఫోన్‌లతో సహా కాల్‌రికార్డ్స్, ఇతర అంశాలపై విచారణ జరిపించాలని విన్నవించారు.

పార్టీ మార్పు వార్తలు అవాస్తవం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన మంగళవారం బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గెలిచినప్పుడు పొంగిపోవటం.. ఓడినప్పుడు కుంగిపోవటం రాజకీయ నాయకుల లక్షణం కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు ప్రజల వైపుండాలనే సూత్రీకరణకు అనుగుణంగా కొనసాగుతామన్నారు. ఈ క్రమంలో గెలిచిన ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీగా తప్పకుండా నిర్మాణాత్మక సూచనలు చేస్తామన్నారు. కొత్త ప్రభుత్వానికి కనీసం నాలుగైదు నెలల సమయం ఇచ్చి వేచిచూశాక.. హామీలు అమలు చేయకపోతే ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా వ్యవహరిస్తామని సుధీర్ రెడ్డి చెప్పారు.

పదహారుపై గురి

▶ మొదటి పేజీ తరువాయి



పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, మెదక్, జహీరాబాద్ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక పెద్ద కష్టమేమీ కాదని అంటున్నాయి. ఈ స్థానాల నుంచి ఇప్పటికే రెండు చొప్పున పేర్లను పరిశీలిస్తున్నారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. నల్లగొండ పార్లమెంటు నుంచి జానారెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డిలలో ఒకరు, భువనగిరి నుంచి కోమటిరెడ్డి లక్ష్మి, చామల కిరణ్‌కుమార్ రెడ్డిలలో ఒకరు, మహబూబ్‌నగర్ నుంచి వంశీచందర్‌రెడ్డి, సీతా దయాకర్‌రెడ్డిలలో ఒకరు, నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి లేదా పి.రాములు (కాంగ్రెస్‌లోకి వస్తే), చేవెళ్ల నుంచి కేఎల్లార్ లేదంటే బీఆర్ఎస్ నుంచి వస్తారని భావిస్తున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన ముఖ్య నేత, లేదంటే బీజేపీ నుంచి మరో కీలక నేత, మల్కాజ్‌గిరిలో మైనంపల్లి హనుమంతరావులను బరిలోకి దింపే అంశంపై టీపీసీసీ కసరత్తు ప్రారంభించింది. ఇక పెద్దపల్లి నుంచి చెన్నూరు ఎమ్మెల్యే జి. వివేక్ కుమారుడు వంశీ లేదా పెరిక శ్యాం, ఖమ్మం నుంచి వి.హనుమంతరావు లేదంటే రేణుకా చౌదరి, పొట్ల నాగేశ్వరరావుల్లో ఒకరు, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్, విజయాబాయి (వైరా)లలో ఒకరికి టికెట్ ఇవ్వొచ్చని అంటున్నారు. వరంగల్ నుంచి సిరిసిల్ల రాజయ్య, దొమ్మాట సాంబయ్య, అద్దంకి దయాకర్ (మంత్రి పదవి ఇవ్వకపోతే) పేర్లను, మెదక్ నుంచి జగ్గారెడ్డి లేదా విజయశాంతి, జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్ పేర్లను పరిశీలించవచ్చని సమాచారం.

ఆ ఐదు చోట్ల త్రిముఖ పోటీ!

ఆదిలాబాద్, సికింద్రాబాద్, హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్ స్థానాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఆయా స్థానాల్లో బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ నుంచి కూడా పోటీ ఎదురవుతుందని అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో త్రిముఖ పోటీలో నెట్టుకురావాల్సిన అభ్యర్థుల కోసం అన్వేషణ ప్రారంభమయిందని ఆ పార్టీ వర్గాలు చెపుతున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం హైదరాబాద్ నుంచి అజారుద్దీన్ లేదా ఫిరోజ్‌ఖాన్, సికింద్రాబాద్ నుంచి అనిల్‌కుమార్ యాదవ్ లేదా నవీన్ యాదవ్, నిజామాబాద్ నుంచి ధర్మపురి సంజయ్ లేదా టి.జీవన్‌రెడ్డి, కరీంనగర్ నుంచి అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మాజీ మంత్రి ఎమ్మెస్సార్ మనుమడు రోహిత్‌రావు, పాడి ఉదయానందరెడ్డి, ఆదిలాబాద్ నుంచి నరేశ్ జాదవ్ లేదా మరో ఆదివాసీ నాయకుడి పేర్లు పరిశీలిస్తున్నారు. మొత్తం మీద ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో ఒకరిద్దరి పేర్లు మాత్రమే పార్లమెంటుకు పరిగణనలోకి తీసుకుంటామని, అసెంబ్లీ టికెట్ల విషయంలో త్యాగం చేసిన వారికి ఖచ్చితంగా ప్రాధాన్యత ఉంటుందని టీపీసీసీ ముఖ్యనేత ఒకరు చెప్పారు.

నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించం

- అలాంటి అధికారుల వివరాలు ఎప్పటికప్పుడు నాకు అందాలి
- వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: మార్కెటింగ్ శాఖలో ఎవరైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. అలాంటి వారి వివరాలు ఎప్పటికప్పుడు అందించేలా ఉన్నతాధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డుల కార్యదర్శులతో త్వరలో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో మంగళవారం ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చేలా మార్కెట్లు ఆ మేరకు పనిచేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరాలో ప్రైవేటు కంపెనీల దందాను అరికట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు.

మార్కెట్ యార్డులపై వివరాలివ్వండి

రాష్ట్రంలోని మొత్తం 197 మార్కెట్ యార్డుల స్థితిగతులు, వాటి పనితీరు, ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర వివరాలు అందించాలని మార్కెటింగ్ అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన పనులకు సంబంధించిన పనులు, మొదలు కాని వాటి సమగ్ర వివరాలు జతచేయాలని ఆదేశించారు. యార్డుల్లో సమస్యల్ని ఎప్పటికప్పుడు మార్కెటింగ్ అధికారులు పర్యవేక్షించాలని, ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డుల్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యానశాఖకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూముల వివరాలు సమర్పించాలని సూచించారు.

పామాయిల్ సాగును పెంచాలి...

రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తుమ్మల స్పష్టం చేశారు. ప్రతీ జిల్లాలోనూ పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచేలా ఆయిల్ ఫెడ్ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ ఫెడ్‌తోపాటు ఇతర కంపెనీలకు నిర్దేశించిన పామాయిల్ సాగు లక్ష్యం చేరుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పామాయిల్ సాగులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

పామాయిల్ సాగును పర్యవేక్షించాలి

పామాయిల్ సాగు పర్యవేక్షణకు ప్రతీ జిల్లాలోనూ ముగ్గురి చొప్పున అధికారుల్ని నియమించాలని మంత్రి తుమ్మల సూచించారు. జిల్లాల్లో పామాయల్ సాగును ఏఈవోలు సైతం పర్యవేక్షించాలన్నారు. అవసరమైనచోట టీఎస్ ఆయిల్ ఫెడ్‌కు వ్యవసాయశాఖ నుంచి అధికారులు, సిబ్బందిని డిప్యూటేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. పామాయిల్ పరిశ్రమల స్థాపన కోసం దేశంలో ఉన్న అత్యుత్తమ విధానాలు అనుసరించేలాఅధికారులు అధ్యయనం చేయాలన్నారు. ఆయిల్‌పాం విత్తన కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేలా ఉద్యానశాఖ పనితీరు ఉండాలన్నారు. అశ్వారావుపేటలో 400 ఎకరాల్లో ఉన్న వ్యవసాయ కళాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు.

వంద రోజుల్లోగా రూ.500కు సిలిండర్

- పౌర సరఫరాల సంస్థకు రూ.56 వేల కోట్ల అప్పులు.. మరో రూ.11 వేల కోట్ల నష్టాలు
- పౌర సరఫరాల శాఖ సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా వంద రోజుల్లోగా గృహిణులకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కుటుంబ జనాభాకు అనుగుణంగా ఏడాదికి ఎన్ని సిలిండర్లు అందజేయాలనే విషయంలో మార్గదర్శకాలు రూపొందించనున్నట్టు ఆయన చెప్పారు. రైతులకు క్వింటాల్ ధాన్యానికి అదనంగా 500 రూపాయలు బోనస్ ఇచ్చేందుకు విధి విధానాలు రూపొందించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్టు తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఉత్తమ్ మంగళవారం ఆ శాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో చాలా లోపాలున్నాయన్నారు. 'పౌరసరఫరాల సంస్థ వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రూ.56వేల కోట్ల మేర బకాయి పడింది. సంవత్సరానికి 88 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్ కాకుండా రైస్‌మిల్లుల్లో నిల్వ ఉంది. దాని విలువ రూ.18వేల కోట్లు. కార్పొరేషన్ తీసుకున్న అప్పులను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. నిల్వ ధాన్యంతో పాటు ఇప్పుడు సేకరించిన ధాన్యం కలిపి పౌరసరఫరాల సంస్థ వద్ద 1.17 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది. దీనిపై ఏం చేయాలో ముఖ్యమంత్రితో మాట్లాడి కేబినెట్‌లో చర్చిస్తాం' అన్నారు. కొత్త రేషన్‌కార్డుల డిమాండ్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాగా, బుధవారం తన ఎంపీ పదవికి రాజీనామా చేయనున్న ఉత్తమ్.. ఢిల్లీ వెళ్లి లోక్‌సభ స్పీకర్‌కు లేఖను అందచేయనున్నారు.

అప్పులు, ఆడిట్ తీరుపై మంత్రి అసంతృప్తి

తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో పౌర సరఫరాల శాఖతో పాటు కార్పొరేషన్‌లో చోటు చేసుకున్న లోటుపాట్లపై మంత్రి ఉత్తమ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాష్ట్ర విభజన నాటికి రూ.3వేల కోట్ల అప్పులతో ఉన్న పౌరసరఫరాల సంస్థలో ప్రస్తుతం రూ. 56వేల కోట్లు అప్పులు ఉన్నట్టు అధికారులు చూపిన లెక్కలు చూసి మంత్రి అవాక్కు అయినట్టు సమాచారం. గత రబీ సీజన్‌లో కొనుగోలు చేసిన 65.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి తోడు అంతకు ముందు పెండింగ్‌లో ఉన్న ధాన్యం కలిపి 88 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ చేయకుండా మిల్లుల్లో నిల్వచేశారు. దాని విలువ రూ.18వేల కోట్లుగా పేర్కొన్న అధికారులు, ఈ ధాన్యాన్ని విక్రయిస్తే అప్పుల్లో నుంచి ఈ మొత్తాన్ని చెల్లించవచ్చని మంత్రికి వివరించారు. అయితే ఈ ధాన్యాన్ని సీఎంఆర్ చేయకుండా ఎందుకు నిల్వ చేశారని ప్రశ్నించగా, మిల్లులు సరిపడా లేవని అధికారులు సమాధానమిచ్చినట్లు తెలిసింది. పౌరసరఫరాల సంస్థ ఆడిట్ రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లయినా ఎందుకు పూర్తి కాలేదని మంత్రి అడిగినట్టు సమాచారం.

ఏపీ ప్రత్యేక హోదా బాధ్యత కేంద్రానిదే!

- మన్మోహన్ హామీని ప్రధాని మోదీ నెరవేర్చాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. 2014 రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం విభజన హామీలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందని, ఆ విషయాన్ని మోదీ మర్చిపోవద్దని సూచించారు. మంగళవారం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా విద్యార్థి యువజన ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ ఈ పోరాటానికి తన సంపూర్ణ సహకారం, మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్రాన్ని ఆదుకుంటామని విభజన సమయంలో పార్లమెంటు ఉభయ సభల్లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఢిల్లీలోని తెలంగాణభవన్ ఆస్తులు, భూములపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌తో భేటీ

రాష్ట్రంలోని పలు రోడ్ల ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలంటూ మంత్రి కోమటిరెడ్డి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంతోష్‌కుమార్‌యాదవ్‌ను కోరారు. నల్లగొండ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, ఆర్మూరు–మంచిర్యాల రోడ్డు, మల్కాపూర్–విజయవాడ వరకు ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు అనుమతులు ఇవ్వాలని కోమటిరెడ్డి వినతిపత్రాలు సమర్పించారు.

మంత్రి కోమటిరెడ్డికి స్వల్ప అస్వస్థత

సాక్షి, నల్లగొండ ప్రతినిధి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గొంతు సంబంధిత ఇన్‌ఫెక్షన్‌తో ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. స్కానింగ్ చేసిన యశోద ఆస్పత్రి వైద్యులు.. రెండు రోజులు ఆస్పత్రిలో ఉండి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలోనూ ఆయన గొంతునొప్పితో ఇబ్బంది పడ్డారు. ఇటీవల కాలంలో తరచుగా కోమటిరెడ్డి ఢిల్లీ వెళ్లిరావడం, అక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలించకే అస్వస్థతకు లోనైనట్టు తెలిసింది.

అన్నదాతల ఖాతాల్లో రైతుబంధు సొమ్ము

తొలిరోజు ఎకరాలోపు రైతులకు అందజేత!

సాక్షి, హైదరాబాద్: రైతుబంధు సొమ్ము అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ప్రారంభమైంది. ఎకరంలోపు భూమి ఉన్న దాదాపు 22 లక్షలమంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో సుమారు రూ.640 కోట్ల మేర డబ్బులను మంగళవారం జమ చేసినట్టు వ్యవసాయశాఖ వర్గాలు అనధికారికంగా తెలిపాయి. వానాకాలం సీజన్ మాదిరిగానే యాసంగిలో కూడా అదే పద్ధతిలో నగదును రైతులకు అందజేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, ప్రభుత్వం దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని వ్యవసాయ అధికారులు అంటున్నారు. వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేషీ కూడా రైతుబంధు సొమ్ము సమాచారం వెల్లడించలేదు.

కన్నెత్తి చూడని కమల దళం

▶ మొదటి పేజీ తరువాయి

కారణాలపై కనీసం పోస్టుమార్టం కూడా చేయకపోవడంపై రాష్ట్ర పార్టీనేతలు పెదవి విరుస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ ప్రకాష్ జవదేకర్, సహఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ తదితరులు ఫలితాల వెల్లడి తర్వాత ఇటువైపు కన్నెత్తి చూడకపోవడాన్ని ఆ పార్టీ నేతలు తప్పుబడుతున్నారు.

3 రాష్ట్రాల్లో బీజేపీ గెలిచినా...

రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ నుంచి అధికార కైవసం, మధ్యప్రదేశ్‌లో బీజేపీ తిరిగి అధికారంలోకి వచ్చి, తెలంగాణలో మాత్రం నిరాశజనక ఫలితాలు ఎందుకు వచ్చాయన్న విషయాన్ని పార్టీ అగ్ర నాయకత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 111 సెగ్మెంట్‌లలో పోటీ చేసి 8 స్థానాల్లో గెలుపు, 19 చోట్ల రెండోస్థానం, 46 సెగ్మెంట్‌లలో బీజేపీకి డిపాజిట్లు దక్కిన విషయం తెలిసిందే. ఈ ఫలితాలు రావడానికి కారణాలు ఏమిటన్న దానిపై అభ్యర్థుల అభిప్రాయాలు తెలుసుకోకపోవడం ఏమిటనే ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.



అక్కడక్కడా స్థానిక సమీక్షలతో సరి

ఫలితాల తర్వాత కొన్నిచోట్ల అభ్యర్థులు, స్థానిక నేతలు వారి స్థాయిలో ఓటమిపై సమీక్షించారు. దీనిపై రాష్ట్ర పార్టీకి నివేదికలు పంపించినట్టు సమాచారం. మరికొందరు అభ్యర్థులు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని నేరుగా కలిసి ఓటమికి గల కారణాలపై విశ్లేషించినట్టు తెలిసింది. అయితే పార్టీపరంగా ఆయా నియోజకవర్గాలకు వెళ్లి స్థానిక నేతలతో భేటీ అయ్యి ప్రస్తుత ఫలితాలకు దారితీసిన కారణాలపై సమీక్షించి రాష్ట్ర నాయకత్వానికి నివేదికలు ఇవ్వాల్సి ఉన్నా, అందులో ఎలాంటి పురోగతి లేదు. ఎన్నికల ఫలితాల సరళిపై, ఆశించిన స్థాయిలో సీట్లు గెలవకపోవడానికి గల కారణాలు వివరిస్తూ జాతీయ నాయకత్వానికి కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సవివరమైన నివేదిక సమర్పించినట్టు పార్టీవర్గాల సమాచారం.

పాలనలో గుణాత్మక మార్పు

కాంగ్రెస్ నేత నిరంజన్



సాక్షి, హైదరాబాద్: అధికార మార్పిడి జరిగిన అయిదు రోజుల్లోనే రాష్ట్రంలో గుణాత్మక మార్పు వచ్చిందని, ముఖ్యమంత్రిగా రేవంత్ పాలనపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ వ్యాఖ్యానించారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లో రెండు గ్యారంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని చెప్పారు. ఆర్థిక మంత్రి ఆర్థిక శాఖ స్థితిగతులు తెలుసుకుంటున్నారని, సాగునీటి మంత్రి కాళేశ్వరం, మేడిగడ్డ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని, రైతుబంధు నిధులు జమ అవుతున్నాయని, రుణమాఫీ కార్యాచరణ రూపొందిస్తున్నారని, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన ప్రారంభమైందని వివరించారు. ఈ మార్పులన్నింటితో తెలంగాణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

సుప్రీంకోర్టు తీర్పుపై వీహెచ్‌పీ హర్షం

సాక్షి, హైదరాబాద్: ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం సరైనదేనని సుప్రీంకోర్టు తీర్పునివ్వడంపై విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) హర్షం వ్యక్తం చేసింది. 370 అధికరణంతో కశ్మీర్ ప్రాంతం దశాబ్దాలపాటు బందీ అయిందని, ఆర్టికల్ రద్దుతో అక్కడి ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటారని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి పండరీనాథ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆర్టికల్ 1 ప్రకారమే కాకుండా.. ఆర్టికల్ 370 బట్టి చూసినా జమ్మూ కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే. అలాంటప్పుడు దానికి ప్రత్యేక సార్వభౌమాధికారం అంటూ ఏమీ ఉండబోదు' అంటూ సుప్రీంకోర్టు పేర్కొనడం హర్షణీయమన్నారు.



భట్టికి టీటీడీ డైరీ, కేలండర్ అందజేస్తున్న తిరుమల దేవస్థానం ఈవో ధర్మారెడ్డి

మీరే పునాదులు కావాలి

ప్రణాళిక శాఖ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి; హైదరాబాద్/మధిర: 'ప్రభుత్వ ఆలోచనాసరళికి అనుగుణంగా అద్భుతమైన సంక్షేమ రాజ్యంగా తీర్చిదిద్దే ప్రణాళికలు మీ శాఖ నుంచే పుట్టుకు రావాలి' అని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులకు ఉద్బోధించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి ప్రణాళిక శాఖ కార్యక్రమాల గురించి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రణాళిక శాఖ అధికారుల విధులు, తయారు చేసే ప్రణాళికలు, సేకరించే గణాంకాల వివరాలను రామకృష్ణారావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. భట్టి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో ప్రణాళిక శాఖ కీలకమని, ఆ శాఖ రూపొందించే ప్రణాళికలు అభివృద్ధికి దిక్సూచి అవుతాయన్నారు. గణాంకాలను వాస్తవాలకు దగ్గరగా రూపొందించాలని సూచించారు. ఆ శాఖ రూపొందించిన 'తెలంగాణ స్టేట్ ఎట్ ఏ గ్లాన్స్'అనే పుస్తకాన్ని భట్టి ఆవిష్కరించారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భట్టి

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని భట్టివిక్రమార్క తన సతీమణి నందిని, కుమారులు సూర్య విక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్యతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. భట్టికి టీటీడీ డైరీ, కేలండర్‌ను తిరుమల దేవస్థానం ఈవో ధర్మారెడ్డి అందజేశారు.

ప్రతి అర్జీకి రిఫరెన్స్ నంబర్: మంత్రి సురేఖ



వినతి పత్రం స్వీకరిస్తున్న మంత్రి సురేఖ

సాక్షి, హైదరాబాద్: ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించే ప్రతి అర్జీకి ఒక నిర్దిష్ట (రెఫరెన్స్) నంబర్‌ను కేటాయిస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. అర్జీని పరిష్కరించడంలో పురోగతిని తెలుసుకునేందుకు వీలుగా సంబంధితుల ఫోన్‌కు ఆ నంబర్‌ను ఎస్ఎంఎస్ రూపంలో పంపిస్తామని చెప్పారు. ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకున్నారు. అర్జీ దారుల సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వచ్చే శుక్రవారం మళ్లీ ప్రజావాణి

ప్రజాభవన్‌లో ఇకపై ప్రతి మంగళ, శుక్రవారాల్లో రెండు రోజులు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఇది కొనసాగుతుంది. ఈ మేరకు వచ్చే శుక్రవారం మళ్లీ ప్రజావాణి జరగనుంది.

చిరుధాన్యాలతో ఆహార, ఆరోగ్య భద్రత

మిల్లెట్స్‌పై అంతర్జాతీయ రౌండ్ టేబుల్‌లో వక్తలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ ఖాదర్ వలీ, సుభాష్ పాలేకర్, డా. చంద్రశేఖర్

సాక్షి సాగుబడి, హైదరాబాద్: చిరుధాన్యాలను రోజువారీ ప్రధాన ఆహారంగా తీసుకోవటానికి అలవాటు పడితే యావత్ మానవాళికి ఆహార /పౌష్టికాహార భద్రతతో పాటు ఆరోగ్య/పర్యావరణ భరోసా దొరుకుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 'చిరుధాన్యాలతో ప్రపంచ ప్రజలకు ఆహార భద్రత'అనే అంశంపై రాజేంద్రనగర్‌లోని జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ (మేనేజ్)లో మంగళవారం ప్రారంభమైన మూడు రోజుల అంతర్జాతీయ రౌండ్‌టేబుల్ సమావేశంలో 31 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. 'మేనేజ్'తో కలసి ఆఫ్రికా ఆసియా గ్రామీణాభివృద్ధి సంస్థ (ఏఏఆర్‌డీఓ) నిర్వహిస్తున్న ఈ రౌండ్ టేబుల్ ప్రారంభ సమావేశంలో మిల్లెట్ మాన్ ఆఫ్ ఇండియా, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.ఖాదర్ వలితో పాటు ప్రకృతి వ్యవసాయ పితామహుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ ప్రధాన ప్రవంతి వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలసి తొలిసారి వేదికను పంచుకోవటం విశేషం.

డయాబెటిస్, బీపీ మందులు తగ్గించొచ్చు..

గోధుమలు, వరి బియ్యాన్ని హరిత విప్లవం పేరుతో ప్రోత్సహిస్తూ పారిశ్రామిక ఆహారోత్పత్తులను ముందుకు తేవటం వల్లనే చిరుధాన్యాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని, ఇందువల్లనే ఆహార భద్రత సమస్య ఉత్పన్నమైందని డా.ఖాదర్ వలీ పేర్కొన్నారు. సిరిధాన్యాలను రోజువారీ ప్రధాన ఆహారంగా తీసుకుంటే డయాబెటిస్, బీపీ, ఊబకాయం, కేన్సర్ వంటి జబ్బులకు వాడుతున్న మందులను క్రమంగా మానివేస్తూ పూర్తి ఆరోగ్యాన్ని సంతరించుకోవచ్చన్నారు. సుభాష్ పాలేకర్ ప్రసంగిస్తూ.. రసాయనాలతో పండించటం వల్ల చిరుధాన్యాల్లో పోషకాలు తగ్గిపోవటమే కాకుండా, రసాయనిక అవశేషాల వల్ల ప్రజలకు హాని కలుగుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ఆఫ్రికా దేశాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా చిరుధాన్యాల సాగును, వినియోగాన్ని ప్రోత్సహించటంపై పాలకులు దృష్టి కేంద్రీకరిస్తే ఆహార భద్రత సమస్య, పర్యావరణ సమస్య కూడా తీరిపోతుందని పేర్కొన్నారు. భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్) సంచాలకులు డా. సి.తార సత్యవతి, 'మేనేజ్'డైరెక్టర్ జనరల్ డా. పి.చంద్రశేఖర్, ఏఏఆర్‌డీఓ ప్రధాన కార్యదర్శి మనోజ్ నర్‌దేవ్‌సింగ్, డా.సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు కేంద్రం రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

ఆర్.కృష్ణయ్య డిమాండ్



కేంద్రమంత్రి రాందాస్ అద్వాలేను కలిసిన ఆర్.కృష్ణయ్య తదితరులు

కాచిగూడ (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో మంగళవారం కేంద్రమంత్రి రాందాస్ అద్వాలేను కలిసి బీసీ సమస్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకం దేశమంతటా అమలు చేయాలని కృష్ణయ్య కోరారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 56 శాతం జనాభా ఉన్న 75 కోట్ల మంది బీసీలకు రూ.1,400 కోట్లు కేటాయించి అవమానించిందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన మండల్ కమిషన్ బీసీల అభివృద్ధికి 40 సిఫార్సులు చేస్తే అందులో ఆర్థికాభివృద్ధికి 16 సిఫార్సులు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వేణుమాధవ్, మారేశ్, నీరడి భూపేశ్‌సాగర్, మహేందర్, పృథ్వీగౌడ్, రవీందర్, బాషయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఏమిటి చెడు? చంపడం చెడు. అబద్ధం చెడు. దూషణ చెడు.
అసూయ చెడు. ద్వేషం చెడు. ఈ చెడుకు మూలకారణం ఏమిటి?
చెడుకు మూలకారణం కోరిక. చెడుకు మూలకారణం భ్రాంతి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 13 డిసెంబర్ 2023

లెక్కకు రాని కట్టలు ఎన్నో!

రికార్డులు తిరగరాసిన ఉదంతమిది. అయితే అది వన్నె తెచ్చే రికార్డు కాకపోవడమే విషయం. యాభై మంది బ్యాంక్ అధికారులు, 40 కౌంటింగ్ మిషన్లు, ఆరు రోజుల పాటు అలుపెరగని సోదా, దొరికిన 350 కోట్లకు పైగా నగదు... దేశంలో ఇంతవరకూ ఏ దర్యాప్తు సంస్థ జరిపిన సోదాల్లోనూ కనివిని ఎరుగని కళ్ళు తిరిగే లెక్కలివి. జార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూ కుటుంబ డిస్టిలరీ సంస్థపై రాంచీ సహా వివిధ ప్రాంతాల్లో ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులు నిర్వహిస్తున్న దాడులు వారం రోజులుగా వార్తల్లో ముఖ్యాంశమవడానికి ఇదే కారణం. లెక్కింపు మిషన్లు కూడా మొరాయించేలా, గుట్టలు గుట్టలుగా సంచులకొద్దీ డబ్బు ఒక ప్రజాప్రతినిధికి సంబంధించిన సంస్థల్లో దొరకడం సామాన్య ప్రజానీకాన్ని ముక్కున వేలేసుకొనేలా చేస్తోంది.

మునుపెన్నడూ లేనంతగా ఒకేసారి ఇంత డబ్బు ఐటీ సోదాల్లో దొరకడం సహజంగానే అధికార పక్షానికి అందివచ్చిన అస్త్రమైంది. ప్రతిపక్ష కాంగ్రెస్‌ను ఇరుకునపెట్టడంలో బీజేపీ నేతలు బిజీ అయ్యారు. సాక్షాత్తూ ప్రధాని, పార్లమెంట్ సాక్షిగా హోమ్ మంత్రి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లోని ప్రసిద్ధ 'మనీ హైస్ట్' సిరీస్ తరహాలో కాంగ్రెస్ అవినీతి దోపిడీ సాగుతోందని ప్రధాని వీడియో మీమ్‌లు పెట్టడం కొసమెరుపు. వెరసి, కాంగ్రెస్‌ది కక్కలేని మింగలేని పరిస్థితి. అయిదుగురు సోదరుల సాహూ కుటుంబమంతా తర తరాలుగా పార్టీ విధేయులూ, వివిధ సమయాల్లో చట్టసభ సభ్యులూ కావడంతో ఆ పార్టీ తప్పించు కోలేని దుస్థితి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హిందీ నడిగడ్డ మీద మూడు రాష్ట్రాల్లో ఓటమి పాలై, అందులోనూ రెండు రాష్ట్రాల్లో అధికారం కోల్పోయి డీలా పడ్డ కాంగ్రెస్‌ను ఇది ఇరుకున పడేసింది. ఈ పరిస్థితుల్లో లెక్కలేని ఈ ధనరాశుల మచ్చ తనపై పడకుండేలా ఆ పార్టీ శతవిధాల యత్నిస్తోంది. బాహాటంగా సాహూను ఏమీ అనకున్నా, ఈ సోదా నగదుపై వివరణ కోరిందన్నది వార్త.

సోదాల్లో దొరికిన నగదులో అధిక మొత్తం బౌధ్ డిస్టిలరీస్ గ్రూపులో బయటపడ్డదే. అయితే, సాహూ కుటుంబం తరతరాలుగా సారాయి వ్యాపారంలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో భారీగా సాగే ఇలాంటి వ్యాపారంలో నగదు చెల్లింపులే ఎక్కువన్నదీ బహిరంగ సత్యమే. పైగా, కుటుంబసంస్థలో కాంగ్రెస్ ఎంపీ సాహూ కనీసం డైరెక్టరైనా కాదు. సాహూ కుటుంబ సంస్థ అయినంత మాత్రాన ఆ డబ్బు సాహూది ఎలా అవుతుంది? అంతకు మించి ఆ డబ్బంతా కాంగ్రెస్‌దెలా అయిపోతుంది? ఇదీ హస్తం పార్టీ సమర్థకుల వాదన. సాంకేతికంగా అది నిజమే! అయితే, ఇందిరా గాంధీ కాలం నుంచి కాంగ్రెస్ వెంట నడిచి, ఒకటికి రెండు మూడు సార్లు ఎంపీలైన సాహూ సోదరుడు, సాహూ... తమ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచేందుకు తమ వ్యాపార రాబడిని ఆసరాగా చేసుకొని ఉంటారనేది ఊహకందని విషయమేమీ కాదు. అది సాక్ష్యాధారాలతో సంబంధం లేని సామాన్య ఇంగితం.


ఆరోపణలు, వివరణల మాటెలా ఉన్నా తాజా సాహూ వ్యవహారం మరింత లోతైన వ్యవహారాన్ని సూచిస్తోంది. సమాజంలో పేరు, పలుకుబడి ఉన్న పెద్దమనుషుల వద్ద లెక్కాజమా లేకుండా పోగుపడుతున్న ధనరాశుల చిట్టాలో ఇది లవలేశమేనన్న స్పృహ కలిగిస్తోంది. దాదాపు నూటికి 42 మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బీద రాష్ట్రంలో, నూటికి 48 మంది ప్రజానీకం పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న రాష్ట్రంలో ఒక మద్యం డిస్టిలరీ సంస్థ వద్ద ఇంత ధనం దొరకడం సమకాలీన సమాజంలోని విరోధాభాస. సామాన్యులు తమ ప్రతి పైసా ఆదాయానికీ, ఖర్చుకూ లెక్కలు పూచీపడుతుంటే, బడా బాబుల వద్ద లెక్కకందని డబ్బుల కట్టలు మూలుగుతుండడం బయటపడ్డ ప్రతిసారీ దిగ్భ్రాంతి కలిగిస్తూనే ఉంది. పెద్ద నోట్ల రద్దు లాంటి ఆలోచనలు పదేపదే నిష్ఫలమైన తీరునూ కళ్ళ ముందుంచుతోంది.

నిజానికి రాజకీయాలకూ, వ్యాపారానికీ మధ్య బంధం కొత్తేమీ కాదు. విజయ్ మాల్యా, అదానీ, అంబానీ అంటూ పేర్లు మారవచ్చేమో కానీ, అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ అనుకూలురితో అధికార పీఠం బంధాలు పెనవేసుకోవడం దశాబ్దాలుగా దేశంలో చూస్తున్నదే. వందల రెట్లలో ఎదుగుతున్న వ్యాపార లెక్కల పైనే కాదు... పీఎం కేర్ ఫండ్స్ మొదలు పార్టీలకు అందుతున్న విరాళాలు, ఎలక్టోరల్ బాండ్స్‌పైనా రచ్చ రేగుతున్నది అందుకే. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, పన్ను లెక్కల్లో చూపని అక్రమ ధనం స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్ళ తర్వాతా దేశాన్ని పట్టి పీడిస్తూనే ఉండడం విషాదం. ప్రతి 10–15 ఏళ్ళకోసారి స్వచ్ఛంద ఆదాయ వెల్లడి పథకం ప్రకటిస్తున్నా నల్ల డబ్బు చీడ తొలగలేదు. చివరకివి ఆర్థికవ్యవస్థనే తలకిందులుచేసే స్థాయికి పెరిగిపోవడం దిగ్భ్రాంతికరం.

డిజిటల్ చెల్లింపులు ప్రాచుర్యంలో పెట్టామని జబ్బలు చరుచుకొంటే చాలదు. ఆ పరిధిలోకి రాని ఇలాంటి నగదు గుట్టలను అరికట్టే ప్రణాళికలు చేపట్టాలి. రెండో ప్రపంచ యుద్ధానంతరం కొన్ని దేశాల్లో చేసినట్టే... నిర్ణీత పరిమితి దాటి ఎవరైనా అనధికారికంగా నగదు కలిగివుంటే తక్షణ శిక్షార్హ నేరంగా పరిగణించేలా చట్టం తేవాలి. అధికార పార్టీ నేతలపైనా ఆరోపణలు వినిపిస్తున్న వేళ, తరతమ భేదాలు లేని చర్యలు అవసరం. పైగా, వచ్చే ఎన్నికల్లో అవినీతి అంశాన్ని అస్త్రంగా చేసుకొని ఉరకాలని భావిస్తున్న అధికార పార్టీ నుంచి మరింత జవాబుదారీతనం ఆశిస్తాం. ప్రతిపక్షానికి సైతం తామే కాదు... తమ ఎంపీలూ పులు కడిగిన ముత్యాలేనని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఉంది. అవేమీ లేకుండా, సామాన్యులకు చిరకాలం గుర్తుండే ఈ నగదు కట్టల దృశ్యాలు వట్టి వైరల్ వీడియోలుగా, శుష్క ఆరోపణలుగా మిగిలిపోతేనే కష్టం.

ఆర్థిక వ్యవస్థపై గ్యారంటీల ప్రభావం

అభిప్రాయం



కంచ ఐలయ్య షెపర్డ్

తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల సమయంలో ఇచ్చిన 'ఆరు గ్యారంటీల' హామీని నెరవేర్చడానికి శ్రీకారం చుట్టింది. సమాజంలోని రైతులూ, మహిళలూ, యువత, వృద్ధుల వంటివారిని ప్రధానంగా దృష్టిలో పెట్టుకొని ఇచ్చిన ఈ సంక్షేమ గ్యారంటీలను సంప్రదాయ, మితవాద ఆర్థిక వేత్తలు 'ప్రభుత్వ డబ్బుల ఉచిత పందారం' లాగా చూస్తున్నారు. ఇలాంటి పథకాలు వ్యవసాయ ప్రజారాశులను సోమరిపోతులను చేస్తున్నాయని కూడా వీరు వాదిస్తున్నారు. నిజానికి ఈ పథకాలను అమలు చేస్తే... డబ్బు బడ్జెట్ నుంచి ప్రజలకూ, ప్రజల నుంచి మార్కెట్లకూ, మార్కెట్ల నుంచి మళ్లీ రాష్ట్ర ఖజానాకూ సమకూరడం ఒక సాధారణ ప్రక్రియగా ఉంటుంది.

తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో వాగ్దానం చేసిన ఆరు హామీలను (గ్యారంటీలు) తక్షణమే అమలు చేయడానికి ప్రభుత్వ ఫైళ్లపై సంతకం చేశారు. మొట్ట మొదటి సారిగా ఒక జాతీయ పార్టీ చరిత్రలో ఇంత భారీ మొత్తాలను బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తానని హామీ ఇచ్చింది. అలాగే పేదరికంలో ఉన్న గ్రామీణ వ్యవసాయ దారులకు, చేతివృత్తుల వారికి నేరుగా ప్రభుత్వం ద్వారా వివిధ పథకాల కింద ఖర్చు చేయడానికి కూడా హామీ ఇచ్చింది.

1) **మహాలక్ష్మి పథకం:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెల మహిళలకు రూ. 2,500 ఇస్తామని హామీ ఇచ్చింది. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తానని చెప్పింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామంది– ఇప్పటికే ఉచిత ప్రయాణ హామీని అమలు చేస్తోంది కూడా.

2) **రైతు భరోసా:** రైతులకు ప్రతి సంవత్సరం ఎకరాకు రూ. 15 వేలు లభిస్తుంది; వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు; వరి పంటకు సంవత్సరానికి రూ. 5 వందలు బోనస్ ఇవ్వనున్నారు.

3) **గృహ జ్యోతి:** ఈ పథకం కింద ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

4) **ఇందిరమ్మ ఇండ్లు:** తెలంగాణ ఉద్యమ యోధులందరికీ 250 చదరపు గజాల ప్లాట్; ఇంటి స్థలం, సొంత ఇల్లు లేని వారికి రూ. 5 లక్షలు ఇస్తామంది.

5) **యువ వికాసం :** విద్యార్థులకు రూ. 5 లక్షల విలువైన విద్యా భరోసా కార్డుజారీ; ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు హామీ.

6) **చేయూత:** సీనియర్ సిటిజన్లకు 4 వేల రూపాయల నెలవారీ పెన్షన్; రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా కింద రూ. 10 లక్షల వరకు ఖర్చు భరించడం.

పైన పేర్కొన్న ఆరు గ్యారంటీల్లో 'రైతు భరోసా' పథకం కింద వ్యవసాయ ఆర్థిక రంగానికి అతిపెద్ద మొత్తం బదిలీ చేస్తున్నారు. ఈ పథకం కింద భూమిని కౌలుకు ఇస్తున్న భూ యజమానులతో పాటూ కౌలుదారులకూ రూ 15 వేలు వ్యవసాయ పెట్టుబడిగా లభిస్తాయి. ఈ వ్యవసాయ, చేతివృత్తుల సంక్షేమవాదంలో ఉన్న స్పష్టమైన అంతరార్థం ఏమిటంటే, రాష్ట్ర బడ్జెట్ మూలధనంలో చాలా భాగాన్ని గ్రామీణ మార్కెట్లకు మళ్లించవలసి ఉండటమే. ఈ పథకాలన్నీ దళారీ రహితమైనవే. ఎందుకంటే అవన్నీ వ్యక్తిగత ఖాతాలకు నేరుగా జమ అయ్యే డిజిటల్ బదిలీలు. ఇందులో ఎమ్మెల్యేలు లేదా రెవెన్యూ ఉన్నతాధికారులకు ఎలాంటి నియంత్రణా ఉండదు. ఉద్యోగులు సాధారణ నెలవారీ లేదా కాలానుగుణంగా బ్యాంకు ఖాతాలకు రైతు భరోసా డబ్బు బదిలీని పర్యవేక్షిస్తారు. ఆర్థిక స్థితిని ధృవీకరించడం ద్వారా అవసరమైన లబ్ధిదారులను గుర్తించాల్సిన బాధ్యత ఎటూ అధికారులకు ఉంటుంది. ఈ పథకాలలో చాలా వరకు కులంతో అస్సలు సంబంధం ఉండదు. అయితే ధనవంతులకూ, అతి సంపన్న భూ యజమానులకూ ఈ రకమైన డబ్బు బదిలీని భవిష్యత్తులో సమీక్షించాల్సిన అవసరం ఉంది.



గ్రామీణ పేద కుటుంబాలకు, ముఖ్యంగా పేద మహిళలకు కుటుంబంలో వారి స్థానాన్ని మెరుగుపరచడంలో 'మహాలక్ష్మి' పథకం ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఇది పేద మహిళ ఖాతాలోకి రూ. 2,500 జమచేయడమే కాక ఐదు వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్‌ను ఇస్తుంది. దీనికి అదనంగా ఇచ్చిన రాష్ట్రం అంతటా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం గ్రామీణ మహిళల సామాజిక చలనాన్ని పెంచుతుంది. ఇందువల్ల పర్యాటక రంగమూ అభివృద్ధి చెందుతుంది. ప్రయాణ ప్రక్రియలో మహిళలు మార్కెట్‌లో మెరుగైన వ్యక్తిగత శ్రద్ధతో, బస, వసతి, పిల్లల శ్రేయస్సుపై ఎక్కువగా వెచ్చిస్తారు.

రైతు భరోసా, మహాలక్ష్మి, చేయూతకు ప్రతి నెలా, ప్రతి పంట సీజన్‌లో చేసే నగదు బదిలీలు గణనీయమైన స్థాయిలో నగదు ప్రజల చెంతకు వెళుతుంది. అలాగే 'యువవికాసం' కాక, వివాహ సహాయం కోసం లక్షరూపాయలతో పాటు 10 గ్రాముల బంగారం బహూకరించడం వంటి పథకాలు సంక్షేమానికి గణనీయమైన మొత్తాన్ని జోడిస్తాయి. అయితే, పరిశ్రమలకు భారీ ఆర్థిక సహాయాన్ని సమర్థిస్తూ, మెరిట్ పేరుతో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను వ్యతిరేకించే అనేక మంది నయా ఉదారవాద ఆర్థికవేత్తలు, ఈ రకమైన వ్యవసాయ, చేతివృత్తులకు సంబంధించిన సంక్షేమ పథకాలు ప్రమాదకరమని చెబుతూ వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి పథకాలు వ్యవసాయ ప్రజారాశులను సోమరిపోతులను చేస్తున్నాయని కూడా వీరు వాదిస్తూనే ఉన్నారు. ఇది అసంబద్ధ వాదన. ఈ పథకాల ద్వారా లభించే డబ్బును వ్యవసాయ పనులకే కాక ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సుకూ తోడ్పడుతుంది. ప్రజాస్వామ్య సంక్షేమ వ్యవస్థ పట్ల వారికి గౌరవం పెరుగుతుంది.

ఈ పథకాల అమలుతో గ్రామీణ మార్కెట్లు మరింత చైతన్య వంతం కానున్నాయి. బడా కాంట్రాక్ట్ అర్బన్ మాల్ ఆర్థికవ్యవస్థకి వ్యతిరేకంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ గ్లోబలైజ్డ్ ప్రపంచంతో అనుసంధానం అవుతుంది. గ్రామీణ కుటుంబాలు నెలవారీగా చేసే ఖర్చుల నుండి జీఎస్టీ రాబడి అనేక రెట్లు పెరుగుతుంది. ఇటువంటి పథకాల వల్ల, నగదు నిల్వ చేయటం లేదా బ్యాంకుల్లో భారీ మొత్తాలను ఉంచడం లేదా హవాలా ద్వారా విదేశాలకు డబ్బును బదిలీ చేయడం వంటి వాటికి అవకాశం ఉండదు. డబ్బు బడ్జెట్ నుంచి గ్రామీణ ప్రజలకూ, ప్రజల నుంచి మార్కెట్లకూ, మార్కెట్ల నుంచి మళ్లీ రాష్ట్రానికీ జీఎస్టీ ద్వారా సమకూరడం ఒక సాధారణ ప్రక్రియగా ఉంటుంది. అంటే సంక్షేమ పథకాల డబ్బులు మన రాష్ట్రంలోనే తిరుగాడుతూ రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేస్తాయన్నమాట!

ఇలా డబ్బు బదిలీ వల్ల పురుషులు మద్యం సేవించడం పెరుగుతుందనే వాదన కూడా ఉంది. ఆ ప్రమాదం ఉందనడంలో సందేహం లేదు. అయితే మహిళల ఖాతాలకు డబ్బును బదిలీ చేయడం వల్ల కచ్చితంగా అలాంటి డబ్బుపై తాగుబోతుల నియంత్రణ తగ్గుతుంది. ఉదాహరణకు, రైతు భరోసా కింద కూలీలకు ఇచ్చే 12 వేల రూపాయలను తల్లుల ఖాతాలకు బదిలీ చేస్తే, తాగే అలవాటు ఉన్న భర్తతో సహా కుటుంబానికి మెరుగైన ఆహారాన్ని అందించడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది ఆమె. అలాగే మెరుగైన పాఠశాల, కళాశాల విద్యను అందుబాటులో ఉంచితే చదువుకున్న పిల్లలు తాగుబోతు అయిన తండ్రితోపాటు కుటుంబ సంస్కృతిని కూడా ప్రభావితం చేయగలుగుతారు.

ప్రజాస్వామ్యం అంటే కేవలం హైవేలు, రైల్వేలు, ఎయిర్‌వేలు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడమే కాదు, అది మరింతగా ప్రజా సంక్షేమంపై దృష్టి కేంద్రీకరించి ఉత్పాదాత్మకంగా పనిచేయాలి. కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీ కర్ణాటక ఎన్నికలతో కొత్త అధ్యాయానికి తెరతీసింది. తెలంగాణలో భారత రాష్ట్ర సమితికి పోటీగా సంక్షేమ ఎజెండాను పెంచింది. నయా ఉదారవాద, మితవాద ఆర్థికవేత్తల ప్రభావంతో కాంట్రాక్టు ఆర్థిక వ్యవస్థపై లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడం ద్వారా, బడా వ్యాపారులకు, హైవే ఎకానమీకి మద్దతు ఇవ్వడం కోసం బీజేపీ ఇటువంటి సంక్షేమ పథకాలను వ్యతిరేకిస్తోంది. ఆ విధానంతో దక్షిణాదిలో విజయం సాధించలేరు. గ్రామీణ వ్యవసాయదారులకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తెలంగాణా ప్యాకేజీ... జాతీయ సంక్షేమంపై చర్చను ప్రభావితం చేస్తుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇష్టం - కష్టం



ఆర్టికల్ 370 రద్దు సబబేనని అత్యున్నత న్యాయస్థానం తీర్పిచ్చింది. చాలామందికి ఇది కొత్తదారులు వేసేది, ఇంకొందరికి గుండెలు పగిలిపోయేది.

– కపిల్ సిబల్, న్యాయవాది

సరైన ఎంపు?



తర్వాతి హార్వర్డ్ (విశ్వవిద్యాలయ) అధ్యక్షుడిని వారి మేధా విజయాల ప్రాతిపదికన ఎంపిక చేసే అవకాశం ఉందా? తెలివైనవాళ్లు చాలామంది ఆ పదవిని కోరుకోరన్నది నిజమే అయినా, ఎవరైనా ఉండొచ్చు కదా!

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

అన్నీ చూసుకుని...



భజన్ లాల్ శర్మ రాజస్థాన్‌కు కొత్త ముఖ్యమంత్రి అవుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనుడు, మధ్యప్రదేశ్‌లో ఓబీసీ సీఎం అయ్యాక రాజస్థాన్‌కు బ్రాహ్మణుడు వచ్చారు. సామాజిక కూర్పు పూర్తయింది. (లింగ అంతరం అలాగే ఉంది: దేశంలో ఇప్పుడు ఒకే మహిళా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ). నచ్చనీ, నచ్చకపోనీ... ఎంపికలోనూ, గతం నుంచి బయటపడటంలోనూ కులం అనేది ఇప్పటికీ గణనీయమైన అంశమే.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఇంట్లో వండేదే...



నా డైట్‌ను నా భార్య గానీ, అమ్మగానీ నిర్ణయిస్తుంది. ప్రస్తుతం నాకే స్పెషల్ డైట్ చార్ట్ లేదు. వాళ్లు ఏం వండుతారో అదే తింటాను. ఇంట్లో భోజనం అందరికీ ఒకటే – నాకేం ప్రత్యేకంగా ఉండదు.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

స్థాయికి తగవు...



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ: మీ పాత పద్ధతిలోనే పోస్టులు పెట్టండి. అటూయిటుగా ఒక వారం నుంచి, మీ కొన్ని పోస్టులకు వాడుతున్న భాష, గొంతు, ఎమోజీలు మీ కార్యాలయానికి తగినట్టుగా లేవు. మీ కార్యాలయంలో మీ ఆలోచనలు పోస్టు చేస్తున్న మనిషిని మార్చాలి.

– డి. ముత్తుకృష్ణన్, ఫైనాన్షియల్ ప్లానర్

ముందే చెప్పొద్దా?



గణతంత్ర దినోత్సవాలకు అతిథిగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ రాకపోవచ్చునని ఒక వార్త. అది నిజమే అయితే, ఇది బైడెన్ ప్రభుత్వపు వైఫల్యం. ఆహ్వానాన్ని వాళ్లు బహిరంగపరిచి, ఇండియాను దానికి కట్టుబడి ఉండేలా చేశారు. కేవలం ఆరు వారాల వ్యవధి మాత్రమే ఉండటంతో ప్రత్యామ్నాయం కోసం ఇండియా ఇప్పుడు ఘర్షణ పడాల్సి ఉంటుంది. 'రెండో ఎంపిక' కావడం మరొక ఇబ్బంది అవుతుంది. యూఎస్ అస్తవ్యస్త దౌత్యానికి ఇదొక నిదర్శనం. కొంత ప్రాథమిక విచక్షణ, తంత్రం పాటించివుంటే ఈ డ్రామా లేకుండాపోయేది.

– సదానంద్ ధూమే, కాలమిస్ట్

ఇరు వైపులా...



'ఇజ్రాయెల్ అనుకూల', 'పాలస్తీనా అనుకూల' లాంటి పదాలు నాకు నచ్చవు. ఎందుకంటే, ఎంపిక ఏదో ఒకవైపు ఉండాలన్న భావనను అవి కలిగిస్తున్నాయి. ఇజ్రాయెల్ ఉనికిలో ఉండే హక్కుకు సానుకూలంగా ఉంటూనే, పాలస్తీనా అనుకూల స్వేచ్ఛ కోసం నిలబడొచ్చు.

– జెమీమా గోల్డ్‌స్మిత్, స్క్రీన్‌రైటర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.పాడ్యమి తె.4.05 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి విదియ, **నక్షత్రం:** జ్యేష్ఠ ప.12.02 వరకు తదుపరి మూల, **వర్జ్యం:** రా.7.54 నుండి 9.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.32 నుండి 12.20 వరకు, **అమృత ఘడియలు:** తె.5.14 నుండి 6.48 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం : 6.25
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఇన్ బాక్స్

బహుముఖ సేవకుడు

కల్లూరి సత్యనారాయణ శాస్త్రి (కేఎస్ శాస్త్రి) స్వాతంత్ర్య యోధులు, గాంధేయవాది, కార్మిక పోరాట నాయకుడు, లోక్ నాయక్ జయప్రకాష్ సంపూర్ణ క్రాంతి కోసం పాటుపడిన త్యాగశీలి, పుస్తకాల ప్రచురణకర్త, లైబ్రరీ వ్యవస్థాపకులు, పర్యావరణ పరిరక్షణాశీలి. ఆయన 1922 నవంబర్ 16న జన్మించారు.

విజయనగరంలో 1942 ఆగస్టు 9న 'క్విట్ ఇండియా' ఉద్యమ సమయంలో కళాశాల విద్యార్థుల సమ్మెకు గాంధీజీ స్ఫూర్తితో నాయకత్వం వహించి నాలుగు నెలల పాటు కఠిన జైలు శిక్ష కూడా అనుభవించారు. 'ఆంధ్రా నేతాజీ'గా కొనియాడబడిన మద్దూరి అన్నపూర్ణయ్య వీరికి స్వయానా బావ. స్వాతంత్ర్య సమర యోధ వెంకట రమణమ్మకు భర్త. ప్రఖ్యాత కవి ఆరుద్ర ఆయనకు సహాధ్యాయి కాగా, ప్రసిద్ధ ఇంగ్లీషు జర్నలిస్టు జీఎస్ భార్గవ కళాశాలలో సీనియర్. జస్టిస్ పున్నయ్య వీరికి మిత్రులు. ఆయన విద్యార్థి దశలోని మిత్రులైన ఎందరో తర్వాతి కాలంలో ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా మంత్రులుగా రాణించారు. కానీ శాస్త్రి మాత్రం అధికారానికి దూరంగా కార్మికరంగానికీ, సేవారంగానికీ దగ్గరగా ఉంటూ వచ్చారు.

సుమారు నాలుగు దశాబ్దాల కాలం (1947 నుంచి 1987) బొబ్బిలి, సీతానగరం, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘాలకూ; భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్ కార్మిక సంఘానికీ, గరివిడిలోని ఫెర్రో ఎల్లాయిస్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్‌కూ; ఆంధ్ర షుగర్స్ వర్కర్స్ ఫెడరేషన్‌కూ, ఆల్ ఇండియా ఎన్ఎండీసీ వర్కర్స్ ఫెడరేషన్ వంటి కార్మిక సంఘాలకూ నాయకుడిగా ఎంతో కృషి చేసి మంచి ఫలితాలు సాధించారు. అలాగే 'కార్మిక జగత్' అనే పక్షపత్రికకు దాదాపు ఏడేళ్ల పాటు సంపాదకత్వం వహించారు.

విద్యార్థి దశలో విజయనగరంలో కస్తూర్బా గాంధీ పేరున రీడింగ్ రూమ్ ప్రారంభించిన కేఎస్ శాస్త్రి 1985లో విశాఖలో 'గాంధీ సెంటర్'నూ, దానికి అనుబంధంగా గాంధీ సాహిత్యపు గ్రంథాలయాన్నీ వృద్ధి చేశారు. గాంధీ భావజాలాన్ని ప్రచారం చేసినందున ప్రజలు ఆయనను 'గాంధీ శాస్త్రి'గా పిలిచేవారు. విశాఖపట్నంలో స్వల్ప అనారోగ్యం తర్వాత 94 ఏళ్ల వయసులో 2016 డిసెంబర్ 13న కన్నుమూశారు.

– డా నాగసూరి వేణుగోపాల్ । 94407 32392
(నేడు కె.ఎస్. శాస్త్రి వర్ధంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

సరైన 'నియంత్రణ'తోనే దివ్యౌషధం

విశ్లేషణ



సుబీర్ రాయ్

భారత్‌లో తయారైన మందులు తీసుకోవడం వల్ల గాంబియా, ఉజ్బెకిస్తాన్ వంటి దేశాల్లో కొంతమంది మరణించినట్లు గత ఏడాది వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ దేశ ఫార్మా రంగంలో నాణ్యత ప్రమాణాలపై సర్వే ప్రారంభించింది. విమర్శకులు చాలాకాలం నుంచి చేస్తున్న ఆరోపణలు కఠిన వాస్తవమని ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికీ స్పష్టంగా తెలిసింది. దీని వల్ల వాస్తవ పరిస్థితులపై ప్రభుత్వ సంస్థల కళ్లు విచ్చుకున్నాయని చెప్పాలి. లేదా చాలాకాలంగా తెలిసిన విషయాలను వీరు అసలు పట్టించుకోలేదని అయినా అనుకోవాలి. సర్వే చెప్పిన అంశాల్లో ఒకటి, దేశంలో నాణ్యత ప్రమాణాలను పాటించడంపై అస్సలు శ్రద్ధ లేదు అన్నది. నిబద్ధత, తగిన శిక్షణ లేకపోవడం అన్నవి సరేసరి. పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నాలు ఇంకా మొదలు కావాల్సి ఉన్నా, సర్వే జరపడమే కొంత ప్రభావం చూపుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ సంస్థలు ఇప్పుడు ఒక్కతీరుగా ఆలోచించడం మొదలు పెట్టాయి.

స్థానికంగా తయారయ్యే మందులకు కేంద్ర ప్రభుత్వ సంస్థలు కాకుండా రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు లైసెన్సులు జారీ చేస్తూంటాయి. దీనివల్ల చాలా మందుల నాణ్యత అనేది రాష్ట్రాన్ని బట్టి మారిపోతూంటుంది. నాణ్యమైన మందులు లేకపోతే ఈ ఆధునిక యుగంలో మరింత ఎక్కువ కాలం జీవించడం అసాధ్యం. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలోనూ ఫార్మా రంగం ప్రాముఖ్యత ఏమిటన్నది కొత్తగా చెప్పుకోవాల్సిన అవసరమూ లేదు. భారత్‌కు ప్రపంచ ఫార్మా రాజధాని అనే పేరుంది. జెనెరిక్ మందు లతో అన్ని దేశాల్లోనూ అవసరార్థులకు మందులు (పేటెంట్ హక్కులు లేనివి) అందుబాటులో ఉండేందుకు కారణమైంది భారత్! ప్రాణాంతక హెచ్ఐవీ నియంత్రణలో ఈ జెనెరిక్ ఔషధాలది చారిత్రాత్మక పాత్ర. భార తీయ ఫార్మా కంపెనీల జెనెరిక్ ఉత్పత్తుల్లేకపోతే ఈ రోజు అమెరికా సహా పలుదేశాల్లో పరిస్థితులు భిన్నంగా ఉండేవి.

భారతీయ ఫార్మా రంగం సాధించిన ఘన విజయాలకు ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి క్రెడిట్ ఇవ్వాల్సి వస్తుంది. 1970లలో ప్రాసెస్ పేటెంట్లకు కట్టుబడుతూనే... ప్రొడక్ట్ పేటెంట్లకు భారత్ 'నో' చెప్పిన విషయం తెలిసిందే. ఈ ఏర్పాటు వల్ల పశ్చిమ దేశాల్లో పేటెంట్ హక్కులున్న ఖరీదైన మందులను కూడా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చౌకగా తయారు చేసే వీలేర్పడింది. ఫలితంగానే భారత్ మోతాదుల పరంగా ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఫార్మా పరిశ్రమగా అవతరించ



గలిగింది. విలువ ఆధారంగా చూస్తే మాత్రం మనది 14వ స్థానం. భారత ఫార్మా రంగం మార్కెట్ విలువ 5,000 కోట్ల డాలర్లు కాగా ఇందులో సగం ఎగుమతుల ద్వారా లభిస్తోంది. ప్రపంచ టీకా డిమాండ్‌లో 60 శాతాన్ని భారత్ పూరిస్తోందంటే పరిస్థితి ఏమిటన్నది తెలుస్తుంది. అమెరికా జెనెరిక్ మందుల డిమాండ్‌లో 40 శాతం భారత్ ద్వారా తీరుతోంది. యూకే ఔషధాలన్నింటిలో 25 శాతం ఇక్కడి నుంచే వెళుతున్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్‌లో తయారయ్యే మందుల నాణ్యతపై ఎలాంటి ప్రశ్నలు ఉత్పత్తి కారాదు.

డైఇథిలీన్ గ్లైకాల్ వంటివి అంధత్వానికి కారణమవుతాయి. ఇటీవలి పరిణా మాల నేపథ్యంలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఎగుమతుల కోసం ఉద్దేశించిన అన్ని దగ్గుమందులను ప్రభుత్వ పరిశోధన శాలల్లో పరీక్షించాలని ఒక ఆదేశం జారీ చేసింది. కానీ ఇదేమంత సత్ఫలితాలు చూపలేదు. ఎందుకంటే, ఫార్మా విషయాలను వాణిజ్య శాఖ పర్యవేక్షించే పరిధి లేక పోవడం. వాణిజ్య శాఖ ఇంకో ప్రశ్న కూడా లేవనెత్తింది. ఇలాంటి కల్తీ దగ్గు మందుల కారణంగా భారతీయ రోగులకు హాని జరగడం లేదా? జమ్మూలో అదే జరిగింది. 2019 డిసెంబరు 2020 జనవరి మధ్యకాలంలో కల్తీ దగ్గుమందు వేసుకోవడం వల్ల దాదాపు 12 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు.

గత ఏడాది 1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ స్థానంలో డ్రగ్స్, మెడికల్ డివైజెస్ అండ్ కాస్మోటిక్స్ బిల్ 2023ను ప్రవేశపెట్టాలని ప్రయత్నించారు. ఇప్పుడున్న వివాదాస్పద అంశాలు వేటికీ ఇందులో చోటు లేకుండా పోయింది. ఫార్మా రంగం సంస్కరణలు లక్ష్యంగా తీసుకొచ్చే ఏ కొత్త చట్టమైనా లైసెన్సింగ్ ప్రక్రియను కేంద్రీకృతం చేయాల్సిన అవసరం ఉంది. అలాగే దేశ వ్యాప్తంగా ఔషధ నియంత్రణ ఏకరీతిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం 28 రాష్ట్రాల్లో డ్రగ్ రెగ్యులేటర్స్ ఉన్నారు. జాతీయ స్థాయిలో ఒకే ఒక్క డ్రగ్ రెగ్యులేటింగ్ వ్యవస్థ... ఈ వ్యవస్థకు సలహా సూచనలు అందించేందుకు రెండు స్టాట్యుటరీ వ్యవస్థలు ఉంటే సరిపోతుంది. డ్రగ్ కంట్రోలర్ కార్యాలయం కూడా స్వతంత్ర సంస్థగా ఉండాలి. దీనివల్ల మంత్రుల ఆమోదం లేకుండానే డ్రగ్ కంట్రోలర్ అవసరమైనప్పుడు నిపుణులను నియమించుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఫార్మా రంగ సంస్కరణల విషయంలో వాంఛనీయమైన పరిణామం ఏదైనా ఉందంటే సంబంధిత మంత్రి చేసిన ఒక ప్రకటన. ''ఫార్మా రంగ నియంత్రణ అనేది సహకార సమాఖ్య తీరులో సాగాలి'' అన్న ఆయన మాటలు ఆచరణలోకి వస్తే వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుకోవడమే కాకుండా... ఒకరికి ఒకరు ఆసరాగా నిలవడం ద్వారా మరింత బలో పేతం కావచ్చు కూడా. పార్టీల మధ్య తీవ్రమైన వైరం నెలకొన్న... త్వరలోనే పార్లమెంటరీ ఎన్నికలు ఇంకో ఆరు నెలల్లో జరగబోతున్న నేపథ్యంలో ఈ మాత్రం మార్పు ఆహ్వానించదగ్గదే!

వ్యాసకర్త సీనియర్ ఆర్థిక విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

క్లుప్తంగా...

మేడిగడ్డపై మళ్లీ విచారణ

- బ్యారేజీలో నీళ్లు పూర్తిగా తోడేసిన తర్వాత చెప్పండి
- రాష్ట్రానికి ఎన్డీఎస్ఏ డైరెక్టర్ లేఖ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటన వెనుక అసలు వాస్తవాలను వెలికితీసేందుకు మరోసారి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహిస్తామని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) స్పష్టం చేసింది. ఎగువ నుంచి వచ్చే ప్రవాహాన్ని దారి మళ్లించడానికి ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ లోపల కాఫర్ డ్యామ్‌ను నిర్మిస్తున్నారు. బ్యారేజీలో నుంచి నీళ్లను పూర్తిగా తోడేసిన వెంటనే తమకు తెలియజేయాలని పేర్కొంటూ సంస్థ డైరెక్టర్ రాహుల్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా లేఖ రాశారు. తొలుత ఎన్డీఎస్ఏ, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నేతృత్వంలోని బృందం బ్యారేజీని తనిఖీ చేసి పియర్లు కుంగడానికి అసలు కారణాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుందని తెలిపారు. బ్యారేజీ కుంగిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తులో తేలిన అంశాలను తప్పనిసరిగా ఎన్డీఎస్ఏకు తెలియజేయాలని సూచించారు. గతంలో బ్యారేజీని పరిశీలించిన ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

'అచ్చంపేట' డీపీఆర్‌ను సమర్పించండి

తెలంగాణను కోరిన కృష్ణా బోర్డు

సాక్షి, హైదరాబాద్: అచ్చంపేట ఎత్తిపోతల పథకంపై ఏపీ ప్రభుత్వం చేసిన ఫిర్యాదుపై కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) స్పందించింది. ఈ ప్రాజెక్టుకి సంబంధించిన డీపీఆర్‌తో పాటు పురోగతి, ఇతర వివరాలను త్వరగా సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు కృష్ణా బోర్డు ఎస్ఈ అశోక్‌కుమార్ సోమవారం లేఖ రాశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఏదుల రిజర్వాయర్ నుంచి నీళ్లను తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వం గత ఆగస్టులో ఈ ప్రాజెక్టును మంజూరు చేసింది. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 85(8)డీతో పాటు 11వ షెడ్యూల్‌లోని 7వ పేరా ప్రకారం కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)/కృష్ణాబోర్డుల అనుమతి లేకుండా కొత్త ప్రాజెక్టులను రెండు రాష్ట్రాలు చేపట్టరాదని లేఖలో గుర్తు చేశారు.

ఐదెకరాలకే 'రైతుబంధు' పరిమితం చేయాలి

సాక్షి, హైదరాబాద్: రైతుబంధు సాయాన్ని ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూములకే పరిమితం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. రైతుబంధుపై పూర్తిస్థాయిలో పునఃసమీక్ష తర్వాతే నిధులు విడుదల చేయాలని కోరారు. ప్రజాధనం నిష్ప్రయోజనం కాకుండా కాపాడాలని సూచించారు. పంట పెట్టుబడి సాయం అర్హులైన రైతులకు దక్కితేనే రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి పెరగడంతోపాటు నిజమైన రైతు సుభిక్షంగా ఉండే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

రామ్‌కో సిమెంట్స్ ఉద్యోగి దినేశ్ రాజయ్య ప్రతిభ



సాక్షి, హైదరాబాద్: రామ్‌కో సిమెంట్స్ ఉద్యోగి దినేశ్ రాజయ్య థాయ్‌లాండ్‌లో జరిగిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్ గేమ్స్-2023లో ప్రతిభ చూపారు. రెండు పతకాలు సాధించి సత్తాచాటారు. థాయ్‌లాండ్ ఆతిథ్యం వహించిన ఈ గేమ్స్‌లో దినేశ్ భారత్ తరఫున బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఒక రజతం, సింగిల్స్‌లో ఒక కాంస్యం సాధించారు. థాయ్‌లాండ్‌లోని నాకోన్ రచ్చసిమలో ఈనెల 1వ తేదీ నుంచి 9 వరకు జరిగిన ఈ గేమ్స్‌లో 48 దేశాలు పాల్గొన్నాయి. వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్ గేమ్స్‌లో ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, సైక్లింగ్, పవర్‌లిఫ్టింగ్, రోయింగ్, షూటింగ్, స్నూకర్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వీల్‌చైర్ ఫెన్సింగ్ వంటి గేమ్స్‌ని నిర్వహించారు.



ఆదిలాబాద్‌లోని ఓ ఏజెన్సీ వద్ద బారులు తీరిన మహిళలు, వృద్ధులు

రూ.500 సిలిండర్ ఈకేవైసీ.. ఇక్కట్లు!

గృహావసర గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ కోసం ఇక్కట్లు పడుతున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రూ.500కే సిలిండర్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా కేంద్రాల్లోని గ్యాస్ ఏజెన్సీల ఎదుట మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచే భారీసంఖ్యలో జనం బారులుతీరారు. పిల్లాపాపలతో తరలివచ్చిన మహిళలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ పథకం అమలుకు ప్రభుత్వం ఇంకా విధివిధానాలు రూపొందించలేదు. అయినా ఈకేవైసీ చేసుకుంటేనే రాయితీ వర్తిస్తుందనే ప్రచారం జరగడంతో వినియోగదారులు ఉరుకులుపరుగులు పెడుతున్నారు. ఏజెన్సీల వద్ద వేలిముద్ర వేసి తమ ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేసుకుంటున్నారు. ఆధార్‌కార్డుగానీ, గ్యాస్ పాస్‌బుక్‌గానీ ఉంటే ప్రత్యేక కౌంటర్‌లో సిబ్బంది ఈకేవైసీ చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్లు, ఆదిలాబాద్, నిర్మల్

సీఎం సీపీఆర్వోగా అయోధ్యరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య ప్రజాసంబంధాల అధికారి (సీపీఆర్వో)గా సీనియర్ జర్నలిస్ట్ బోరెడ్డి అయోధ్యరెడ్డి నియమితులయ్యారు. కో–టర్మినస్ పద్ధతిలో ఆయనను నియమిస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని, దీనికి సంబంధించిన నియమ, నిబంధనలపై విడిగా మరో ఉత్తర్వు జారీచేయనున్నట్లు తెలియజేశారు. సీపీఆర్వోతో పాటు ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డికి పీఆర్వోగా దుదిపల్ల విజయ్‌కుమార్‌ను కూడా కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి విడిగా మరో ఉత్తర్వు జారీ చేశారు.

కోడ్ మూడ్‌లోనే రెవెన్యూ!

రాష్ట్రంలో స్తంభించిన రెవెన్యూ కార్యకలాపాలు

- ఎన్నికలు ముగిసినా కేవలం భూముల రిజిస్ట్రేషన్లకే పరిమితం... ధరణి పోర్టల్‌ను పట్టించుకోని కలెక్టర్లు, తహసీల్దార్లు
- '59 జీవో' దరఖాస్తులూ పెండింగ్‌లోనే...
- ప్రభుత్వ మౌఖిక ఆదేశాలే కారణమనే ప్రచారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెవెన్యూ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు మినహా ఆ శాఖ పరిధిలో ఎలాంటి లావాదేవీలు జరగడం లేదని, ఎన్నికల కోడ్ కారణంగా గత రెండున్నర నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిందన్న సాకుతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించేందుకు కూడా రెవెన్యూ వర్గాలు ముందుకు రాకపోవడం గమనార్హం. ధరణి పోర్టల్‌తో పాటు జీవో 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై నిర్ణయాలు తీసుకోవాల్సిన కలెక్టర్లు ఆ ఫైళ్లన్నింటినీ పక్కన పెట్టేయడం, తాజాగా ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కూడా వాటిని పరిశీలించకపోవడంతో ఏం చేయాలో పాలుపోని స్థితి నెలకొందని రెవెన్యూ వర్గాలే అంటున్నాయి. దీనికి తోడు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయం కూడా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి సుప్త చేతనావస్థలోకి వెళ్లిపోయిందని, కనీసం క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో కూడా ఆరా తీసే పరిస్థితి లేకుండా పోయిందని రెవెన్యూ సిబ్బంది వాపోతున్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ఈ ఏడాది సెప్టెంబర్ నుంచే రాష్ట్రంలో ఎన్నికల సందడి ప్రారంభమయింది. అక్టోబర్‌లో ఎన్నికల షెడ్యూల్‌రాగా, నవంబర్‌లో నోటిఫికేషన్ వెలువడింది. అయితే షెడ్యూల్ వెలువడిన నాటి నుంచే కోడ్ అమల్లోకి రావడంతో అప్పటి నుంచి రెవెన్యూ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ సిబ్బందిదే కీలక పాత్ర కావడం, తహసీల్దార్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా, ఆర్డీవోలు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించాల్సి ఉండటంతో వారు రెవెన్యూ పనులన్నింటినీ పక్కన పెట్టి ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఇక కలెక్టర్లు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఈనెల 4వ తేదీ వరకు (ఎన్నికల కోడ్ ముగిసే వరకు) బిజీబిజీగా ఉన్నారు. దీంతో తహసీల్దార్ నుంచి కలెక్టర్ స్థాయి వరకు రెవెన్యూ వ్యవహారాలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. కనీసం విరాసత్, పెండింగ్ డిజిటల్ సంతకాల దరఖాస్తులను కూడా పరిష్కరించలేదు. దీంతో ప్రస్తుతం ధరణి, జీవో 59 (ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ)లకు చెందిన లక్షలాది మంది దరఖాస్తుదారులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

తదుపరి ఆదేశాల వరకు పెండింగ్‌లోనే?

రాష్ట్రంలో అధికారం చేతులు మారిన నేపథ్యంలో రెవెన్యూ శాఖకు సంబంధించి ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు రెవెన్యూ కార్యకలాపాలు ముట్టుకో వద్దని, అన్ని ఫైళ్లు పెండింగ్‌లో పెట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, ఈ మేరకు కలెక్టర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో చెప్పారని అంటున్నారు. మరోవైపు రెవెన్యూ కార్యకలాపాలపై ఎలాంటి నిర్ణయాలూ తీసుకోవద్దని సీసీఎల్ఏ కార్యాలయానికి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయని కూడా సమాచారం. అయితే ఇవి కేవలం మౌఖిక ఆదేశాలు మాత్రమేనని స్పష్టం చేస్తున్నారు. ఈ ఆదేశాల నేపథ్యంలోనే రెవెన్యూ వ్యవహారాలు స్తబ్దుగా మారాయని ఆ శాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 'రెవెన్యూ వ్యవహారాలపై ప్రభుత్వం ఆదేశాలివ్వడం కొత్తేమీ కాదు. కానీ అధికారంలో ఉన్న పార్టీ మారడంతో రెవెన్యూ సిబ్బందిలో కొంత కంగాళీ ఉన్న మాట మాత్రం వాస్తవం. ఏం చేస్తే ఏం జరుగుతుందోననే ఆందోళనతో ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు..' ఈ శాఖ ముఖ్య అధికారి ఒకరు చెప్పారు. అయితే 'ఎప్పటివో పాత దరఖాస్తులు పరిష్కరించేందుకు అడ్డు వచ్చిందెవరు? జీవో 59 కింద దరఖాస్తులు స్వీకరించి ఆరు నెలలు దాటిపోయింది. వాటి పరిష్కారం వద్దని ప్రభుత్వం ఎందుకు అంటుంది?' అని ప్రశ్నించారు. పైగా వీటి పరిష్కారం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది కదా? 'అని అన్నారు.



విద్యుద్దీపాల కాంతుల్లో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం

భద్రాద్రిలో అధ్యయనోత్సవాలు నేటి నుంచి

భద్రాచలం టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భద్రగిరిలో స్వాగత ద్వారాలు, ఆలయ ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి ఈనెల 21 వరకు స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈనెల 22న తెప్పోత్సవం, 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం ఉంటాయి. వేడుకల్లో భాగంగా బుధవారం నుంచి 22 వరకు పగల్ పత్తు ఉత్సవాలు, 23 నుంచి జనవరి 2 వరకు రాపత్తు ఉత్సవాలుంటాయని ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం నుంచి నిత్యకల్యాణాలు రద్దు చేశామని వెల్లడించారు.

పులిదాడి: పశువు మృతి.. కాపరికి గాయాలు



పులిదాడిలో గాయపడ్డ గులాబ్

కాగజ్‌నగర్ రూరల్: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ అటవీ ప్రాంతంలో పశువుల మందపై పులి దాడి చేసి ఓ ఆవును చంపి.. పశువుల కాపరిని గాయపరిచింది. వివ రాలివి. కాగజ్‌నగర్ మండం వంజీరి గ్రామానికి చెందిన పశువుల కాపరి అల్లూరి గులాబ్‌దాస్ (42) పశువులను మేపేందుకు అంకుసాపూర్ అటవీ ప్రాంతానికి వెళ్లాడు. పశువులు మేస్తున్న క్రమంలో ఒక్కసారిగా పెద్దపులి మందపై దాడి చేసింది. ఇది చూసిన పశువుల కాపరి గులాబ్ అడ్డుకునే ప్రయత్నం చేయగా, పులి గులాబ్‌పై కూడా పంజా విసిరింది. దీంతో గులాబ్‌కు పొట్ట, చేతికి గాయాలయ్యాయి. గులాబ్ గట్టిగా కేకలు వేయడంతో పులి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. గ్రామస్తులు గులాబ్‌ను కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సర్పంచ్‌ల పదవీ కాలం పొడిగించాలి

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ సమయంలో ఎదురైన ఆటంకాలతో రెండేళ్ల కాలం వృధా అయినందున.. ప్రస్తుత సర్పంచ్‌ల పదవీ కాలాన్ని ఏడాది పాటు పొడిగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ సర్పంచ్‌ల సంఘం విజ్ఞప్తి చేసింది. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్టే.. గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లుల (మోటార్)కు ఇవ్వాలని కోరింది. గ్రామ పంచాయతీల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, ఉప సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేయాలని విన్నవించింది. కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, నూతన జీపీ భవనాల నిర్మాణ నిధులు త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం మంత్రులు ధనసిరి అనసూయ (సీతక్క), కొండా సురేఖలకు సంఘం నేతలు ఎస్.యాదయ్యగౌడ్, కొలను శ్రీనివాస్‌రెడ్డి, జి.కొండల్ తదితరులు వినతిపత్రాలు సమర్పించారు.

'మండే' మహాలక్ష్మి @ 31 లక్షలు

- సోమవారం మహిళలతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు
- పురుషుల సంఖ్య 20 లక్షల లోపే
- లెక్క తేల్చిన ఆర్టీసీ అధికారులు

"సోమవారం ఒక్కరోజే ఆర్టీసీ బస్సుల్లో 51 లక్షల మంది ప్రయాణించారు... ఇది ఆర్టీసీ చరిత్రలోనే ఒక రికార్డు... అందులోనూ మహిళల సంఖ్య 31 లక్షలు ఉండటం కనీవినీ ఎరుగని రికార్డు"

పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి అందుబాటులోకి వచ్చాకే ఆర్టీసీ బస్సులన్నీ మహిళలతో ఇలా నిండిపోతున్నాయి.



నిర్మల్ బస్టాండ్‌లో రద్దీ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో భాగంగా ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. మొదటి రెండు రోజులు రెండో శనివారం, ఆదివారం సెలవుదినం కావడంతో వాస్తవరద్దీ ఎంత ఉంటుందో అంచనా వేయటం కష్టం. సాధారణ రోజుల్లో కంటే సోమవారాల్లో బస్సుల్లో రద్దీ విపరీతంగా ఉంటుంది. ఆరోజు దాదాపు 35 లక్షల మంది వరకు బస్సుల్లో ప్రయాణిస్తారు. సాధారణ రోజుల్లో ఆ సంఖ్య 28 లక్షల మేర ఉంటుంది. ప్రస్తుతం సాధారణ రోజుల్లో రోజువారీ ఆదాయం రూ.14 లక్షలుంటే, సోమవారాల్లో రూ.18 లక్షల వరకు ఉంటుంది. అలాంటిది 11వ తేదీ సోమవారం రోజున ఆర్టీసీ బస్సుల్లో ఏకంగా 51 లక్షల మంది ప్రయాణించినట్టు ఆర్టీసీ లెక్క తేల్చింది. ఇందులో టికెట్ తీసుకున్న ప్రయాణికుల సంఖ్య 20.87 లక్షలుగా పేర్కొంది. అంటే మిగతావారు మహిళలే అని స్పష్టమవుతోంది.

ఒక్కరోజే రూ.7 కోట్లు తగ్గిన ఆదాయం: సోమవారాల్లో రద్దీకి అనుగుణంగా ఆదాయం కూడా భారీగానే ఉంటుంది. సగటున రూ.18.50 కోట్ల మేర ఆదాయం వస్తుంది. ఈ సోమవారం ప్రయాణికుల సంఖ్య 51 లక్షలు నమోదైనందున ఆదాయం కూడా భారీగానే పెరగాలి. కానీ ఇందులో మహిళల సంఖ్య 60 శాతానికి పైగా ఉన్నందున ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వారి నుంచి నయా పైసా ఆదాయం రాలేదు. దీంతో ఈ సోమవారం కేవలం రూ.11.74 కోట్ల ఆదాయం మాత్రమే రికార్డయ్యింది.

జీరో టికెట్ విధానం వస్తేనే కచ్చితమైన లెక్కలు

మహిళలకు బస్సుల్లో ప్రయాణం ఉచితమే అయినా, టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. వారు ఎక్కడి నుంచి ఎక్కడకు ప్రయాణిస్తారో ఆ వివరాలతో కండక్టర్ జీరో టికెట్ జారీ చేస్తారు. టికెట్‌పై చార్జీ స్థానంలో సున్నా అని ఉంటుంది. కానీ, వాస్తవానికి వారి నుంచి ఎంతచార్జీ వసూలు చేయాల్సి ఉందో ఆ టికెట్ ద్వారా అధికారులకు తెలుస్తుంది. నెల ముగియగానే ఆ టికెట్ల మొత్తాన్ని గుణించి ప్రభుత్వానికి అందిస్తే అక్కడి నుంచి రీయింబర్స్ అవుతుంది. ప్రస్తుతం టికెట్ జారీ యంత్రాల సాఫ్ట్‌వేర్ ఇంకా అప్‌డేట్ కానందున జీరో టికెట్ జారీ కావటం లేదు. మహిళల సంఖ్య కండక్టర్లు మాన్యువల్‌గా లెక్కించి రాస్తున్నారు. దీంతో వారి సంఖ్యలో కొంత తేడా ఉండే అవకాశం ఉంది.



కడెంలో రాస్తారోకో చేస్తున్న ఆటో, టాటాఏస్ డ్రైవర్లు

'మహాలక్ష్మి'తో మనుగడకు ముప్పు

నిర్మల్ జిల్లాలో ఆటోడ్రైవర్ల నిరసన

దస్తూరాబాద్/కడెం: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో తాము రోడ్డున పడ్డామని నిర్మల్ జిల్లా దస్తూరాబాద్, కడెం మండల కేంద్రాల్లో మంగళవారం ఆటో, టాటాఏస్ డ్రైవర్లు రాస్తారోకో చేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం ప్రారంభించినప్పటి నుంచి మహిళలంతా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తుండటంతో తమ ఆటోలకు గిరాకీ రావడం లేదని వాపోయారు. దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచించి మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలని లేదా తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు. కడెంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసిన ఆటో డ్రైవర్లు పరిస్థితి వివరించి వినతిపత్రం అందజేశారు.

17న 'ఆటా' అంతర్జాతీయ సదస్సు

నాంపల్లి (హైదరాబాద్): 'ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సు-2023'ను ఈనెల 17వ తేదీన హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ ప్రాంగణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సదస్సు ఉదయం 9 గంటలకు ప్రారంభమై రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది.

చెట్ల మందు తాగించి.. బండరాళ్లతో చంపుతాడు

- నాగర్‌కర్నూల్‌లో సైకోకిల్లర్‌గా మారిన మాంత్రికుడు... గుప్తనిధులు వెలికితీస్తానంటూ ఉన్న ఆస్తులకే టోకరా
- ఇప్పటివరకు 11 మందిని హత్యచేసినట్లుగా గుర్తించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్



నిందితుని అరెస్టు చూపుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్

సాక్షి, నాగర్‌కర్నూల్: మాయలు, మంత్రాలు తెలుసునని నమ్మిస్తూ, మంత్ర శక్తితో గుప్తనిధులు వెలికితీస్తానంటూ ఆస్తులు కాజేసి, ప్రాణాలు తీస్తున్న సైకో కిల్లర్ రామెట్టి సత్యనారాయణను నాగర్‌కర్నూల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ నిందితుడిని అరెస్ట్ చూపుతూ, మీడియాకు వివరాలను వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన రామెట్టి సత్యనారాయణ ఇప్పటివరకు 11 మందిని హత్యచేసినట్టు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోనూ హత్యలకు పాల్పడ్డాడని వెల్లడించారు.

నిర్మానుష్య ప్రాంతాల్లో హత్యలు..

''నిందితుడు సత్యనారాయణ యాదవ్ తన మంత్రశక్తితో గుప్తనిధులను వెలికితీస్తానని అమాయకులను నమ్మిస్తూ వారి పేరిట ఉన్న ప్లాట్లు, వ్యవసాయ భూములను తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు గుర్తించాం. గుప్తనిధులు వెలికితీస్తానని ఒంటరిగా నిర్మానుష్య ప్రాంతాలకు రప్పించి వారికి జిల్లేడు పాలు, ఇతర చెట్ల మందులను తాగిస్తాడు. వారు అపస్మారక స్థితిలోకి చేరుకోగానే బండరాళ్లతో మోది హత్యకు పాల్పడ్డాడ''ని డీఐజీ చౌహాన్ వివరించారు. మొత్తం 11 మందిని హత్య చేయగా, ముగ్గురి మృతదేహాలు ఇప్పటివరకు దొరకలేదని చెప్పారు.

11 మంది అమాయకులు బలి..

2020 ఆగస్టు 14న వనపర్తి జిల్లా నాగాపూర్‌లో గుప్తనిధుల కోసం పూజల పేరుతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని హత్య చేశాడు. వీరిలో హాజిరాబీ(60), ఆష్మాబేగం (32), ఖాజా(35), ఆశ్రీన్(10) ఉన్నారు. 2021లో నాగర్‌కర్నూల్ జిల్లా ఎండబెట్లకు చెందిన సలీం పాషా(38), కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామానికి చెందిన ఆరెపల్లి శ్రీనివాసులు(52), 2022లో నాగర్‌కర్నూల్ మండలం గన్యాగులకు చెందిన వాసర్ల లింగస్వామి(50), 2023లో కల్వకుర్తి మండలం తిమ్మరాసిపల్లికి చెందిన సంపతి శ్రీధర్‌రెడ్డి(43), కోడేరు మండలం తీగలపల్లికి చెందిన రాంరెడ్డి(70), తిరుపతమ్మ(42), వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన గోవుల వెంకటేశ్(32)ను హత్య చేసినట్లుగా పోలీసులు తెలిపారు.

నిందితుడు సత్యనారాయణకు పోలీస్ అధికారులతో సంబంధాలు?

మూడేళ్ల నుంచి తరచుగా హత్యలు, మోసాలకు పాల్పడుతూ ఇప్పటివరకు 11 మంది అమాయకులను పొట్టన బెట్టుకున్న మాంత్రికుడు సత్యనారాయణ యాదవ్.. కొంతమంది ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారుల అండదండలతోనే ఇన్నాళ్లు తప్పించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా హైదరాబాద్‌లో నివసిస్తున్న ఓ మహిళ తమ కుటుంబ సమస్య పరిష్కారం కోసం సత్యనారాయణను ఆశ్రయించగా, ఆమె భూమిని కూడా తన అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనిపై సదరు మహిళ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే నాగర్‌కర్నూల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. అయితే అప్పటి దర్యాప్తు అధికారి నిందితుడు సత్యనారాయణ యాదవ్ నుంచి రెండు ప్లాట్లను.. తన మామ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. తాజాగా వీపనగండ్ల మండలం బొల్లారానికి చెందిన వెంకటేశ్ భార్య ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టడంతో విషయం బయటపడింది.

అప్పుడే పట్టుకుంటే నలుగురు బతికేవారు..

వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగాపూర్‌లో 2020 ఆగస్టు 14న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దారుణహత్యకు గురికాగా, మూడేళ్లుగా పోలీసులు నిందితుడిని గుర్తించలేదన్న విమర్శలు ఉన్నాయి. మాయలు, మంత్రాల పేరుతో భూ రిజిస్ట్రేషన్లు, ఆ తర్వాత హత్యలకు పాల్పడుతున్న సత్యనారాయణ బాగోతాలను వెలుగులోకి తెస్తూ గత ఏప్రిల్ 5న 'మాయగాళ్లు' శీర్షికన 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. ఆ సమయంలోనూ పోలీసులు సత్యనారాయణ కేసులో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ తర్వాత 2023 జూలైలో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తిమ్మరాసిపల్లికి చెందిన సంపతి శ్రీధర్‌రెడ్డి, కోడేరు మండలం తీగలపల్లికి చెందిన తండ్రీకూతుళ్లు బీంరెడ్డి రాంరెడ్డి, తిరుపతమ్మ, వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన గోవుల వెంకటేశ్ హత్యకు గురయ్యారు. ఆరు నెలల ముందే పోలీసులు సత్యనారాయణను అదుపులోకి తీసుకుని ఉంటే ఆ నలుగురు ప్రాణాలతో బయటపడేవారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చూపంతా లోక్‌సభపైనే...

అన్ని కులాల్లోనూ ఆదరణే లక్ష్యం | రూటు మారుస్తున్న బీజేపీ

అద్దం పట్టిన సీఎంల ఎంపిక

గిరిజన, ఓబీసీ నేతలకు అవకాశం

లోక్‌సభ ఎన్నికల దృష్టితో నిర్ణయాలు





తాజాగా జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడింటిని తన ఖాతాలో వేసుకున్న బీజేపీ, వాటి ముఖ్యమంత్రులను ఎంపిక చేసిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ విషయంలో కుల సమీకరణాలకు పెద్దపీట వేసిన తీరు ఆసక్తికరమైన రాజకీయ చర్చకు తెర తీసింది. ఈ విషయంలో బీజేపీ ఆచితూచి, అన్ని అంశాలనూ లోతుగా వడపోసి మరీ వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంది. ఇందుకోసం ఏకంగా వారం రోజులకు పైగా మేధోమథనం చేయడం విశేషం! దాని ఫలితాలు సీఎంల ఎంపికలో కొట్టొచ్చినట్టుగానే కన్పించాయి. గిరిజన ప్రాబల్య ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన నేతను, ఓబీసీలు గణనీయంగా ఉన్న మధ్యప్రదేశ్‌లో అదే సామాజిక వర్గ నాయకున్ని ఎంపిక చేసి చతురత ప్రదర్శించింది. రాజస్తాన్‌లో బ్రాహ్మణ నేతకు అవకాశమిచ్చింది. సీఎంల ఎంపిక కసరత్తు పూర్తిగా రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్నట్టుగా స్పష్టమవుతోంది. అగ్రవర్ణ పార్టీగా తనకున్న ముద్రను చెరిపేసుకునే క్రమంలో రాష్ట్రపతిగా ఎస్సీని, అనంతరం ఎస్టీని ఎంపిక చేసిన కమలం పార్టీ, సీఎంల ఎంపికలోనూ అదే పోకడ కనబరిచింది. ఆ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో దిగ్గజాల వంటి నేతలను కూడా ఎలాంటి శషభిషలూ లేకుండా పక్కన పెట్టడం విశేషం! మధ్యప్రదేశ్‌లో సీఎంగా పార్టీని విజయ తీరాలకు చేర్చిన శివరాజ్‌సింగ్ చౌహాన్ అంతటి సీనియర్ మోస్ట్ నాయకునికి మరో చాన్సివ్వలేదు. రాజస్తాన్, ఛత్తీస్‌ల్లో పలుమార్లు సీఎంలుగా చేసిన వసుంధరా రాజె సింధియా, రమణ్‌సింగ్ పేర్లనైతే పరిశీలించనే లేదని తేటతెల్లమైంది. అగ్రవర్ణ ముద్రను వదిలించుకుని అందరి పార్టీగా మారే దిశగా కొన్నేళ్లుగా బీజేపీ చేస్తున్న ప్రయత్నాలకు సీఎంల ఎంపిక మరోసారి అద్దం పట్టిందని చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్త కులగణనను ప్రధానాంశంగా చేసుకునేందుకు కాంగ్రెస్, జేడీ(యూ) వంటి విపక్షాలు సిద్ధమవుతున్న నేపథ్యంలో దానికి గట్టిగా చెక్ పెట్టే దిశగా కమలనాథులు చేస్తున్న ప్రయత్నాలు కూడా తాజా నిర్ణయాల్లో ప్రతిఫలించాయి.

మధ్యప్రదేశ్‌లో 'బీసీ' రూటు...

మధ్యప్రదేశ్‌లో సీఎంగా పూర్తి ఆరెస్సెస్ నేపథ్యమున్న ఓబీసీ నేత మోహన్ యాదవ్ ఎంపిక కూడా బీజేపీ ప్రాథమ్యాలకే అద్దం పట్టింది. ఇది సరిహద్దు రాష్ట్రమైన యూపీతో పాటు బిహార్లోనూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బాగా కలిసొస్తుందని పార్టీ భావిస్తోంది. అక్కడి ప్రధాన పార్టీలైన సమాజ్‌వాదీ, ఆర్జేడీల సారథ్యం యాదవ్‌ల చేతుల్లోనే ఉండటం తెలిసిందే. పైగా 80 లోక్‌సభ స్థానాలున్న యూపీలో మరోసారి క్లీన్‌స్వీప్ చేయడం, 40 సీట్లు బిహార్లోనూ భారీగా సీట్లు నెగ్గడం బీజేపీకి చాలా కీలకం. ఈ నేపథ్యంలో అక్కడ సంఖ్యాధికులైన యాదవులను ఆకట్టుకునేందుకు కూడా ఓబీసీ సీఎం ఎంపిక ఉపయోగపడుతుందన్నది బీజేపీ అంచనా. ఎందుకంటే ఏకంగా 120 లోక్‌సభ స్థానాలున్న యూపీ, బిహార్లలో ఓబీసీల ఓట్లు అతి కీలకం. వారిలోనూ యాదవులు యూపీలో దాదాపుగా 10 శాతం, బిహార్లో ఏకంగా 14 శాతమున్నారు. ఇక దళితుడైన జగదీశ్ దేవ్డా, బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన రాజేంద్ర శుక్లాలను ఉప ముఖ్యమంత్రులను చేయడం యూపీలోనూ బాగా కలిసొస్తుందని బీజేపీ నమ్ముతోంది. ఉత్తరాది అంతటా రాజకీయంగా గట్టి ప్రభావం చూపే రాజ్‌పుత్ సామాజిక వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని నరేంద్రసింగ్ తోమర్‌ను స్పీకర్‌గా ఎంచుకుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఛత్తీస్‌గఢ్‌లో 'గిరిజన' జపం

గిరిజన రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో వారి ప్రాబల్యం సహజంగానే ఎక్కువ. ఇక్కడ గిరిజన జనాభా ఏకంగా 32 శాతం! దాంతో గిరిజన ఎమ్మెల్యే విష్ణుదేవ్ సాయ్‌ని ముఖ్యమంత్రిగా బీజేపీ ఎంచుకుంది. ఓబీసీ నేతకు చాన్సివ్వాలన్న ప్రతిపాదన కూడా ఒక దశలో తెరపైకి వచ్చినా అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజన ప్రాబల్య ప్రాంతాలైన సర్గుజా, బస్తర్‌ల గుండుగుత్తగా బీజేపీకే జైకొట్టిన నేపథ్యంలో ఆ సామాజిక వర్గంవైపే మొగ్గినట్టు సమాచారం. ఆ ప్రాంతాల్లోని 26 ఎస్టీ ఎమ్మెల్యే స్థానాల్లో బీజేపీ ఏకంగా 22 సీట్లు నెగ్గింది. ఈ నేపథ్యంలో సాయ్ ఎంపిక దేశవ్యాప్తంగా గిరిజన ప్రాబల్య ప్రాంతాల్లో కలిసొస్తుందని భావిస్తోంది. సరిహద్దు రాష్ట్రాలైన మధ్యప్రదేశ్‌లో 22 శాతం, జార్ఖండ్‌లో 26 శాతం గిరిజన జనాభా ఉండటం తెలిసిందే. ఇక రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్వరాష్ట్రమైన ఒడిశాలోనూ 23 శాతం గిరిజనులున్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో 20 ఎస్టీ లోక్‌సభ స్థానాలున్నాయి. మరో 10 స్థానాల్లోనూ గిరిజన ఓట్లు కీలకంగా ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకునే సాయ్ ఎంపిక జరిగినట్టు కనిపిస్తోంది.

రాజస్తాన్‌లో కుల సమతౌల్యం...

రాజస్తాన్‌లో తొలిసారి ఎమ్మెల్యే అయిన బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన భజన్‌లాల్ శర్మకు సీఎంగా జాక్‌పాట్ దక్కడం కూడా బీజేపీ కుల సమీకరణల వ్యూహంలో భాగమేనంటున్నారు. నిజానికి రాజస్తాన్‌లో 7 శాతం దాకా ఉన్న బ్రాహ్మణ జనాభా రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలను గణనీయంగా ప్రభావితం చేయదు. కానీ శర్మ ఎంపిక వెనక ఆంతర్యం రాజస్తాన్‌తో పాటు సరిహద్దు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, హరియాణాల్లో గణనీయంగా ఉన్న బ్రాహ్మణ వర్గాలను ఆకట్టుకోవడంగా కనిపిస్తోంది. బ్రాహ్మణులు హరియాణాలో 12 శాతం, యూపీలో 10 శాతానికి పైగా ఉంటారు. అదే సమయంలో మిగతా సామాజిక వర్గాలను దృష్టిలో ఉంచుకుంటూ రాచ కుటుంబీకురాలైన దియా కుమారి, దళిత నేత ప్రేమ్‌చంద్ బైర్వాలను ఉప ముఖ్యమంత్రులుగా ఎంపిక చేసింది. రాష్ట్రంలో శర్మ, మధ్యప్రదేశ్‌లో డిప్యూటీ సీఎంగా శుక్లా ఎంపిక ఉత్తరాది అంతటా బీజేపీకి పెట్టని కోటగా నిలుస్తూ వస్తున్న అగ్ర వర్ణ ఓటర్లను మరింత ఆకట్టుకునే ప్రయత్నాల్లో భాగంగా కన్పిస్తోంది.



లాడ్లి లక్ష్మీ పథకం లబ్ధిదారులను ఓదారుస్తున్న మాజీ సీఎం శివరాజ్ సింగ్

ఆశించడం కంటే చనిపోవడం మేలు

మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్

భోపాల్: సీఎం పదవి నుంచి దిగిపోయినవేళ మధ్యప్రదేశ్ బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎంగా మోహన్ యాదవ్ బుధవారం బాధ్యతలు చేపట్టనుండగా, మంగళవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ వెళ్లి తనకు ఏదో ఒక పదవి కావాలని అధిష్టానాన్ని కోరుకోవడం కంటే చనిపోవడం మేలని పేర్కొన్నారు. అలా తాను అడగలేనని చెప్పారు. తన ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలను కొత్త సీఎం కొనసాగిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఆయనకు తన మద్దతు ఉంటుందని చెప్పారు. బీజేపీ అధిష్టానం ఎలాంటి బాధ్యతలు అప్పగించినా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న మహిళా కార్యకర్తలు కొందరు కంటనీరు పెట్టుకోవడం, శివరాజ్‌సింగ్ భావోద్వేగానికి గురైనట్లుగా ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్రానికి నాలుగు పర్యాయాలు సీఎంగా పనిచేశారు. ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.



ఉగ్రదాడిలో దెబ్బతిన్న పోలీస్ స్టేషన్ లోపలి భాగం

పాక్ ఆర్మీ పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి

23 మంది సైనికులు మృతి

పెషావర్: పాకిస్తాన్‌లో తాలిబన్ ఉగ్రమూకలు రెచ్చిపోయాయి. ఆర్మీ పోస్టుపై వెంటవెంటనే జరిపిన ఆత్మాహుతి దాడుల్లో 23 మంది సైనికులు మృతి చెందారు. ఈ ఘటన ఖైబర్ పంఖ్తున్వా ప్రావిన్స్‌లోని డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలో చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం దారాబన్ ఏరియాలోని ఆర్మీ కార్యాలయంలోకి కొందరు ఉగ్రవాదులు చొచ్చుకు వచ్చేందుకు ప్రయత్నించారు. ఆర్మీ వారి ప్రయత్నాలను తిప్పికొట్టింది. కొద్దిసేపటి తర్వాత ఉగ్రవాదులు పేలుడు పదార్థాలు నింపిన ట్రక్కుతో వేగంగా వచ్చి గేటును ఢీకొట్టారు. అనంతరం మరోసారి ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. రెండు దాడుల్లో ఆర్మీ కార్యాలయ భవనం కుప్పకూలింది. అనంతరం ఆర్మీకి, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల్లో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులను హతమార్చినట్లు సైన్యం ప్రకటించింది. ఈ ఘటనలో మొత్తం 23 మంది సైనికులు చనిపోగా మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా మారడంతో మృతుల సంఖ్య పెరగొచ్చని భావిస్తున్నట్లు ఆర్మీ ప్రతినిధి తెలిపారు. ఈ ఆత్మాహుతి దాడులకు తమదే బాధ్యతంటూ తెహ్రీక్-ఇ- తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ)అనుబంధంగా కొత్తగా ఏర్పడ్డ తెహ్రీక్-ఇ-జిహాద్ పాకిస్తాన్(టీజేపీ)ప్రకటించుకుంది. ఇలా ఉండగా, ఇదే జిల్లాలోని దారాజిందా, కులాచి ప్రాంతాల్లో సైన్యం జరిపిన దాడుల్లో 21 మంది ఉగ్రవాదులు హతమైనట్లు ఆర్మీ తెలిపింది. ఇద్దరు సైనికులు కూడా చనిపోయినట్లు పేర్కొంది.

సీబీఎస్‌ఈ పరీక్షల తేదీలు ఖరారు

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) మంగళవారం 10, 12వ తరగతుల పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 10, 12వ తరగతుల పరీక్షలు మొదలవుతాయి. పదో తరగతి పరీక్షలు మార్చి 13న, 12వ తేదీ పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీన ముగియనున్నాయి. ప్రతి రెండు సబ్జెక్టులకు మధ్య సరిపోను విరామం ఉండేలా చూడటంతోపాటు, జేఈఈ వంటి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని 12వ తరగతి పరీక్షల షెడ్యూల్‌ను రూపొందించామని పరీక్షల కంట్రోలర్ సన్యం భరద్వాజ్ తెలిపారు.

చరిత్ర తెలియక ఊరకే తిరగరాస్తున్నారు

నెహ్రూపై అమిత్ షా విమర్శలకు రాహుల్ కౌంటర్



న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ)బిల్లు, జమ్మూకశ్మీర్ రిజర్వేషన్(సవరణ)బిల్లులపై చర్చ సందర్భంగా మాజీ ప్రధాని నెహ్రూపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపణలు గుప్పించడాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. '' జమ్మూకశ్మీర్‌లోకి పూర్తిగా భారత బలగాలు వెళ్లేలోపే కాల్పుల విరమణకు నెహ్రూ ఆదేశాలిచ్చారు. అనవసరంగా కశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకెళ్లారు. నెహ్రూ చారిత్రక తప్పిదాల కారణంగానే కశ్మీర్ సమస్య అపరిష్కృతంగా తయారై అక్కడి ప్రజలు కష్టాలపాలయ్యారు'' అని సోమవారం రాజ్యసభలో ఆరోపణలుచేయడం తెల్సిందే. దీనిపై మంగళవారం రాహుల్ పార్లమెంట్ ప్రాంగణంలో ఘాటుగా స్పందించారు. '' పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఈ దేశం కోసం తన జీవితం మొత్తాన్నీ ధారపోశారు. స్వాతంత్ర్య పోరాటంలో చాలా సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. ఇంకా ఇలాంటి చరిత్ర అంతా అమిత్ షాకు తెలీదనుకుంటా. అందుకే పదేపదే చరిత్రను తిరగరాస్తున్నారు. ఇదంతా అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే. కుల గణన వంటి సమస్యల సంగతేంటి? అసలు ప్రజాధనం ఎవరి చేతుల్లోకి వెళ్తోంది?. ఈ అంశాలను బీజేపీ అస్సలు చర్చకు స్వీకరించదు. భయంతో పారిపోతోంది. బీసీలను పట్టించుకోవట్లేదు' అని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు.

ఓబీసీల ప్రాధాన్యం పెరగాలి

గిరిజన వ్యక్తిని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా, ఓబీసీ నేతను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా బీజేపీ ప్రకటించిందికదా ? అన్న మీడియా ప్రశ్నకు రాహుల్ బదులిచ్చారు. ''మేం కూడా ఛత్తీస్‌గఢ్‌లో ఓబీసీ నేతను ముఖ్యమంత్రిని చేశాం. వాళ్లు కూడా మధ్యప్రదేశ్‌లో ఓబీసీ నేతను సీఎంగానే చేశారు. బీసీలకు ఒకే ఒక్క కీలక పదవి ఇస్తే సరిపోదు. ఇక్కడ పదవి ముఖ్యం కాదు. మరింత మంది ఓబీసీలకు ప్రాధాన్యత దక్కాలి. వారి ప్రాతినిధ్యం మరింత పెరగాలి. మోదీ సర్కార్ ప్రధానాంశాలను పక్కనబెట్టి ప్రజల దృష్టికి మరల్చుతోంది'' అని రాహుల్ ఆరోపించారు.

తొలిసారే సీఎం పదవి

రాజస్తాన్‌లో భజన్‌లాల్ శర్మకు జాక్‌పాట్

డిప్యూటీ సీఎంలుగా దియా కుమారి, ప్రేమ్‌చంద్ బైర్వా



జైపూర్: మధ్యప్రదేశ్‌లో రేస్‌లోలేని వ్యక్తిని ముఖ్యమంత్రిగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచిన బీజేపీ అధిష్టానం మరోసారి అలాంటి అనూహ్య నిర్ణయమే తీసుకుంది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన భజన్‌లాల్ శర్మను రాజస్తాన్ నూతన ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నట్లు బీజేపీ మంగళవారం ప్రకటించింది. దీంతో ఇటీవల బీజేపీ విజయబావుటా ఎగరేసిన మూడు రాష్ట్రాలు.. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో కొత్త ముఖాలే సీఎం పీఠంపై కనిపించనున్నాయి. మంగళవారం జైపూర్‌లో 115 మంది బీజేపీ ఎమ్మెల్యేలు సమావేశమై భజన్‌లాల్‌ను తమ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ భేటీకి బీజేపీ అధిష్టానం తరపున పార్టీ సీనియర్ నేతలు రాజ్‌నాథ్ సింగ్ తదితరులు హాజరయ్యారు. సమావేశం తర్వాత భజనలాల్ వెంటనే రాష్ట్ర గవర్నర్ కల్‌రాజ్ మిశ్రాను కలిశారు. నూతన ప్రభుత్వం ఏర్పాటుచేయాల్సిందిగా భజన్‌లాల్‌కు గవర్నర్ ఆహ్వానం పలికారు. పదవుల్లో కులాల సమతుల్యం పాటిస్తూ బ్రాహ్మణ వర్గానికి చెందిన భజన్‌లాల్‌ను సీఎంగా, రాచరిక వారసురాలైన మహిళా ఎమ్మెల్యే దియా కుమారిని డిప్యూటీ సీఎంగా, దళిత నేత ప్రేమ్‌చంద్ బైర్వాలను డిప్యూటీ సీఎంగా, సింధ్ వర్గానికి చెందిన వాసుదేవ్ దేవ్నానీని స్పీకర్‌గా ఎంపికచేశారు. కాంగ్రెస్ అభ్యర్థి మరణంతో వాయిదాపడిన కరణ్‌పూర్ అసెంబ్లీ స్థానంలో జనవరి 5న పోలింగ్ జరగనుంది

నేడు మోహన్‌కు పట్టం

భోపాల్: మధ్యప్రదేశ్ సీఎంగా మోహన్ యాదవ్ బుధవారం ప్రమాణం చేయనున్నారు. కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నడ్డా, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, ముఖ్య నేతలు హాజరవుతారు.

సంస్థాగతం నుంచి సీఎం దాకా...

భజన్‌లాల్ చాలా సంవత్సరాలుగా బీజేపీ పార్టీలో సంస్థాగత పదవుల్లోనే కొనసాగారు. మొట్టమొదటిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. వెనువెంటనే ఆయన్ను సీఎం పదవి వరించడం విశేషం. భరత్‌పూర్ జిల్లాకు చెందిన 56 ఏళ్ల భజన్‌లాల్.. సంగనేర్ నియోజకవర్గం నుంచి 48,000కుపైగా భారీ మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థిపై ఘన విజయం సాధించారు. గతంలో ఈయనకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)తో మంచి అనుబంధం ఉంది. విద్యార్థి దశలో రాజనీతి శాస్త్రంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

కాంగ్రెస్ ఉండగా మనీ హేస్ట్ ఎందుకు?


ప్రధాని మోదీ ఎద్దేవా

న్యూఢిల్లీ: జార్ఖండ్‌లో కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూకు చెందిన ప్రదేశాల్లో ఐటీ సోదాల్లో వందల కోట్ల నగదు బయటపడిందన్న కథనాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టారు. ఇందుకు తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'ను వేదికగా చేసుకున్నారు. బ్యాంకుల దోపిడీ కథతో ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన వెబ్ సిరీస్ 'మనీ హేస్ట్'ను ఇటీవల బయటపడిన రూ.351 కోట్ల ఉదంతంతో పోలుస్తూ కాంగ్రెస్‌ను విమర్శించారు. '' దేశంలో కాంగ్రెస్ ఉండగా మళ్లీ మనీ హేస్ట్ అవసరమా ?. 70 ఏళ్లుగా కాంగ్రెస్ దోపిడీ(హేస్ట్) జరుగుతోంది. ఇంకా కొనసాగుతోంది కూడా'' అని మోదీ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. '' కాంగ్రెస్ ప్రాయోజిత మనీ హేస్ట్ '' అంటూ మనీ హేస్ట్ వెబ్ సిరీస్ టైటిల్ సాంగ్‌తో ఉన్న ఒక వీడియోను బీజేపీ తాజాగా ఎక్స్‌లో పోస్ట్‌చేసింది. కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలు కలిసి దిగిన ఒక ఫొటోకు మనీ హేస్ట్ పాటను జతకలుపుతూ బీజేపీ విడుదలచేసిన ఆ వీడియోను మోదీ షేర్‌చేశారు. మోదీతోపాటు బీజేపీ నేతలూ కాంగ్రెస్‌పై విమర్శల ధాటి పెంచారు. ఈ మేరకు బీజేపీ నేతలు కిరెణ్ రిజిజు, సంగీత సింగ్‌దేవ్, రామేశ్వర్ తేలి, నిశిత్ ప్రామాణిక్ మీడియాతో మాట్లాడారు. 'అవినీతిపై ఉక్కుపాదం మోపుతూ మోదీ సర్కార్ చేస్తున్నయుద్ధం ధాటికి తట్టుకోలేకే విపక్షాలు 'ఇండియా' కూటమిగా ఒక్కతాటి మీదకొచ్చి నిల్చున్నాయి'' అని కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు వ్యాఖ్యానించారు. '' రూ.351 కోట్లు బట్టబయలైన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూ ప్రదేశం ఒక్కటే కాదు. ఇలాంటివి చాలా ఉన్నాయి. కాంగ్రెస్ నేతలపైనే కాదు బిహార్, పశ్చిమబెంగాల్, రాజస్తాన్, ఢిల్లీల్లోనూ విపక్ష పార్టీల నేతలపై చాలా అవినీతి కేసులున్నాయి. కాంగ్రెస్ నడుపుతున్న ఈ అవినీతి దుకాణాలన్నీ మూసేస్తాం. వీరిపై మోదీ సర్కార్ కఠిన చర్యలు తీసుకుంటుంది'' అని అన్నారు.

మీ మనీ హేస్ట్ సంగతేంటి: కాంగ్రెస్


కాంగ్రెస్ దోపిడీ అంటూ మోదీ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ వెంటనే స్పందించింది. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని ఉద్దేశిస్తూ.. ' ఆఫ్‌షోర్ ఫండ్ల ద్వారా భారీ లబ్ధి పొందిన తైవాన్ వ్యాపారి చాంగ్ చుంగ్ లింగ్‌తో గౌతమ్ అదానీకి ఉన్న సంబంధాలేంటి? ఆస్తిపాస్తులులేని గౌతమ్ అదానీ ఒక్కసారిగా ప్రపంచ కుబేరుడెలా అయ్యాడు? అదానీ గ్రూప్ అసాధారణ సంపద వృద్ధికి సాయపడిందెవరు?. మోదీజీ.. 1947 నుంచి దేశం ఎన్నడూ చూడని అతిపెద్ద మనీ హేస్ట్ గురించి మీరు వివరణ ఇవ్వాలని యావద్దేశం ఎదురుచూస్తోంది'' అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

పటిష్ట ఏఐ నిబంధనలు



ప్రపంచవ్యాప్తంగా విస్తృతస్థాయిలో వినియోగంలోకి వచ్చిన కృత్రిమ మేధ(ఏఐ)పై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. ఏఐ ఉగ్రవాదుల చేతిలో పడకుండా అంతర్జాతీయంగా పటిష్ట నిబంధనలు అవసరమని నొక్కిచెప్పారు. ఢిల్లీలో 'గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(జీపీఏఐ) ' సదస్సులో ప్రధాని ప్రసంగించారు. ''డీప్‌ఫేక్, సైబర్ సెక్యూరిటీ, డేటా చోరీలు పెచ్చరిల్లుతున్నందున ఏఐ పరిజ్ఞానం ఉగ్రవాదుల చేతికి చిక్కితే అత్యంత ప్రమాదకం. ఏఐతో పనిచేసే ఆయుధాలు ఉగ్రసంస్థల చేతికొస్తే ప్రపంచ భద్రతకే ప్రమాదం. దీన్ని అడ్డుకోవాలంటే ఏఐ సాంకేతికత నైతిక వినియోగంపై అంతర్జాతీయ ఉమ్మడి ప్రణాళిక అవసరం. దేశాలన్నీ సమష్టిగా పటిష్ట నిబంధనావళిని రూపొందించుకోవాలి'' అని పిలుపునిచ్చారు. ''దేశాల మధ్య అంతర్జాతీయ ఒప్పందాలున్నట్లే ఈ నూతన సాంకేతికత నైతిక వినియోగం విషయంలోనూ ప్రపంచస్థాయి మార్గదర్శకాలు, నిబంధనలు ఉండాలి. నిబంధనల చట్రాన్ని వీలైనంత త్వరగా అమల్లోకి తేవాలి. ఏఐ పరిజ్ఞానాన్ని సంతరించుకున్న పరికరాలు, ఆయుధాల పరిశోధన, అభివృద్ధి, పరీక్ష, తయారీలపై ప్రోటోకాల్‌ను అమల్లోకి తేవాలి. ఈ అంశంలో భారత్ తనవంతు బాధ్యత నెరవేర్చేందుకు సదా సిద్ధంగా ఉంది'' అని మోదీ ప్రకటించారు.

గణతంత్ర వేడుకలకు బైడెన్ రావడం లేదు



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత పర్యటన వాయిదా పడినట్లు తెలుస్తోంది. జనవరిలో ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ఆయన భారత్ రావడం లేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గణతంత్ర వేడుకలప్పుడే క్వాడ్ సమిట్ కూడా జరపాలని భారత్ భావించినా, దాన్ని తర్వాత నిర్వహించాలని తాజాగా నిర్ణయానికొచ్చింది. ఇదే పర్యటన వాయిదాకు కారణమని సమాచారం.

సియాచిన్‌లో 'నారీ పర్వం'

తొలి మహిళా వైద్యాధికారిగా కెప్టెన్ ఫాతిమా ఘనత

లేహ్/జమ్మూ: ప్రపంచంలోనే ఎత్తయిన యుద్ధ క్షేత్రం సియాచిన్‌లో ప్రప్రథమ మహిళా వైద్యాధికారిగా కెప్టెన్ ఫాతిమా వసీమ్ రికార్డు సృష్టించనున్నారు. మొదటిసారిగా ఆపరేషనల్ పోస్టులో భారత ఆర్మీ ఈమెను నియమించింది. కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లోని సియాచిన్‌లో బాధ్యతలు చేపట్టనున్న రెండో వైద్యాధికారి ఫాతిమా అని భారత ఆర్మీకి చెందిన ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ మంగళవారం తెలిపింది. సైన్యంలో లింగసమానత్వం పెంచేందుకు తీసుకుంటున్న చర్యల్లో కెప్టెన్ ఫాతిమా నియామకం ఒకటని తెలిపింది. సియాచిన్ బ్యాటిల్ స్కూల్‌లో కఠోర శిక్షణ పొందిన ఆమె 15,200 అడుగుల ఎత్తులో ఉన్న సియాచిన్ పోస్టులో బాధ్యతలు చేపడతారని వివరించింది. అత్యంత కఠినమైన వాతావరణ పరిస్థితుల మధ్య ఈమె బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. కెప్టెన్ గీతికా కౌల్‌ను సియాచిన్‌లో మొదటి మహిళా వైద్యాధికారిగా నియమించినట్లు ఈ నెల మొదటి వారంలో ఆర్మీ ప్రకటించింది.

సంజయ్ రౌత్‌పై దేశద్రోహం కేసు

యావత్మాల్: శివసేన(బాల్‌ఠాక్రే)కు చెందిన 'సామ్నా' పత్రికలో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా కథనం రాసినందుకు ఎంపీ సంజయ్ రౌత్‌పై దేశద్రోహం కేసు నమోదైంది. యావత్మాల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నితిన్ భుటాడా ఫిర్యాదు మేరకు సామ్నా ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూడా అయిన రౌత్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు చెప్పారు. ఈ నెల 10న ప్రధాని మోదీపై ప్రచురితమైన కథనం అభ్యంతరకరంగా ఉందని భుటాడా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉమర్‌ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రౌత్‌పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు.

సీఈసీ, ఈసీల బిల్లుకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన కీలకమైన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీలు) బిల్లు-2023ని కేంద్రం మంగళవారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు బిల్లును తెచ్చామని న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మెఘ్వాల్ చెప్పారు. ''1991 నాటి చట్టంలో సీఈసీ, ఈసీల నియామక నిబంధనలు లేవు. తాజా బిల్లులో వాటిని పొందుపరిచాం. సీఈసీ, ఈసీ నియామకాలను ఇప్పటిదాకా ప్రభుత్వమే చేపట్టేది. ఇకపై వాటిని ప్రత్యేక కమిటీ చూసుకుంటుంది. వారి వేతనాలు తదితరాలను బిల్లులో పొందుపరిచాం. సీఈసీ, ఈసీలకు చట్టపరమైన రక్షణలను కల్పించాం'అని వివరించారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం

బిల్లులోని అంశాలు ఈసీ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉన్నాయని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఆరోపించాయి. ప్రధాని, ఆయన నామినేట్ చేసే సభ్యులు సీఈసీ, ఈసీలను నియమించడమంటే ఎన్నికల సంఘాన్ని నామమాత్రంగా మార్చడమేనని రణదీప్ సూర్జేవాలా (కాంగ్రెస్) అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక కమిటీలో చేర్చకపోవడమేమిటని ఆప్ సభ్యుడు రాఘవ్ చద్దా ప్రశ్నించారు. సీఈసీ, ఈసీల హోదాను కేబినెట్ సెక్రటరీ స్థాయికి కేంద్రం దిగజార్చిందని జవహర్ సర్కార్ (టీఎంసీ) మండిపడ్డారు. బీజేడీ, డీఎంకే సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.

ఒమర్ విడాకుల పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: వేరుగా ఉంటున్న భార్య నుంచి విడాకులు కోరుతూ నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా పెట్టుకున్న పిటిషన్ ఢిల్లీ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. భార్య పాయల్ తన పట్ల క్రూరంగా వ్యవహరించారనేందుకు ఒమర్ ఎలాంటి ఆధారాలు చూపలేకపోయారని జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ, జస్టిస్ వికాస్ మహాజన్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది. ''క్రూరత్వ ఆరోపణలు అస్పష్టంగా ఉన్నాయని, ఆమోదయోగ్యం కాదని కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సరైందే. భార్య తన పట్ల శారీరకంగా, మానసికంగా క్రూరంగా వ్యవహరించినట్లు చూపడంలో పిటిషనర్‌విఫలమయ్యారు' అని పేర్కొంది.

2040 కల్లా చందమామపై భారత వ్యోమగామి: ఇస్రో

తిరువనంతపురం: 2040 ఏడాదికల్లా చంద్రుడిపై భారతీయ వ్యోమగామి అడుగుపెట్టేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్ మంగళవారం చెప్పారు. ''వ్యోమగాములుగా తీర్చిదిద్దేందుకు నలుగురు భారత వాయుసేన పైలట్లను ఎంపికచేశాం. వారికి శిక్షణలో కొనసాగుతోంది. వ్యోమగాములను ముందు లోయర్ ఎర్త్ ఆర్బిట్ (ఎల్ఈఓ)లోకి ప్రవేశపెట్టి సురక్షితంగా హిందూ మహాసముద్ర జలాల్లో దించుతాం'' అని వెల్లడించారు. ''గగన్‌యాన్ కోసం మనుషుల ప్రయాణించే హెచ్ఎల్‌వీఎం3 వ్యోమనౌక, క్రూ మాడ్యూల్ ఉండే ఆర్బిటల్ మాడ్యూల్, సర్వీస్ మాడ్యూల్, ప్రాణాధార వ్యవస్థలు కావాలి. ముందు మానవరహిత ప్రయోగాలను పూర్తిచేయాలి. ఒకే పోలికలు ఉండే రెండు మానవరహిత మిషన్‌లు(జీ1, జీ2), ఎయిర్ డ్రాప్ టెస్ట్, ప్యాడ్ అబార్ట్ టెస్ట్, టెస్ట్ వెహికల్ పరీక్ష తదితరాలను విజయవంతంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. చంద్రుడిని చేరాక సురక్షితంగా తిరిగొచ్చేందుకు వ్యోమగాములు ఉండే క్రూ మాడ్యూల్(సీఎం) తయారీ, అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది తప్పించుకునే క్రూ ఎస్కేప్ సిస్టమ్(సీఈఎస్)లనూ అభివృద్ధిచేసుకోవాల్సి ఉంది'' అని సోమనాథ్ చెప్పారు.

గాజాపై ఆగని ఇజ్రాయెల్ దాడులు

రఫా: గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి, మంగళవారం జరిపిన వైమానిక దాడుల్లో రఫా, డెయిర్ అల్ బలాహ్‌ల్లో పలు నివాస భవనాలు నేలమట్టం కాగా, పదుల సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయారు. రఫాలోని నాలుగు భవనాలపై జరిగిన దాడుల్లో ఏడుగురు చిన్నారులు, ఆరుగురు మహిళలు సహా 23 మంది చనిపోయారు. డెయిర్ అల్ బలాహ్‌లో జరిగిన దాడుల్లో 33 మంది మరణించారు. మఘాజి శరణార్థి శిబిరంపైనా దాడులు జరిగినట్లు చెబుతున్నారు. మరణాల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తర గాజాలోని కమాల్ అద్వాన్ ఆస్పత్రిలోని వారందరినీ ఇజ్రాయెల్ బలగాలు ఖాళీ చేయించినట్లు ఆరోగ్య శాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు. అనంతరం హమాస్ మిలిటెంట్ల కోసం ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు తెలిపారు. ఆ ఆస్పత్రిలోని 65 మంది రోగుల్లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోని 12 మంది చిన్నారులు, ఆరుగురు శిశువులు ఇంకుబేటర్లలో ఉన్నారన్నారు. వీరుకాకుండా మరో 3 వేల మంది అక్కడ ఆశ్రయం పొందుతున్నట్లు ఐరాస తెలిపింది. ఇలా ఉండగా, గాజాలో హమాస్ మిలిటెంట్లతో పోరు మరికొన్ని వారాలపాటు కొనసాగుతుందని, ఆ ప్రాంతంలో సైనిక చర్య నెలలపాటు సాగవచ్చని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గల్లాంట్ చెప్పారు.

సాక్షి కరీంనగర్

బుధవారం । 13 । డిసెంబర్ । 2023

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కె.వీ.మంకమ్మ తోట ఫీడర్ పరిధిలోని మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, కాశ్మీర్‌గడ్డ, గోపాల్‌రావు భవనం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏడీఈ 2 ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.



కొనసాగుతున్న నీటి విడుదల

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి మంగళవారం ఎల్‌ఎండీకి 500, కుడి కాల్వ ద్వారా 100 క్యూసెక్కుల నీరు తరలుతోంది. ప్రాజెక్టులో 23.21 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గరిష్టం/కనిష్టం
27.0/17.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పదోన్నతులే.. ప్రయోజనాలేవీ

- కలెక్టరేట్ ఏవోకు వీఆర్‌ఏల జేఏసీ వినతి



కరీంనగర్ అర్బన్: నాలుగు నెలల క్రితం పాత ప్రభుత్వంలో వీఆర్‌ఏలకు పదోన్నతులు ఇచ్చారే తప్పా ప్రయోజనాలు శూన్యమని వీఆర్‌ఏల జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి వెట్టిచాకిరీకి విముక్తి లభించిందని సంతోషిస్తే పదోన్నతులిచ్చి పక్కనపెట్టడమేంటని వాపోయారు. కొత్త ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ పదోన్నతి పొందిన వీఆర్‌ఏలు దుర్భర పరిస్థితిని వెళ్లదీస్తున్నారని అన్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు లేకుంటే కుటుంబాలను ఎలా పోషించాలని ప్రశ్నించారు. ఉద్యోగులుగా గుర్తింపుకార్డులు లేవని, ఇతర జిల్లాల్లో పనిచేస్తుండగా రవాణాకు కూడ డబ్బులు లేవని, ఇప్పటివరకు అప్పులు చేసి సర్దుకున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి స్పష్టతనివ్వాలని కోరారు. వీఆర్‌ఏల జేఏసీ జిల్లా నేతలు చెట్టి రవి, కిన్నెర కొమురయ్య, నలువాల మల్లేశం పాల్గొన్నారు.

జాతీయ జూడో పోటీలకు దేశరాజుపల్లి విద్యార్థి




రామడుగు: మండలంలోని దేశరాజుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మ్యాకల అర్పిత ఈనెల 15 నుంచి కేరళలోని కొచ్చిలో నిర్వహించే జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపికయినట్లు పీఈటీ వెంకటరమణ పేర్కొన్నారు. ఈనెల మొదటివారంలో సుల్తానాబాద్‌లో నిర్వహించిన సబ్‌జూనియర్ జూడోపోటీల్లో అర్పితతో పాటు పతకాలు సాధించిన స్వాతి, శివాణి, సంధ్య, సాధ్వికను హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ సమస్యలపై దృష్టి పెట్టండి



కొత్తపల్లి: విద్యుత్ వినియోగదారులకు క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా దృష్టి పెట్టాలని టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ సూచించారు. కరీంనగర్ విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం టౌన్ 1 సబ్ డివిజన్ ఓఅండ్‌ఎం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించడంతో పాటు రెవెన్యూ వచ్చేలా పనిచేయాలన్నారు. డీఈ జె.రాజం, ఎస్‌ఏఓ రాజేశం, ఏడీఈ ఎస్.నరేందర్, టౌన్ ఏఏఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు రూ.4వేల సాయం



చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో పుట్టిన ప్రతీ ఆడపిల్లకు సర్పంచ్ జక్కుల రవి తనవంతుగా ఆర్థిక సాయం రూ.4వేలు అందించడం అభినందనీయం అని చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ చేతుల మీదుగా పదిమంది ఆడపిల్లలకు రూ.4016 చొప్పున సాయం అందించారు. రెండేళ్లుగా పుట్టిన ప్రతీఆడశిశువుకు రూ.4016 వేలు చొప్పున సర్పంచ్ రవి సాయం అందించడంపై ఎంపీపీ వినీత హర్షం వ్యక్తం చేశారు.

'కారు'ను దారిలో పెట్టేలా..



- అసెంబ్లీ ఎన్నికల ఓటమిపై సమీక్ష
- స్థానిక, పార్లమెంట్‌లో గెలుపే లక్ష్యంగా..
- కార్యాచరణ మొదలుపెట్టిన గులాబీబాస్‌లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

బీఆర్‌ఎస్‌కు కంచుకోటైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జోరుమీదున్న ఆ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం బ్రేకులు వేసింది.ఎన్నికల ఫలితాలతో గులాబీ శ్రేణుల్లో కాస్త నిరుత్సాహం నెలకొంది. అయితే వరుసగా స్థానిక సంస్థలు, ప్రాదేశిక, మున్సిపల్, పార్లమెంట్ ఎన్నికలు రానుండడంతో క్యాడర్‌లో జోష్ నింపుతూ.. పార్టీని గెలుపుబాట పట్టించేందుకు అధిష్టానం సూచనలతో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ముఖ్యనాయకులు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే తమ అనుచరులు, నేతలతో కలిసి బూత్‌ల వారీగా పోలైన ఓట్లు, ఓటమికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ఉద్యమపార్టీగా ఉన్న బీఆర్‌ఎస్‌కు దూరమైన వర్గాలు ఏమిటీ..? వారిని తిరిగి మచ్చిక చేసుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికను సిద్ధం చేసుకుని కార్యాచరణకు సన్నద్ధమవుతున్నారు. మొదటగా ఢీలాపడిన కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ.. కాంగ్రెస్ పార్టీ ఆరుగ్యారంటీల అమలులో విఫలమైతే ప్రజల మద్దతుతో పోరాడేందుకు శ్రేణులను సమాయత్తం చేయనున్నారు.

వైఫల్యాలను ఎత్తిచూపుతూ

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 13స్థానాల్లో 8 సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంది. బీఆర్‌ఎస్ ఐదుస్థానాలకు పరిమితం అయ్యింది. మెజార్టీ స్థానాలు గెలుచుకోలేకపోయినా.. గట్టి పోటీ ఇచ్చామని, గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీయే విజయం సాధించిందని నేతలు చెబుతున్నారు. పార్టీ ఓడినా క్యాడర్ బలంగా ఉందంటూ నేతలను ఎన్నికల సమరానికి సిద్ధం చేయనున్నారు. ఉద్యమ పార్టీగా పోరాడిన బీఆర్‌ఎస్, సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై పోరాటం ద్వారానే ప్రజల మద్దతును తిరిగి పొందాలని చూస్తోంది. ఎన్నికలకు సమయం ఎక్కువ రోజులు లేకపోవడంతో అందివచ్చిన ప్రతి అంశాన్ని ప్రజల్లో చర్చకు పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారానే తిరిగి విజయబావుటా ఎగరవేయాలని భావిస్తోంది.

ప్రజలు బీఆర్‌ఎస్ వైపే



ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు. వచ్చే స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాలూ గెలుచుకుంటాం. పార్టీ జిల్లాలో పటిష్టంగా ఉంది. అందరు ప్రజాప్రతినిధులతో చర్చించి ముందుకు వెళ్తాం. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండు స్థానాలు తిరిగి గెలుచుకున్నాం. రానున్న ఎన్నికల నాటికి బలోపేతమై పక్కాప్రణాళికతో ముందుకు వెళ్తాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతాం. – కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు

దీటుగా ఎదుర్కొంటాం



స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించే దిశగా క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తాం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు.. బీఆర్‌ఎస్‌కు కేవలం 2 శాతం ఓట్ల తేడానే ఉంది. జిల్లాలో నాలుగు స్థానాలకు రెండు ఎమ్మెల్యే సీట్లు గెలుచుకున్నాం. కాంగ్రెస్ పార్టీ చేసిన అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు నమ్మి ఓట్లు వేశారు. వారు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, తదితర హామీలపై బలమైన ప్రతిపక్షంగా నిలదీస్తాం. ప్రజల మద్దతుతో బలమైన ఉద్యమాలను నిర్మించి ఉద్యమపార్టీగా ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతాం.

– జీవీ.రామకృష్ణారావు, బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది



రాజన్న సిరిసిల్ల జిల్లాలో పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది. కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి అభీష్టం మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్తాం. పార్లమెంట్ ఎన్నికల్లోను బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తుంది. పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాయి.

– తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు

కార్యకర్తలకు అండగా ఉంటాం



అసెంబ్లీ ఫలితాలు బీఆర్‌ఎస్ శ్రేణులకు అసంతృప్తి కలిగించినా.. నేతలు, కార్యకర్తలందరం ఓటమికి గల కారణాలను సమీక్షించుకుని వచ్చే పార్లమెంట్, స్థానిక ఎన్నికల్లో విజయం సాధిస్తాం. ఓడిపోయామని ఢీలా పడాల్సిన అవసరం లేదు. మరింత పట్టుదలతో కేసీఆర్, కేటీఆర్ ఆదేశాలు, సూచనలతో ముందుకు సాగుతాం. కార్యకర్తలకు అండగా ఉంటూనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో విఫలమైతే ప్రజల మద్దతుతో పోరాటం చేస్తాం.

– కోరుకంటి చందర్, బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం



అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై పార్టీ పెద్దలు ఇప్పటికే సమీక్ష జరిపారు. పొరపాట్లు సరిదిద్దుకుని స్థానిక, పార్లమెంటు ఎన్నికలకు సిద్ధం అవుతాం. అదే సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు నిరంతర పోరాటం చేస్తాం. అవసరం అయితే పోరాటాలకు వెనుకాడేది లేదు. మాకు కాంగ్రెస్ పార్టీకి ఓట్ల వ్యత్యాసం కేవలం 2శాతం మాత్రమే. ఓడిపోయినా మేం క్షేత్ర స్థాయిలో చాలా బలంగా ఉన్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ పథకం అమలు కాకున్నా ఎక్కడికక్కడ నిలదీస్తాం.

– డాక్టర్ బీఎస్.రావు, బీఆర్‌ఎస్ నాయకుడు

అభివృద్ధే నా విజయ రహస్యం

- రూ.3వేల కోట్లతో కరీంనగర్‌ను మోడల్ సిటీగా తీర్చిదిద్దా
- తీగలవంతెన, మానేరు రివర్ ఫ్రంట్ కరీంనగర్‌కు మణిహారం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



సాక్షితో మాట్లాడుతున్న కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: 'కరీంనగర్ నియోజకవర్గాన్ని తొమ్మిదన్నరేళ్లలో రూ.3వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశా. ప్రజల మౌలిక అవసరాలే లక్ష్యంగా ముందుకు నడిచా. ఎవరికీ అన్యాయం చేయలేదు. అవినీతికి పాల్పడలేదు. ఏనాడూ ప్రజలకు అపకారం తలపెట్టలేదు. అందుకే నాలుగుసార్లు నన్ను ఆశీర్వదించి శాసనసభకు పంపారు. కరీంనగర్ ప్రజలకు జీవితకాలం రుణపడి ఉంటా. అభివృద్ధే మంత్రంగా పనిచేస్తా' అని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఎమ్మెల్యేగా నాలుగోసారి విజయం సాధించిన సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

సాక్షి: మీ వరుస విజయాల రహస్యమేమిటీ?

గంగుల: ప్రజల బాగోగులే లక్ష్యంగా అందరికీ అందుబాటులో ఉన్నా. ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేశా. 23 ఏళ్లుగా పదవిని ఓ బాధ్యతగా స్వీకరించి పనిచేస్తున్నా. వారంలో ఐదు రోజులు నియోజకవర్గకేంద్రంగా ఉంటూ చేసిన అభివృద్ధే నా విజయానికి దోహదమైంది.

ప్రశ్న: ఉత్కంఠ పోరులో గెలిచారు.. ఎలా సాధ్యమైంది?

గంగుల: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్షాల దుష్ప్రచారంతో ప్రజలు ఆయోమయానికి గురయ్యారు. రెండుసార్లు వరుసగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండటం, కొద్దిమేర వ్యతిరేకత ఉన్న దాన్ని కొండంత చేసి విష ప్రచారం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కొంతమేర దుష్ప్రచారం చేయడంతో లబ్ధిపొందగలిగారు. కేవలం రెండుశాతం ఓట్లతో కాంగ్రెస్ విజయం సాధించింది. బలమైన ప్రతిపక్షంగా ఉన్నాం. ఆరునెలల వరకు వారిచ్చిన హామీల అమలుకు వేచిచూస్తాం. ఆ తరువాత ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల పక్షాన ఉంటాం.

ప్రశ్న: ఈసారి మెజారిటీ తగ్గడానికి కారణాలు సమీక్షించారా?

గంగుల: గెలుపోటములు, డివిజన్ల వారీగా వచ్చిన ఓట్ల విషయంపై సమీక్షించుకున్నాం. మా ప్రభుత్వం రెండుసార్లు అధికారంలో ఉండటం, నేను వరుసగా నాలుగోసారి పోటీ చేయడం వల్ల ప్రతిపక్షాలు విషప్రచారం చేశాయి. దీంతో మెజార్టీ అనుకున్నంతగా సాధించలేక పోయాను.

ప్రశ్న: మీ పార్టీ అధికారంలో లేదు. రివర్ ఫ్రంట్ పనులకు సకాలంలో నిధులు వస్తాయా?

గంగుల: మా పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే కరీంనగర్‌కు నిధుల ఢోకా ఉండేది కాదు. ఇప్పుడూ ఉంటుందని నేననుకోను. ఇప్పటికే స్మార్ట్‌సిటీ పనులు పూర్తయ్యాయి. మానేరు రివర్‌ఫ్రంట్ దేశానికే తలమానికం. ఇది పూర్తయితే జిల్లా పర్యాటకానికి కొత్త రూపు వస్తుంది. ఇంతటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఆటంకాలు ఉంటాయని అనుకోను. 2009లోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నేను ఎమ్మెల్యేగా ఉండి నిధులు తీసుకొచ్చా. ఇప్పుడూ నగరఅభివృద్ధికి ప్రభుత్వానికి నివేదించి నిధులు తీసుకొస్తా.

ప్రశ్న: ఓటమిలేని నేతగా ఎలా ముందుకు సాగుతున్నారు?

గంగుల: నేను ఇక్కడే పుట్టి పెరిగాను. నాకు కరీంనగర్ ప్రజలతో ప్రత్యేకమైన బంధంఉంది. ఏమిచ్చినా.. కరీంనగర్ ప్రజల రుణం తీర్చుకోలేనిది. 2000 సంవత్సరం నుంచి తొలుత కౌన్సిలర్, కార్పొరేటర్, తరువాత ఎమ్మెల్యే, మంత్రి, ఇప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజల విశ్వాసాలను వమ్ము చేయకుండా ముందుకు సాగుతున్నా.

ప్రశ్న: కరీంనగర్‌లో ఇంకా చేయాల్సిన అభివృద్ధి ఏమిటీ?

గంగుల: గత పాలకుల నిర్లక్ష్యంతో కరీంనగర్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేది. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ తరువాత కరీంనగర్‌ను అభివృద్ధి చేశా. తీగలవంతెన, మానేర్‌రివర్ ఫ్రంట్, ఐటీ టవర్, తిరుమల తిరుపతి దేవస్థానం, ఇస్కాన్‌టెంపుల్, స్మార్ట్‌సిటీ హోదా సాధించి సుందరీకరణ పనులు చేయడంతో సిటీకి కొత్తశోభ నెలకొంది. భవిష్యత్ తరాలకు బాటలు వేసే ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతా.

నేడు దివ్యాంగులకు క్రీడాపోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు నేడు నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతీ వెల్లడించారు. అంధుల విభాగంలో రన్నింగ్, షాట్‌పుట్, చెస్, వినికిడి లోపం ఉన్నవారికి రన్నింగ్, షాట్‌పుట్, క్యారం, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శారీరక వైకల్యం కలిగిన వారికి వీల్‌చైర్ రేస్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, చెస్, క్యారం, రన్నింగ్ పోటీలు, మానసిక వికలాంగులకు షాట్‌పుట్, రన్నింగ్, క్యారం, చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 10 నుంచి 16ఏళ్ల వసువారిని ఒక విభాగంగా, 17 నుంచి 35ఏళ్లలోపు వారిని మరో విభాగంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 9 గంటలకు నేరుగా అంబేద్కర్ స్టేడియంలో హాజరుకావాలని సూచించారు.

తొలుత సన్నకారు రైతులకు..

- యాసంగి రైతుబంధుపై అన్నదాతల ఆందోళన
- 76,963 మందికి రూ.20.30కోట్లు విడుదల
- జిల్లాకు రావాల్సింది రూ.182.03కోట్లు
- కౌలు రైతులు, పెద్ద రైతులకు ఉన్నట్లా.. లేనట్లా?



కరీంనగర్ అర్బన్: రైతాంగానికి తీపి కబురు. పెట్టుబడి సాయం మంగళవారం నుంచి ఖాతాల్లో చేరుతోంది. యాసంగి సీజన్ ప్రారంభం కాగా పెట్టుబడికి ఆపసోపాలు పడ్డ అన్నదాతల బ్యాంకు ఖాతాలకు రోజువారిగా రైతుబంధు(పెట్టుబడి) చేరుతోంది. గత పట్టాదారుల సంఖ్యతో పాటు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందినవారికి రైతుబంధు వర్తింపజేశారు. జిల్లాలో కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూరు వ్యవసాయ డివిజన్లుండగా ఏఈవోలు అప్‌డేట్ చేసిన వివరాల ప్రకారం నేరుగా ఖాతాలకు జమ చేస్తున్నారు. తొలుత చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరనుంది. పెద్దరైతులకు రైతుబంధు వస్తుందా..రాదా అన్నది ఎలాంటి సమాచారం లేదని జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ వివరించారు. కాగా ధరణి పోర్టల్ వివరాలు, ఖాతా వివరాలిచ్చిన రైతుల ప్రకారం వ్యవసాయ విస్తరణ అధికారులు లాగిన్‌లో క్రోడీకరించారు. సదరు వివరాల క్రమంలో పెట్టుబడి సాయం పడుతుందని వివరించారు.

పెద్ద రైతులకు ఉన్నట్లా లేనట్లా

రైతు భరోసా కింద రైతులతో పాటు కౌలు రైతులకు పెట్టుబడి సాయం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ జిల్లాలో కేవలం 76వేల మందికి మాత్రమే రూ.20.30 కోట్లు ట్రెజరీకి చేరాయి. కాగా మరో 1.20లక్షల మంది రైతులుండగా వారందరి పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకం. ఐదు ఎకరాలలోపు రైతులకు మాత్రమే రైతుబంధు వస్తుందని, ఆపై ఉన్నవారికి పెట్టుబడి సాయం రాదని సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరుగుతుండగా ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తేనే గందరగోళానికి తెరపడనుంది.

కౌలు రైతులకు సాయమేది?

జిల్లాలో 1.79లక్షల మంది మాత్రమే ఖాతాల వివరాలిచ్చారు. పోర్టల్‌లో నమోదైన క్రమంలో రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, ఫొటో అందజేశారు. కాగా జిల్లాలో కౌలు రైతులు సుమారు 20వేల మంది వరకు ఉంటారని అంచనా. సదరు రైతుల వివరాలను వ్యవసాయశాఖ సేకరించకపోగా వారికి సాయం అందడం అనుమానమే. పెట్టుబడి సాయం వేసే అవకాశముంటే ఇప్పటికే కౌలు రైతుల వివరాలను సేకరించేవారు. కానీ జిల్లాలో ఆ ఊసే లేదు. ఇదిలా ఉంటే సీజన్‌కు ఎకరాకు రూ.7500లు జమ చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించగా రూ.5వేలు మాత్రమే జమ చేస్తున్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు సాయం అందకపోవడంపై జిల్లా రైతులు గందరగోళానికి గురవుతున్నారు.

జిల్లా గణాంకాలిలా
జిల్లాలో రెవెన్యూ గ్రామాలు: 206
పోర్టల్‌లో పట్టాదారులు: 1,97,097
విడుదలైన నగదు: రూ.20.30కోట్లు
నగదు జమ కానున్న రైతుల సంఖ్య: 76,963
మొత్తంగా రావాల్సింది: రూ.182.03కోట్లు
ఖాతాలిచ్చినవారు: 1,79,599
ట్రెజరీకి చేరిన నగదు: రూ.20,30,10,789

నేడు నగరానికి మంత్రి 'పొన్నం'



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఆర్టీసీ అధికారులు

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం కరీంనగర్‌కు రానున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా కరీంనగర్‌కు వస్తుండడంతో కాంగ్రెస్ శ్రేణులు, పొన్నం అభిమానులు, బీసీ సంఘాల ప్రతినిధులు భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్‌టీఆర్ విగ్రహం నుంచి కోతిరాంపూర్, కమాన్‌చౌరస్తా, బస్‌స్టేషన్ మీదుగా ఇందిరాచౌక్ వరకు మానకొండూరు, చొప్పదండి, వేములవాడ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్‌లతో కలిసి పొన్నం ప్రభాకర్ భారీ ర్యాలీతో నగరంలోకి రానున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు ఇందిరాచౌక్ వద్ద విజయభేరి పేరిట జరిగే సభలో మంత్రి పాల్గొంటారు. అనంతరం 6.40 గంటలకు టీఎన్‌జీఓ కార్యక్రమానికి హాజరవుతారు. రాత్రి 7.10 గంటలకు పద్మనగర్‌లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకొని కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. మరుసటిరోజు 14వ తేదీ గురువారం 8 గంటలకు కరీంనగర్ నుంచి బయలుదేరి 10.30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకొని అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటారు.

మంత్రిని కలిసిన ఆర్టీసీ అధికారులు

కరీంనగర్: బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం హుస్నాబాద్‌లో ఆర్టీసీ ఇన్‌చార్జి డీడీ రఘునాథ్‌రావు, ఆర్‌ఎం సుచరిత, అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. డిప్యూటీ ఆర్‌ఎం భూపతిరెడ్డి, సత్యనారాయణ, హుస్నాబాద్ డీఎం వెంకటేశ్వర్లు ఉన్నారు. అదే విధంగా పొన్నంను పీఆర్‌టీయూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, బాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లింగారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, మురళి, ఆంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు



కరీంనగర్‌స్పోర్ట్స్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలో జరిగిన అండర్–14,17 రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్ సెలక్షన్‌లో కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడాపాఠశాల విద్యార్థులు సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిమ్నాస్టిక్స్ నుంచి ఉమామహేశ్వరి, వెన్నెల, సంధ్యారాణి, శ్రీహిత కిరణ్ ఎంపికయ్యారు. వీరు ఈనెల 16 నుంచి 19వరకు ఢిల్లీలో జరిగే నేషనల్ పోటీల్లో పాల్గొననున్నారు. అథ్లెటిక్స్‌లో సయ్యద్, అంజలి, దీపిక ఎంపికకాగా ఈనెల 23, 24 తేదీల్లో పాట్నాలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అభినందించారు. డీవైఎస్‌వో కీర్తి రాజవీరు, జిల్లా జిమ్నాస్టిక్స్ సంయుక్త సెక్రెటరీ కాయితోజు బ్రహ్మాచారి, కోచ్‌లు ఇందిరా, గణేశ్, పవన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామంలో మంగళవారం 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బియ్యాన్ని వేలంపాట ద్వారా ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసినట్లు సదరు వ్యక్తులు తెలిపారన్నారు. సంబంధిత పత్రాలను పరిశీలించామని, పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కొలనూర్‌లో రైస్‌మిల్లు సీజ్

కోనరావుపేట(వేములవాడ): కొలనూర్‌లోని వినాయక రైస్‌మిల్లులో విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఓ వ్యాన్‌లో 38 క్వింటాళ్ల రేషన్ బియ్యం రాగా, పట్టుకున్నారు. తర్వాత మిల్లును సీజ్ చేశారు. కరీంనగర్ విజిలెన్స్ సీఐలు సందీప్‌కుమార్, అరుణ్‌కుమార్, వరుణ్‌కుమార్, పౌరసరఫరాల శాఖ డీటీ రవీంద్రాచారి, తహసీల్దార్ దినేశ్‌రెడ్డి, ఆర్‌ఐ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

జగిత్యాల క్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులోని పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.23,600 స్వాధీనం చేసుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. డబ్బులు సంపాదించవచ్చన్న ఆశతో పేకాడి, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ ఆటతో తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పట్టుబడిన వారితోపాటు నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

మల్యాల(చొప్పదండి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. మల్యాల ఎస్‌ఐ అశోక్ కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలంలోని డబ్బు తిమ్మయ్యపల్లికి చెందిన భూమాచారి(30) మంగళవారం పని నిమిత్తం బైక్‌పై జగిత్యాల వెళ్లాడు. రాత్రి స్వగ్రామం వస్తుండగా మల్యాల మండలంలోని నూకపల్లి శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డుపై పడిన వెదురు బొంగులు

- తప్పిన పెనుప్రమాదం



శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కొత్తగట్టు శివారు కరీంనగర్–వరంగల్ జాతీయ ప్రధాన రహదారిపై పెనుప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. వెదురు బొంగుల లోడ్‌తో ఓ బొలెరో వాహనం మంగళవారం వరంగల్ నుంచి కామారెడ్డి వెళ్తోంది. కొత్తగట్టు సమీపంలో స్పీడ్ బ్రేకర్‌పై డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెదురు బొంగులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ఘటనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో వాహనదారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

‘దొంగ మల్లన్న’ జాతరకు వేళాయె

- ఈ నెల 17 నుంచి జనవరి 11 వరకు నిర్వహణ
- గొల్ల, కుర్మ కులస్తుల ఆరాధ్య దైవం
- ముస్తాబైన మల్లన్నపేట ఆలయం
- ఉమ్మడి జిల్లా నుంచి తరలిరానున్న భక్తులు



మల్లికార్జునస్వామి దేవాలయం

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని తిరుమలాపూర్ పంచాయతీ అనుబంధ గ్రామం మల్లన్నపేటలో శ్రీ మల్లికార్జునస్వామి దొంగ మల్లన్నగా, షష్ఠి మల్లన్నగా భక్తుల నిత్యపూజలు అందుకుంటున్నారు. వారి కోర్కెలు తీర్చే స్వామిగా ఆయనకు పేరుంది. ఏటా మార్గశిర మాస శుద్ధ పంచమి మొదలు షష్ఠి 7 వారాలపాటు పూజలందుకుంటారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఉత్తరాన 62 కి.మీ. దూరంలో, జగిత్యాల జిల్లాకు తూర్పున 12 కి.మీ. దూరాన మల్లన్నపేటలో ఈ ఆలయం ఉంది. ఈ స్వామివారిని గొల్ల, కుర్మ కులస్తులు ఆరాధిస్తారు.

ఆలయ నేపథ్యం ఇదీ..

కొన్నేళ్ల క్రితం దొంగలు పొలాస పాలకులకు చెందిన కొన్ని ఆవులను దొంగిలించారు. వీరు వస్తుండగా దారిలో ఓ వ్యక్తి చూసి, ఇవి రాజుగారి ఆవులని గుర్తించాడు. దొంగలు తాము దొరికిపోతామన్న భయంతో మల్లికార్జునస్వామి విగ్రహం వద్దకు వెళ్లి, ఆవుల రంగుల మార్చి, గుర్తు పట్టకుండా చేస్తే గుడి కట్టిస్తామని మొక్కుకున్నారు. అనుకున్నది నెరవేరడంతో స్వామివారికి రాత్రికి రాత్రే గుడి కట్టారు. ఈ కారణంగా ఆలయాన్ని దొంగ మల్లన్న ఆలయమని పిలుస్తున్నారు. మార్గశిర శుద్ధ పంచమి తర్వాత వచ్చే షష్ఠికి ప్రారంభం కావడంతో షష్ఠి మల్లన్న జాతర అని కూడా పిలుస్తారు.

బోనం తీయడం ఆనవాయితీ

ఆలయం ఎదుట మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం, దండివారం జాతర, నాగవెల్లితో ప్రారంభమై మార్గశిర బహుళ త్రయోదశి చివరి రోజుతో షష్ఠి 7 వారాలపాటు జాతర సాగుతుంది. స్వామివారికి ఇష్టమైన ఆది, బుధవారాల్లో భక్తుల సందడి ఎక్కువగా ఉంటుంది. జాతరకు వచ్చిన ప్రతీ కుటుంబం బోనం తీయడం ఆనవాయితీ. కోరిన కోర్కెలు తీరితే తమ ఎత్తు బెల్లం పంచడం, తలనీలాలు ఇవ్వడం, స్వామి వారికి ఒడిబియ్యం సమర్పించడం, గండదీపంలో నూనె పోయడం, ఆలయ మండపంలో గంటలు కట్టడం తదితర రకాల్లో మొక్కు చెల్లించుకుంటారు.



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు (ఫైల్)

తేదీలు.. కార్యక్రమాలు

ఈ నెల 17న రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం, 18న(ఆదివారం) దండివారం, 20న మంగళవారం నాగవెల్లి, పెద్దపట్నం, అగ్ని గుండాలు, 20 నుంచి ప్రతీ ఆది, బుధవారాల్లో జాతర జరుగుతుంది. చివరి రోజు జనవరి 11న (గురువారం) మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, చండీహవనం, పూర్ణాహుతితో ముగుస్తుంది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తులకు జగిత్యాల పాత బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సుల సౌకర్యం ఉందని సర్పంచ్ సిద్దంకి నర్సయ్య, ఎంపీటీసీ సభ్యుడు గోస్కుల రాజన్న, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఆలయంలో కొలువుదీరిన స్వామివారు

రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

వేములవాడ: వేములవాడ రాజన్నకు రూ.2 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఈవో కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు హుండీలలోని డబ్బు, నగలను లెక్కించారు. రూ.2 కోట్ల నగదుతోపాటు 203 గ్రాముల బంగారం, 10 కిలోల వెండి సమకూరినట్లు ఏఈవో ప్రతాప నవీన్ పేర్కొన్నారు.

కొండగట్టుకు పోటెత్తిన భక్తులు



ఆలయ ఆవరణలో భక్తుల సందడి



సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. చలిని లెక్క చేయకుండా తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. సుమారు 25 వేల మంది వచ్చారని ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్లు పర్యవేక్షించారు.

గోదావరికి గంగాహారతి



గోదావరిలో వెలిగించిన దీపాలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

ధర్మపురి: గోదావరి తీరంలో మంగళవారం సాయంత్రం గంగాహారతిని ఘనంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆధ్వర్యంలో ముందుగా గోదావరికి మేళతాళాలతో తరలివెళ్లారు. మంగలిగడ్డ పుష్కరఘాట్ వద్ద పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. స్వామివారలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాస్, రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ముత్యాల శర్మ తదితరులున్నారు.

లోకాయుక్త నుంచి అధికారులకు నోటీసులు

- చెట్ల నరికివేత విషయంలో 14న హాజరుకావాలని ఆదేశం

వేములవాడరూరల్: అనుమతి లేకుండా ప్రభుత్వ భూముల్లో ఉన్న చెట్లను నరికివేసి, విక్రయించిన ఘటనపై ఓ యువకుడు లోకాయుక్తతో ఫిర్యాదు చేశాడు. దీంతో సంబంధిత అధికారులకు నోటీసులు జారీ అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. వేములవాడరూరల్ మండలం మల్లారం గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ఉన్న దేవతల చెరువులో తుమ్మ, ఇతర చెట్లను గ్రామ పంచాయతీ అనుమతితో నరికివేసి, విక్రయించారు. ఈ విషయమై అదే గ్రామానికి చెందిన కొంపెల్లి శ్రీకాంత్ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫలితం లేకపోవడంతో గత అక్టోబర్ 11న లోకాయుక్తను ఆశ్రయించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాడు. దీంతో ఈ నెల 14న హాజరుకావాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ మంగళవారం నోటీసులు జారీ అయ్యాయి. దీనిపై వేములవాడ రెవెన్యూ అధికారులను వివరణ కోరగా లోకాయుక్త నుంచి నోటీసులు వచ్చాయని పేర్కొన్నారు.



ట్రాక్టర్‌లో కలప తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

చాతిలో నొప్పితో వృద్ధుడి మృతి

ధర్మపురి: కూరగాయలు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వెళ్లిన ఓ వృద్ధుడు అకస్మాత్తుగా చాతిలో నొప్పి రావడంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని రాజారం గ్రామానికి చెందిన బగ్గి పోశన్న (75) మంగళవారం ధర్మపురిలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. చాతిలో నొప్పి రావడంతో పక్కనే ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా ఈసీజీ తీశారు. పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే కరీంనగర్ వెళ్లాలని సూచించారు. కానీ, పోశన్న కాలినడకన వెళ్లి, మార్కెట్‌లో కూర్చున్నాడు. నొప్పి ఎక్కువై, కిందపడిపోయాడు. మార్కెట్‌లో ఉన్నవారు గమనించి, లేపేసరికి చనిపోయాడు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొని, రోదించారు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లారు.



పోశన్న మృతదేహం

చేపలు పట్టేందుకు వెళ్లి.. దారితప్పి

- బాధితుడిని రక్షించిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ లోయర్ మానేరు డ్యాంలో చేపలు పట్టడానికి వెళ్లి, దారితప్పిన ఓ వ్యక్తిని లేక్ పోలీసులు రక్షించారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సప్తగిరికాలనీకి చెందిన ఎరవేని దుర్గయ్య డ్యాంలో చేపలు పట్టడానికి మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో వెళ్లాడు. మంచు ఎక్కువగా ఉండి, చూపు మందగించడంతో హన్మాజిపల్లి గుట్టల వైపు వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న లేక్ అవుట్‌పోస్ట్ ఎస్‌ఐ సురేశ్, కానిస్టేబుల్ వీరస్వామి, టూరిజం బోట్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, రెస్క్యూ టీం ఆనంద్, మల్లేశంలు బోట్‌పై వెళ్లి, అతన్ని రక్షించి, ఒడ్డుకు చేర్చారు.



దుర్గయ్యను ఒడ్డుకు తీసుకువస్తున్న పోలీసులు

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం: ఓ యువతి ఆత్మహత్య చేసుకుందని కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు జిల్లాకు చెందిన సుజాత భర్త ఎనిమిదేళ్ల క్రితం చనిపోయాడు. దీంతో ఆమె ఏడేళ్ల క్రితం తన ముగ్గురు కూతుళ్లను తీసుకొని, కరీంనగర్ వచ్చింది. స్థానికంగా హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసముంటూ కూలీ పని చేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. ఆమె మూడో కూతురు ధన(19) నగరంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. స్థానికుడైన ఓ యువకుడు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పాడని తన తల్లికి చెప్పింది. దీంతో ఆమె కాలేజీ మానిపించి, ఫోన్ లాగేసుకుంది. ఆ తర్వాత బాగానే కనిపించిన ధన మంగళవారం సుజాత కూలీ పనికి వెళ్లి, మధ్యాహ్నం వచ్చేసరికి తలుపులు గడియ పెట్టి ఎంత పిలిచినా తీయలేదు. వాటిని బలవంతంగా తెరిచి చూసేసరికి ఉరేసుకొని కనిపించింది. స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రేమించానని చెప్పిన యువకుడి కారణంగానో, మరే ఇతర కారణాల వల్లనో ధన ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని ఆమె తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

- వ్యక్తిపై కేసు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని పోతారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్ సంతకం ఫోర్జరీ చేసి, ఇంటి ఓనర్‌షిప్ సర్టిఫికెట్ తయారు చేసిన బండి రాజగంగారాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ ఘటనపై ఇటీవల వివాదం జరిగిందన్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టి, రాజగంగారాం జీపీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు తేల్చారని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవ్వాలి

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్, హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాలకు సంబంధించి పీవో, ఏపీవో, ఓపీవోల ట్రాన్స్‌పోర్టేషన్, ఎన్నికలకు సంబంధించిన నోడల్ అధికారుల నియామకం, కావాల్సిన మౌలిక వసతులపై మాట్లాడారు. జిల్లా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ నిర్వహించి, ఎన్నికల సంసిద్ధతపై సమీక్షించుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు లేదా ప్రతినిధులతో మాట్లాడాలన్నారు. 2 కి.మీ. కన్నా ఎక్కువ దూరంలో పోలింగ్ కేంద్రాలుంటే లేదా 1,300 మందికన్నా ఎక్కువ మంది ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంటే గుర్తించాలన్నారు. అలాంటి చోట్ల కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అన్ని నియోజకవర్గాల్లో మరణించిన, బదిలీ అయిన, డూప్లికేట్ తదితర ఓటర్లు లేకుండా పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, హుస్నాబాద్ ఆర్డీవో బెన్‌సలాన్, సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్, వేములవాడ ఆర్డీవో మధుసూదన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

మహిళా హోంగార్డుకు తీవ్ర గాయాలు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్‌షాక్ కారణంగా తొగిటి రాధ అనే మహిళా హోంగార్డుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం విధుల్లో ఉన్న రాధ ఠాణాలో జామకాయలు తెంపుతోంది. ఈ క్రమంలో చెట్టు కొమ్మలకు 11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతం సంభవించింది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. ఎస్‌ఐ సదాకర్ హుటాహుటిన జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ వెంకటస్వామి, రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ ఆస్పత్రికి వెళ్లి, రాధ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి సూచనల మేరకు ఆమెను వరంగల్ ఎంజీఎంకు తరలించారు.



ఆస్పత్రిలో రాధను పరామర్శిస్తున్న అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు

ఇటు చదువు.. అటు పరిశోధనలు

- క్షేత్ర పర్యటనల ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన
- ఆదర్శంగా నిలుస్తున్న ఘన్ముక్కుల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్



విద్యార్థులకు వరి సాగుపై వివరిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)

వీణవంక(హుజూరాబాద్): పరిశోధనలకు కేరాఫ్‌గా నిలుస్తున్నారు వీణవంక మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి. ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తూనే ఇంటర్, పదోతరగతి విద్యార్థులకు వృక్ష, జీవశాస్త్రం సబ్జెక్టులను బోధిస్తున్నారు. పీహెచ్‌డీ చేసిన ఆయన దేశవ్యాప్తంగా వివిధ పరిశోధన సంస్థలు నిర్వహించిన సెమినార్లలో పరిశోధన పత్రాలను సమర్పించారు. పాఠ్యాంశాలు సులువుగా అర్థం కావాలని విద్యార్థులను క్షేత్ర పర్యటనలకు తీసుకెళ్తున్నారు. ప్రయోగపూర్వకంగానూ నేర్చుకోవాలన్న ఉద్దేశంతో పిల్లలు సైన్స్ ల్యాబ్‌లోనే ఎక్కువగా గడుపేలా ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే 85 మంది సైన్స్‌ఫేర్‌లో జిల్లా, రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకున్నారు.

2011లో స్కూల్ ఏర్పాటు..

వీణవంక మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఘన్ముక్కుల శివారులో మోడల్ స్కూల్‌ను 2011లో ఏర్పాటు చేశారు. ఇక్కడ 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రారంభం నుంచే పదోతరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటుతున్నారు. ఇక్కడ అడ్మిషన్ లభించడం కష్టమన్న పేరుంది. సమర్థులైన ఉపాధ్యాయులు, అనుభవం కలిగిన ప్రిన్సిపాల్ ఉండటం విద్యార్థులకు కలిసివస్తోంది. వరి, పత్తి, ఇతర పంటలతోపాటు మాక్ పోలింగ్, పురాతన కట్టడాలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు యూనిఫాం తప్పనిసరి. తల్లిదండ్రులకు పిల్లల స్థితిగతులను వివరిస్తుంటారు. 6వతరగతి నుంచే పిల్లలకు ఐఐటీ నేర్పుతున్నారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

వరించిన అవార్డులు..

వేణుగోపాల్‌రెడ్డిని 2018లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు వరించింది. అప్పటి సీఎం కేసీఆర్ చేతులమీదుగా అందుకున్నారు. కరోనా సమయంలో పలు అవగాహనా కార్యక్రమాలు చేపట్టడంతో అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసాపత్రం అందజేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పలు సెమినార్లలో పాల్గొని, ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు.

నెలలో 4 రోజులు క్షేత్ర పర్యటనే



క్షేత్ర పర్యటనల ద్వారా విద్యార్థులకు బోధన సులువుగా అర్థమవుతుంది. నెలలో 4 రోజులు వాటికి కేటాయిస్తున్నాం. వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. 6వ తరగతి నుంచే ఐఐటీకి ప్రాధాన్యం ఇస్తున్నాం. పిల్లల తల్లిదండ్రుల సహకారం మరువలేనిది.

– డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్

క్లుప్తంగా

హామ్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ


నోట్ పుస్తకాలు, పెన్నులతో విద్యార్థులు

కరీంనగర్: హామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సరస్వతీనగర్ కపిల్ బాలకుటీర్‌లో ఉంటున్న విద్యార్థులకు 50 నోట్ పుస్తకాలు, పెన్నులు, పండ్లు అందజేశామని సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. తమ సంస్థ సభ్యుడు గండ్ర శ్రీకాంత్‌రావు జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. రాజు, అఖిల్, మనీష్, బాలకుటీర్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి

కరీంనగర్: జిల్లావ్యాప్తంగా ఉన్న ఆటో, టాటా ఏసీ, ట్యాక్సీ డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని, దాదాపు 50వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని పబ్లిక్ అండ్ ప్రైవేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్–సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు పున్నం రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఉపాధికి గండి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ చార్జీలతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఆటోలమ్ముకునే పరిస్థితి నెలకొందని, నెలకు జీవనభృతి కింద రూ.15 వేలివ్వాలని, 10లక్షల ప్రమాద బీమా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని అన్నారు.

ఉపాధిహామీ గ్రామసభలు


చెర్లభూత్కూర్ గ్రామసభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు


కరీంనగర్‌రూరల్: చెర్లభూత్కూర్, బొమ్మకల్, గోపాల్‌పూర్, చామనపల్లి, మందులపల్లి గ్రామాల్లో మంగళవారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామసభల్లో చదివి విన్పించారు. సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్ వాయిజ్, హిదైతుల్లా, ప్రభాకర్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ పద్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

500వ రోజుకు నిత్యాన్నదానం


అన్నదానం చేస్తున్న సంస్థ బాధ్యులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో భరోసా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం మంగళవారంతో 500 రోజులకు చేరింది. దాతల సహకారంతో ప్రారంభించిన నిత్యాన్నదాన కార్యక్రమం ద్వారా ప్రతిరోజు 200 మందికి భరోసా సంస్థ అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు ఆధ్వర్యంలో సంస్థ బాధ్యులు భోజనాన్ని సమకూరుస్తున్నారు. మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సంస్థ బాధ్యులు మోహన్, చారి, కైలస నవీన్, పట్టురు శ్రీనివాస్, తిరుపతి, మనోజ్, సతీష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు చేయూత


చీరలు అందజేస్తున్న స్వప్న

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మేముసైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కాలనీల్లోని నిరుపేదలకు అన్నదానంతో పాటు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న–శ్రీనివాస్, శైలజ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా ఝాన్సీరాణి

కరీంనగర్‌కార్పొరేషన్: మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నగరానికి చెందిన చంద్రిక ఝాన్సీరాణి నియమితులయ్యారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు.

ఆరోగ్య మహిళకు స్పందన

- ప్రతి మంగళవారం ప్రత్యేక వైద్యసేవలు
- చామనపల్లి పీహెచ్‌సీలో మహిళలకు సౌకర్యం
- ఇప్పటివరకు 1,140 మందికి వైద్య పరీక్షలు


మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


మహిళలకు పేషెంట్ షీట్ అందిస్తున్న వైద్య సిబ్బంది

కరీంనగర్‌రూరల్: మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది మార్చి 8న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించింది. మహిళలకు వచ్చే వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా ప్రతి మంగళవారం ఎంపిక చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన మందులను అందిస్తున్నారు.

1,140 మందికి..

కరీంనగర్ మండలం చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి పథకాన్ని సెప్టెంబరు 12న ప్రారంభించారు. ప్రతి మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని 20 గ్రామాల నుంచి వచ్చే మహిళలకు థైరాయిడ్, షుగర్, బీపీ, మూత్రకోశ, సూక్ష్మపోషకాలు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ తదితర వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. బయటకు చెప్పుకోలేని ఆరోగ్య సమస్యలను గుర్తించి చికిత్స అందిస్తున్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంల ద్వారా వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పించి చైతన్యపరుస్తున్నారు. పీహెచ్‌సీలో ఆరోగ్యలక్ష్మి పథకం ప్రారంభించిన నుంచి ఇప్పటివరకు మొత్తం 1,140 మంది మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన మందులను పంపిణీ చేయడంతో పాటు వైద్యం అవసరమున్న వారిని సంబంధిత ఆస్పత్రులకు పంపించారు. మంగళవారం వైద్యురాలు శోభ ఆధ్వర్యంలో 91 మంది మహిళలకు పరీక్షలు చేయగా.. వీరిలో 13 మందికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. ఐదుగురిని మెరుగైన వైద్యసేవల కోసం సంబంధిత ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పీహెచ్‌సీ పరిధి లోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి మంగళవారం మహిళా వైద్యులతో వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నాం. వ్యాధి నిర్ధారణయితే చికిత్స చేసి అవసరమైన మందులను అందిస్తున్నాం. క్యాన్సర్, గుండె సంబంధిత ఇతర వ్యాధులుంటే చికిత్స కోసం సంబంధిత ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నాం.

– డాక్టర్ మనోహర్,
చామనపల్లి పీహెచ్‌సీ వైద్యుడు

పొన్నం, కవ్వంపల్లికి సత్కారం


కవ్వంపల్లి, పొన్నంను సత్కరిస్తున్న శంకర్



విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర బీసీ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మంగళవారం కాంగ్రెస్ అధికార ప్రతినిధి, రేకుర్తి 18వ డివిజన్ ఇన్‌చార్జి బాలబద్రి శంకర్ కరీంనగర్‌లో కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడమండ్ల మనోజ్, రేకుర్తి యూత్ నాయకుడు దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

గంగులను కలిసిన ఎంఐఎం నాయకులు


ఎమ్మెల్యే కమలాకర్‌తో నాయకులు

కరీంనగర్/విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగోసారి గెలిచి రికార్డు సృష్టించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో పార్టీ కార్పొరేటర్లు, నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మీసేవ కార్యాలయంలో పూల బొకే అందించి అభినందనలు తెలిపారు. గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. కరీంనగర్ నగర అభివృద్ధికి, డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ ఆతిఫ్ అతిన, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఫిరోజ్ అఖీల్, కార్పొరేటర్ షర్ఫుద్దీన్, నాయకులు అలిబాబా, అజర్, ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్

కరీంనగర్‌రూరల్: లక్నోలో ఈనెల 17 నుంచి నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన విద్యార్థి నక్షత్ర ఎంపికైనట్లు కోచ్ గౌతమ్ తెలిపారు. ఇటీవల హన్మకొండలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో నక్షత్ర ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి బంగారు, రజత పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందినట్లు వివరించారు. మంగళవారం నక్షత్రను పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీకాంత్, కోచ్ గౌతమ్, అనిల్ తదితరులు అభినందించారు.

కాళికామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: అమావాస్య సందర్భంగా నగరంలోని 24వ డివిజన్ కిసాన్‌నగర్‌లో ఉన్న కాళికామాత అమ్మవారిని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో నాలుగోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి, మొదటిసారి ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు కార్పొరేటర్ కుర్ర తిరుపతి ఆధ్వర్యంలో స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, బోనాల శ్రీకాంత్, గంట కల్యాణి–నివాస్ పాల్గొన్నారు.

చిత్ర కథ: మురుగు నీరు వెళ్లేదెలా..?



కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ పంచాయతీ లక్ష్మి నగర్‌లో మురుగు కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పంచముఖ హన్మాన్ దేవాలయం ముందు రాజీవ్ రహదారి సమీపంలోని మురుగు కాలువలో నీళ్లన్ని నిలిచి దుర్వాసన వస్తోంది. మురుగు కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో నీళ్లు ముందుకు పోలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురుగు నీళ్లు ముందుకు పోయేలా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పారమిత విద్యాసంస్థలకు అరుదైన గౌరవం


ప్రసాద్‌రావును అభినందిస్తున్న డైరెక్టర్లు, సిబ్బంది

కరీంనగర్: పారమిత విద్యాసంస్థలకు అరుదైన గౌరవం దక్కింది. ఆస్ట్రేలియా దేశానికి చెందిన విక్టోరియా రాష్ట్ర విశ్వవిద్యాలయం దక్షిణ ఆసియా ఖండానికి చెందిన ప్రతిభావంతులైన 25 మంది విద్యావేత్తలను ఆస్ట్రేలియాలోని పాఠశాలల, విశ్వవిద్యాలయాల విద్యాపరమైన విధివిధానాలను పరిశీలించడానికి ఆహ్వానించారు. అత్యంత విశిష్టమైన ఈ గౌరవం పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాద్‌రావుకు దక్కింది. భారతదేశం నుంచి డాక్టర్ ఇ.ప్రసాదరావు దక్షిణ ఆసియా నుంచి ఎంచుకోబడిన 25 మందిలో ఒకరు. పారమిత ఎక్స్‌పోరికా పాఠశాలలో జరిగిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ ఈ.ప్రసాద్‌రావు మాట్లాడారు. పారమిత పాఠశాలల డైరెక్టర్ రశ్మిత ప్రసాద్ పారమిత బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, వినోదరావు, రాకేశ్, అనుకర్‌రావు, వీఎం ప్రసాద్, హనుమంతరావు, ప్రిన్సిపాళ్లు, సమన్వయ కర్తలు, తల్లిదండ్రులు, స్కూల్ మేనేజిమెంట్ కమిటీ బృందం తదితరులు పాల్గొన్నారు.

రంగోత్సవంలో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): రంగోత్సవం ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన డ్రాయింగ్ కాంపిటేషన్స్‌లో కోతిరాంపూర్‌లోని సవరన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల నుంచి 60 మంది విద్యార్థులు రంగోత్సవంలో పాల్గొనగా.. 12 మంది జాతీయస్థాయికి ఎంపికయ్యారు. 9 మంది బంగారు, ఇద్దరు రజత, ఒకరు కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరం సతీష్, డ్రాయింగ్ టీచర్ కోడూరి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

కరీంనగర్‌స్పోర్ట్స్: హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రంలో ఈనెల 14 నుంచి 17 వరకు జరిగే జాతీయ స్థాయి సీనియర్స్ నెట్‌బాల్ పోటీలకు స్థానిక మంకమ్మతోటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అంజన్న సాయి ఎంపికైనట్లు నెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, సర్వర్ తెలిపారు. ఇటీవల నిర్మల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిలుముల ప్రమీల, సీనియర్ ఉపాధ్యాయులు జాన్ సుధాకర్, జనార్దన్‌రెడ్డి, జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు కృష్ణ, అంతడ్పుల శ్రీనివాస్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులను పర్యవేక్షించాలన్నారు. ప్రతి దుకాణదారుడు విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆస్తి పన్ను మదింపును చేపట్టాలని సూచించారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటర్ల చిరునామాల మార్పును పరిశీలించాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ స్వరూప, అసిస్టెంట్ కమిషనర్ నరేశ్‌బాబు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి



ముగ్ధహాసినిని అభినందిస్తున్న డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌కు చెందిన 8వతరగతి విద్యార్థి టి.ముగ్ధహాసిని జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ అండర్–14 బాలికల విభాగంలో రాష్ట్ర జట్టులో ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. రంగారెడ్డిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం గర్వంగా ఉందన్నారు. జాతీయస్థాయిలో సైతం సత్తా చాటి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డు ప్రదానం

మానకొండూర్‌రూరల్: సమాజానికి సేవలందిస్తున్న వివిధ స్వచ్ఛంద సంఘాలను మక్ష్ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ గుర్తించింది. సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించింది. హైదరాబాద్‌కు చెందిన సుంకు బాలచంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభయ స్వచ్ఛంద సంస్థ కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్, మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఆరెల్లి అరుణప్రభంజన్ ప్రజలకు చేసిన సేవలను గుర్తించి, రూరల్‌డెవలప్‌మెంట్, సాంఘికసేవలకు అంతర్జాతీయ బహుమతి ప్రదానం చేశారు. నిర్వాహకులు దినేశ్, సుజాత, యూనియన్ మాజీ ఫార్మర్ మినిస్టర్, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి, జ్యోతి పాల్గొన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యే సత్యంకు సన్మానం


సత్యంను సన్మానిస్తున్న మహిళలు

కొత్తపల్లి: చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన మేడిపల్లి సత్యంను మంగళవారం తాను నివాసముండే బాలాజీనగర్ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. బాలాజీనగర్ కాలనీలో ఉంటూ ఎమ్మెల్యేగా గెలుపొందడం కాలనీకే గర్వకారణమని కొనియాడారు. బాలాజీనగర్ ఇంటి యజమానుల సంఘం అధ్యక్షుడు కర్క రాంచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు దయాసాగర్, కార్యదర్శి పుల్కం రాజిరెడ్డి, బండ రమణారెడ్డి, కోశాధికారి వేముల రవీందర్‌రెడ్డి, మామిడాల ప్రభాకర్, ఎడ్ల పల్లవి, వేముల నిర్మలాదేవి, గుడి శారద, ద్యావ శ్రీమతి, పుల్కం రజిత, స్వరూప పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార ఎన్నికలు

మానకొండూర్: మండలంలోని లలితాపూర్‌లో మంగళవారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం గ్రామ శాఖ ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా పొలవేని రామయల్లు, ఉపాధ్యక్షుడిగా పొలవేని రాజయ్య, కార్యదర్శిగా బల్ల కిష్టయ్య, సంఘం డైరెక్టర్లుగా పొలవేని రాయలింగు, బల్ల అంజి, పొలవేని ప్రభాకర్, శ్రీనివాస్, సమ్మయ్య, తిరుపతి ఎన్నికయ్యారు.

క్లుప్తంగా...

జెన్‌కో ఏఈ పరీక్ష వాయిదా

'ప్రజావాణి'లో వచ్చిన విజ్ఞప్తిపై సర్కారు సానుకూల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో నిరుద్యోగ అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు జెన్‌కో ఏఈ రాత పరీక్షను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) పోస్టుల భర్తీకి ఈ నెల 17న నిర్వహించతలపెట్టిన రాతపరీక్షను వాయిదా వేసినట్టు ఆ సంస్థ మానవ వనరుల విభాగం డైరెక్టర్ అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఇతర సంస్థల/ప్రభుత్వ పోటీపరీక్షలు ఉండటంతో జెన్‌కో ఏఈ రాతపరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఏఈ పరీక్షల తదుపరి షెడ్యూల్‌ను సంస్థ వెబ్‌సైట్ www. tsgenco.co.inలో ప్రకటిస్తామన్నారు. జెన్‌కోలో ఏఈ(ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్) పోస్టుల భర్తీకి సంస్థ యాజమాన్యం అక్టోబర్ 4న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

హెరాయిన్ రవాణా కేసులో నిందితురాలికి పదేళ్ల జైలు శిక్ష

- జాంబియా దేశస్తురాలి నుంచి రూ. 20 కోట్ల విలువైన మత్తు పదార్థాలు స్వాధీనం
- 2021లో అరెస్ట్ చేసిన డీఆర్ఐ

సాక్షి, హైదరాబాద్: హెరాయిన్ అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నిందితురాలికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పునిచ్చినట్టు డీఆర్ఐ(డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు తెలిపారు. ఈ మేరకు డీఆర్ఐ అధికారులు మంగళవారం ఓ ప్రకటన జారీ చేశారు. 2021 జూలై 19న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జాంబియా దేశస్తురాలి వద్ద నుంచి రూ.20.80 కోట్ల విలువైన 3200 గ్రాముల హెరాయిన్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ సెక్షన్ 21, 23ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. నిందితురాలు తన సూట్‌కేసులో రహస్యంగా హెరాయిన్ దాచి అక్రమంగా రవాణా చేస్తున్నట్టు పూర్తి ఆధారాలను డీఆర్ఐ అధికారులు కోర్టుకు సమర్పించారు. కేసు నిరూపితం కావడంతో కోర్టు నిందితురాలికి పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష కొనసాగించాలని తీర్పులో వెల్లడించారు.

దొంగలు దూరారు!

టీడీపీ సానుభూతిపరులు.. పలు చోట్ల ఓటర్లుగా నమోదు

కుప్పం సహా 175 నియోజకవర్గాల్లో 40.76 లక్షలకుపైగా బోగస్ ఓట్లు

- అధికార పార్టీ ఓటర్లపై గురి..కుప్పలు తెప్పలుగా ఫారం 7 దరఖాస్తులు
- విచారణ జరిపి ఆ దరఖాస్తులన్నీ నకిలీవని తేలుస్తున్న బీఎల్వోలు
- దీంతో ఎన్నికల యంత్రాంగంపై దాడులకు తెగబడుతున్న పచ్చముఠాలు
- నకిలీ ఓట్లను కొనసాగించేందుకు 8 జిల్లాల్లో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు



సాక్షి, అమరావతి: ఏపీలో నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రజాస్వామ్య ప్రక్రియపై విశ్వాసం కోల్పోయిన విపక్షం అడ్డదారులు పడుతోంది! ఏపీ వ్యాప్తంగా ఓట్ల దొంగలు స్వైర విహారం చేస్తున్నారు! అధికార పార్టీ చేపట్టిన సామాజిక సాధికారయాత్ర, ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కోవడం అసాధ్యమనే నిర్ణయానికి వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేనతో చేతులు కలిపినా ఫలితం శూన్యమని గుర్తించారు. దీంతో 2019 ఎన్నికలకు మించి మరోసారి ఘోర పరాజయం తప్పదని పసిగట్టిన టీడీపీ పెద్దలు.. దొడ్డిదారి పట్టారు! తమకు మాత్రమే సాధ్యమైన వ్యవస్థలోకి వైరస్‌లా చొరబడి చాపకింద నీరులా ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లను చేర్పిస్తున్నారు.

40,76,580కిపైగా దొంగ ఓట్లు

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అక్టోబర్ 27న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లో 4,02,21,450 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఇందులో సుమారు 40,76,580కిపైగా దొంగ ఓట్లను టీడీపీ నేతలు చేర్పించినట్లు ప్రజాసంఘాలు, రాజకీయ పరిశీలకులు గుర్తించారు. తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను పలు నియోజకవర్గాల్లో ఒకే ఫోటోతో ఇంటి పేర్లు మార్చి జాబితాలో చేర్పించారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న తమ పార్టీ సానుభూతిపరుల పేర్లను సైతం రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలో చేర్పించారు. ఒకే డోర్ నెంబర్‌పై వందల ఓట్లను నమోదు చేయించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 46,165 పోలింగ్ బూత్‌ల పరిధిలోనూ ఇదే కథ. ఇప్పటికీ దొంగ ఓట్లను నమోదు చేయించే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు జీవించి ఉన్నా చనిపోయినట్లు, స్థానికంగా నివాసం ఉంటున్నా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు చిత్రీకరిస్తూ ఆ ఓట్లను తొలగించేందుకు కుప్పలు తెప్పలుగా ఫారం-7 దరఖాస్తులు సమర్పిస్తున్నారు. బీఎల్వోల (బూత్ లెవల్ ఆఫీసర్లు) విచారణలో ఇవన్నీ వెలుగులోకి వస్తున్నాయి.

దాడులు.. బ్లాక్ మెయిల్

ఫారం 7లపై విచారణ జరిపి దొంగ ఓట్లను ఆధారాలతోసహా తేల్చి ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్న బీఎల్వోలు, తహసీల్దార్లపై టీడీపీ నేతలు దాడులకు దిగుతున్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో శావల్యపురం తహసీల్దార్‌పై నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ ఇటీవల దాడికి తెగబడ్డారు. తాము చేర్పించిన దొంగ ఓట్లను తొలగించకుండా కలెక్టర్లను సైతం టీడీపీ నేతలు బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. అనంతపురం, శ్రీకాకుళం, అంబేడ్కర్ కోనసీమ, గుంటూరు, అన్నమయ్య, బాపట్ల, తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లపై ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడమే అందుకు నిదర్శనం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నాడు.. ఐదు లక్షల దొంగ ఓట్లతో

రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల నాటికి ఓటర్ల జాబితాలో సుమారు 35 లక్షలకుగా దొంగ ఓట్లు ఉన్నట్లు ప్రజాసంఘాలు గుర్తించాయి. ఆ ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఆ దొంగ ఓట్లను తొలగించి ఉంటే 2014లోనే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి ఉండేదని అప్పట్లోనే ప్రజా సంఘాలు, రాజకీయ పరిశీలకులు తేల్చిచెప్పారు.

కేసులపై బయటెక్కడా మాట్లాడొద్దు

చంద్రబాబుకు సుప్రీంకోర్టు ఆదేశం

- స్కిల్ కేసుతోపాటు ఫైబర్‌నెట్ కేసుకూ ఇది వర్తిస్తుంది
- ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వచ్చే నెల 17కి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ అధినేత చంద్రబాబు తనపై ఉన్న కేసుల గురించి బహిరంగంగా ఎక్కడా మాట్లాడవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకు సూచించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసే కాకుండా ఫైబర్‌నెట్ కేసుకు కూడా ఇది వర్తిస్తుందని తేల్చిచెప్పింది. ఫైబర్‌నెట్ కుంభకోణానికి సంబంధించి చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ విషయాన్ని ప్రస్తావించారు. 'స్కిల్'కేసులో తానెలాంటి రాజకీయ ప్రకటన చేయనని చెప్పిన చంద్రబాబు డిసెంబర్ 8న దాన్ని ఉల్లంఘించారని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఇలాంటివి ఏమున్నా రికార్డు రూపంలో కోర్టుకు అందజేయాలని ధర్మాసనం పేర్కొంది. ఈ సమయంలో సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు గురించి చెప్పాల్సింది చాలా ఉందన్నారు. అనంతరం ఫైబర్‌నెట్ కేసు విచారణను జనవరి 17కి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. కోర్టు మౌఖికంగా గతంలో చెప్పింది (ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుని అరెస్టు చేయబోమని) కొనసాగుతుందా అని లూథ్రా ధర్మాసనాన్ని కోరగా అవునని తెలిపింది. ఈ దశలో రంజిత్ కుమార్ జోక్యం చేసుకొని అయితే కేసులపై చంద్రబాబు ఎలాంటి ప్రకటన చేయరాదని కోరారు. ఈ బాధ్యత లూథ్రాదేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమకు బాధ కలిగించేది కాబట్టే ఇలా అడుగుతున్నామని రంజిత్ కుమార్ కోర్టు దృష్టికి తెచ్చారు. ''మీ క్లయింట్ కేసు గురించి ఎలాంటి ప్రకటన చేయకూడదు''అని లూథ్రానుద్దేశించి జస్టిస్ బోస్ వ్యాఖ్యానించారు. 'స్కిల్'కేసులో పరిమిత ఆదేశాలు ఉన్నాయని.. వాటిని గౌరవిస్తున్నామని లూథ్రా పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ దగ్గరలో ఎన్నికలు లేవు కదా అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఏపీ అదనపు అడ్వొకేట్ జనరల్ కేసు గురించి ప్రకటనలు చేయడమే కాకుండా హైదరాబాద్, ఢిల్లీలో విలేకరుల సమావేశం నిర్వహించారని, తన గురించి కూడా మాట్లాడారని లూథ్రా కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే రికార్డు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులో తీర్పు కోసం ఎదురుచూడడానికి వాయిదా పడిన మరో కేసులో సంయమనంతో ఉండాలని లూథ్రా అంటున్నారని రంజిత్ కుమార్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండువైపులా జెంటిల్‌మెన్ వ్యవహారం ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

గెలుపు వ్యూహం మాకు తెలుసు

- టీడీపీ – జనసేన ముందు వాటి ఇల్లు చక్కదిద్దుకోవాలి: సజ్జల
- ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలో వారికే క్లారిటీ లేదు
- మరింత మెరుగైన ఫలితాల కోసమే మార్పుచేర్పులు



సాక్షి, అమరావతి: టీడీపీ – జనసేన ముందు వాటి ఇల్లు చక్కదిద్దుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి హితవు పలికారు. ఇంతవరకూ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలో వారికే స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. టీడీపీ శిథిలావస్థకు చేరిన సౌధమని, పవన్‌ను నమ్ముకొని చంద్రబాబు ప్రయాణం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాడేపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గెలుపు అవకాశాలను మెరుగుపరుచుకుని మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకే మార్పుచేర్పులు చేపట్టామని, అది తమ పార్టీ అంతర్గత వ్యవహారమన్నారు. నియోజక వర్గాల్లో నాయకుడిని మార్చినప్పుడు క్యాడర్ కొత్త ఇబ్బంది పడటం సహజమేనని, అందరినీ పిలిచి మాట్లాడతామని చెప్పారు. అందరినీ సమన్వయ పరుచుకుంటూ, సముచిత స్థానం కల్పిస్తూ ముందుకు వెళ్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలా గెలవాలో.. అందుకు ఏ వ్యూహం అనుసరించాలో తమకు తెలుసన్నారు. కుప్పం సహా 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు.

నిరంతరం ప్రజాసేవలోనే..

బీసీల జనాభా అధికంగా ఉన్న నియోజక వర్గాల్లో బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థులను బరిలోకి దింపకుండా చంద్రబాబు, లోకేశ్ ఎందుకు పోటీ చేస్తున్నారని సజ్జల ప్రశ్నించారు. 3 వేల కి.మీ. పాదయాత్ర పూర్తి చేశాడని టీడీపీ గొప్పలు చెప్పుకుంటున్న లోకేశ్ ఎక్కడ నడిచాడో ఎవరికీ తెలియటం లేదని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ పేరు ప్రస్తావించే అర్హత కూడా లోకేశ్‌కు లేదన్నారు. ఇప్పటివరకు 99.5 శాతం హామీలను నెరవేర్చి సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. రెండేళ్ల ముందు నుంచే ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నం చేశారని చెప్పారు. ప్రజల ఆశలు నెరవేర్చే నేతగా సీఎం జగన్ ఆదరణ చూరగొన్నారని, పాజిటివ్ ఓటు తమ బలమని పేర్కొన్నారు.

175 స్థానాల్లో విజయమే లక్ష్యం

- కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితుల దృష్ట్యా మార్పులు, చేర్పులు
- పార్టీకోసం పనిచేసేవారికి సీటు: వై.వి.సుబ్బారెడ్డి



సాక్షి, అనకాపల్లి: ఏపీలో 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కొన్ని మార్పులు, చేర్పులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితుల దృష్ట్యా మార్పులు చేస్తున్నామని, అందులో భాగంగానే రాష్ట్రంలో 12 నియోజకవర్గాల్లో పలువురు ఎమ్మెల్యేలకు స్థానచలనం, నూతన ఇన్‌చార్జిలను నియమించారని తెలిపారు. ఆయన మంగళవారం అనకాపల్లి జిల్లా రోలుగుంటలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీలో చాలా మార్పులు ఉండనున్నాయన్నారు. ఇప్పటికే విశాఖ జిల్లాలో గాజువాక నియోజకవర్గంలో సమన్వయకర్తని మార్చామని చెప్పారు. రెండువారాల కిందటే స్థానిక ఎమ్మెల్యే నాగిరెడ్డికి తెలిపామన్నారు. తమకు సీటు ఇచ్చినా, ఇవ్వకపోయినా ఈ రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న లక్ష్యంతో తాము పనిచేస్తామని ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఆయన తనయుడు దేవన్‌రెడ్డి చెప్పారని తెలిపారు. అంతేగాకుండా పార్టీలో కష్టపడి పనిచేసే మంచి అభ్యర్థికి సీటు ఇవ్వమని కూడా వారు సూచించారన్నారు. వీరిద్దరూ రాజీనామా చేశారనేది దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు. విశాఖ పార్టీ కార్యాలయంలో మంగళవారం స్వయంగా దేవన్ రాజీనామా వార్తను తోసిపుచ్చారని తెలిపారు.

పాలనలో ఎమ్మెల్యేల ముద్ర !

- ఎన్నికైన శాసనసభ్యుల ఆరాటం
- అధికార యంత్రాంగంపై పట్టుకు ప్రయత్నాలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రభుత్వ పాలనలో తమ ముద్ర చూపించేందుకు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు బిజీగా మారారు. వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గాల్లో తమ మార్క్ చూపించేందుకు కసరత్తు మొదలుపెట్టారు. ఉమ్మడి జిల్లాలో ఎన్నికైన పది మంది ఎమ్మెల్యేలు గత సర్కారులో ఎమ్మెల్యేలుగా లేని వారే కావడంతో అందరూ తమ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించారు. తమ వద్దకు వస్తున్న సమస్యలు, ఇంతకుముందు తమ దృష్టిలో ఉన్న వాటిపై శ్రద్ధ చూపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న నలుగురు ఎమ్మెల్యేలతోపాటు బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం ఇదేతీరుగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్న పథకాలతోపాటు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గత ప్రభుత్వంలో ఎన్నికైన ఎమ్మెల్యేల పనితీరు, అభివృద్ధి పనులపై తెలుసుకుంటున్నారు. తమ నియోజకవర్గాల్లో ఇంకా కొనసాగుతున్న పనులపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లోని అధికార యంత్రాంగం స్థానిక ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలవడం, పరిస్థితులు వివరించడం జరుగుతున్నాయి.

అధికారుల అప్రమత్తం

తమ నియోజకవర్గాల్లో జరుగుతున్న పనులపై ఎమ్మెల్యేలు నివేదికలు కోరడం, పనులపై ఆరా తీయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తం అయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అధికారుల్లోనూ మార్పులు ఉంటాయనే ప్రచారం మొదలైంది. ఇప్పటికే గత ఎమ్మెల్యేలతో సన్నిహితం ఉన్నవారి చిట్టా సిద్ధమైంది. అంతేకాక తమ పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి అధికారులపై ఫిర్యాదులు వస్తున్న తరుణంలో అలాంటి చోట్ల మార్పులు తప్పవనే భావనలు వస్తున్నాయి. ముఖ్యంగా పోలీసు, రెవెన్యూ, పంచాయతీ శాఖలతోపాటు జిల్లా కేంద్రంలో ఉన్న నియోజకవర్గాలు, పట్టణాల్లో మున్సిపల్ అధికారులపై ఎక్కువగా జాబితా సిద్ధమవుతోంది. వీటితోపాటు నియోజక వర్గాల్లో అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు, నిధుల ఖర్చుపైనా సమీక్షల్లో అడిగే అవకాశం ఉంది. అంతేకాక మండల, మున్సిపల్, జెడ్పీ సర్వ సభ్య సమావేశాల్లో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు హాజరయ్యే అవకాశం ఉండడంతో నివేదికలు అప్రమత్తంగా రూపొందిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష పాత్ర వహించి, విధానపరమైన లోపాలు ఎత్తిచూపిన నాయకులే ఇప్పుడు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఈ క్రమంలో వాటిని తమదైన శైలిలోనే పాలనను సరిదిద్దే ప్రయత్నాలు మొదలయ్యాయి. జిల్లా కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్లు, పట్టణాభివృద్ధి, సాగునీటి, గ్రామాల్లో అభివృద్ధి విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, పాలకవర్గం తీరుపైన సమాచారం అందుతోంది. ఈ క్రమంలో ఎన్నికైన శాసనసభ్యులు వచ్చే ఐదేళ్లలో స్థానికంగా పట్టు పెంచుకుని ముందుకు సాగేందుకు ప్రయత్నిస్తున్నారు.

'రియల్'.. ఢమాల్!

- నేల చూస్తున్న స్థిరాస్తి వ్యాపారం
- రిజిస్ట్రేషన్ శాఖకు తగ్గిన ఆదాయం
- ఎన్నికల ప్రభావంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పరిస్థితి

కరీంనగర్ క్రైం: రియల్ ఎస్టేట్ పూర్తిస్థాయిలో పడిపోవడంతో కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల కోడ్‌కు ముందు నుంచే తగ్గుతూ వస్తున్నాయి. భూములు, స్థిరాస్తుల అమ్మకాలు, కొనుగోళ్లు డబ్బుతోనే ముడిపడి ఉండటం, రూ.లక్షలు చేతులు మారే వ్యవహారం కాబట్టి చాలా మంది క్రయవిక్రయాలు వాయిదా వేసుకున్నారు. గత నవంబర్‌లో రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గాయి. దీంతో సంబంధిత శాఖకు ఆదాయం పడిపోయింది. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకు కనీసం రూ.20 కోట్ల వరకు ఆదాయం రాగా, ఇప్పుడు రెండు నెలలకు కలిపి ఆ మొత్తం వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

14 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు..

ఉమ్మడి జిల్లాలో 14 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కలుపుకొని గతంలో నెలకు 12 వేల వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యేవి. సగటున రూ.24 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు ఆదాయం వచ్చేది. గత నవంబర్ నుంచి ఇప్పటివరకు 7,307 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ కాగా, రూ.21 కోట్ల ఆదాయం సమకూరింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు పూర్తవగా, మరో నెల తర్వాత సర్పంచ్ ఎన్నికలు జరిగే అవకాశలున్నాయి. దీంతో మళ్లీ ఎన్నికల కోడ్ వచ్చి, రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గే పరిస్థితులే ఉంటా యని అధికారులు అంటున్నారు. ఏదేమైనా మరికొన్ని నెలల వరకు ఎన్నికల సీజన్ ఉండటంతో రిజిస్ట్రేషన్ శాఖ పెద్ద ఎత్తున ఆదాయం కోల్పోనుంది.



సందడి లేని కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

గత నవంబర్ నుంచి జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలు (సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా..)

ఎస్ఆర్‌వో	డాక్యుమెంట్లు	ఆదాయం (రూ.కోట్లలో)
కరీంనగర్	1,161	6.25
కరీంనగర్‌రూరల్	470	1.37
గంగాధర	592	2.10
హుజూరాబాద్	517	1.57
జగిత్యాల	737	2.08
మల్యాల	280	0.55
మంథని	181	0.30
మెట్‌పల్లి	447	0.99
పెద్దపల్లి	434	1.40
సిరిసిల్ల	955	1.46
సుల్తానాబాద్	170	0.34
వేములవాడ	491	0.94
కోరుట్ల	446	1.42
రామగుండం	426	2.20

ఆలోచనలు రేకెత్తించిన సైన్స్‌ఫేర్

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి సైన్స్‌ఫేర్ మంగళవారం రెండో రోజుకు చేరింది. విద్యార్థుల శాస్త్రీయ ప్రయోగాలు, సృజనాత్మకతను వీక్షించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఔత్సాహికులు భారీగా తరలి వచ్చారు. కాళేశ్వరం జోన్ పరిధిలోని 10 జిల్లాల నుంచి 58 ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల నుంచి 232 మంది విద్యార్థులు ప్రయోగాలను ప్రదర్శించారు. బెల్లంపల్లిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సుమారు రెండు వేల మంది ప్రదర్శలను వీక్షించారు. సైన్స్‌ఫేర్‌లో భాగంగా సోమవారం రాత్రి గురుకులంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆర్సీఓ కొప్పుల స్వరూపారాణి, మంచి ర్యాల, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల డీసీఓలు బాలభాస్కర్, శ్రీనివాస్, బాలరాజు, బెల్లంపల్లి బాలుర గురుకుల సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు

ఎక్కువ ఎంపీ సీట్లు గెలవడమే లక్ష్యం

- బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి పొల్సాని మురళీధర్‌రావు

కరీంనగర్‌టౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కువ ఎంపీ సీట్లు గెలవడమే లక్ష్యంగా పని చేస్తామని బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి పొల్సాని మురళీధర్‌రావు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరై, మాట్లాడారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్తాన్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు పార్టీ తెలంగాణలో బలోపేతం కావడానికి కచ్చితంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇక్కడి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి 8 సీట్లు, 14 శాతం ఓట్లు, 19 స్థానాల్లో రెండోస్థానం ఇవ్వడం హర్షణీయమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం పార్టీ రాష్ట్ర కమిటీకి అండగా నిలిచిందని, ప్రధానమంత్రి మోదీ ప్రచారంలో పాల్గొని, నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారని పేర్కొన్నారు. కానీ, కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో వెనకబడ్డామని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సిద్ధాంత అవగాహన, జాతీయవాదంతో ముందడుగు వేయగలిగితే తెలంగాణలో మంచి ఫలితాలు సాధిస్తామని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీల్లో జరిగే వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. నాయకులు సుగుణాకర్‌రావు, మహేందర్‌రెడ్డి, ఓదెలు, మధుసూదన్‌రావు, దేవేందర్‌రావు, శంకర్, సాయికృష్ణారెడ్డి, దుర్గం మారుతి, అనంతరెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్, రాధాకృష్ణారెడ్డి తదితరులున్నారు.



మురళీధర్‌రావును సన్మానిస్తున్న నాయకులు

బంజరుదొడ్డిగా మారిన గ్రామ పంచాయతీ



గ్రామపంచాయతీలో బంధించిన పశువులు

భీమిని: మంచిర్యాల జిల్లా భీమిని మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం బంజరుదొడ్డిగా మారింది. పొలాల్లో పడుతున్న పశువులను బంజరుదొడ్డి లేక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం బంధించారు. దీంతో ప్రభుత్వం బంజరుదొడ్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కోటి సంతకాల సేకరణ ఉద్యమం

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాలలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించి కేంద్రానికి నివేదిస్తామని తెలిపారు. 1931లో బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన బీసీ జనగణన తప్ప ఇప్పటికీ ఏ ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టలేదని విమర్శించారు. జనగణనలో కులగణన చేపడితే విద్య, ఉద్యోగాలతోపాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని కేంద్ర పాలకులు వెనుకాడుతున్నారని అన్నారు. బీసీ కులాలకు ఇవ్వాల్సిన ప్రజాస్వామ్య వాటా ఇవ్వకుండా ఎన్నాళ్లు దాటవేస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజెల్లి వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు బొడెంకి మహేష్, నాయకులు జైపాల్‌సింగ్, అంకం సతీష్, ఆరేందుల రాజేశం, కిరణ్‌కుమార్, శేఖర్, అంజన్నకుమార్, భిక్షపతి, లక్ష్మణ్, రాజేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో నాయకులు

విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవాలి

- గురుకులాల రీజినల్ కో–ఆర్డినేటర్ వెంకన్న
- దుమాల గిరిజన పాఠశాలలో రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్
- 181 మంది హాజరు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞానం పెంపొందించుకోవాలని గురుకులాల రీజినల్ కో–ఆర్డినేటర్ వెంకన్న అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గిరిజన గురుకుల పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని 23 గురుకులాల నుంచి 181 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరోగ్యం, లైఫ్‌స్టైల్, వ్యవసాయం, కమ్యూనికేషన్స్, రవాణా రంగాలపై రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచినవారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. ప్రాజెక్టుల తయారీతో విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయవచ్చని తెలిపారు. అందరూ ఇలాంటి పోటీలపై దృష్టిసారించాలని సూచించారు. భవిష్యత్‌లో పోటీ పరీక్షలకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న రీజినల్ కో–ఆర్డినేటర్ వెంకన్న, ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

సాక్షి ఫ్యామిలీ

కరీంనగర్

బుధవారం ॥ 13-12-2023

నవ దిశ

బదల్తా కశ్మీర్

ఆర్టికల్ 370 ఎత్తివేతను సుప్రింకోర్ట్ సమర్థించింది. జమ్ము-కశ్మీర్‌లకు రాష్ట్రహోదా ఇచ్చి ఎన్నికలు నిర్వహించమంది. మరోవైపు అక్కడ యువగళాలు మారుతున్న కశ్మీర్‌ను గానం చేస్తున్నాయి. 14 ఏళ్ల ర్యాపర్ హుమైరా జా విడుదల చేసిన పాట 'బదల్తా కశ్మీర్' మార్పును ఆహ్వానిస్తూ కొత్త ఆశను రేపుతోంది. హుమైరా జా పాటను భారత ప్రభుత్వం ఇన్‌స్టాలో షేర్ చేసింది. 'నేను ఇలాగే ముందుకెళ్తాను' అంటున్న హుమైరా పరిచయం.


హుమైరా జా

'బద్‌లా జొ కశ్మీర్... బద్‌లా హై సారా దౌర్' అని పాడుతోంది హుమైరా జా.

'కశ్మీర్ మారుతోంది... కశ్మీర్ ధోరణి మారుతోంది... అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది' అంటూ ఆమె పాడిన పాట ఇప్పుడు కశ్మీర్‌వాసులనే కాదు, దేశాభిమానులను కూడా ఆకర్షిస్తోంది. హుమైరా ఈ పాటను ఎం.సి.రా అనే మరో ర్యాపర్ కలిసి పాడింది. కశ్మీర్‌లో తాజా అభివృద్ధి పరిణామాలను పాటలో మిళితం చేస్తూ వీరు విడుదల చేసిన 'బదల్తా కశ్మీర్' పాట కశ్మీర్ భవిష్యత్తు మీద ఆశను కలిగిస్తోంది.

'మా నానమ్మ, తాతయ్యల కాలంలో కశ్మీర్ ఎలా ఉండేది... (ఆర్టికల్ 370 ఎత్తేశాక) ఇప్పుడు ఎలా ఉందనేది నేను వారి మాటల్లో విన్నాను. నా కళ్లారా చూశాను. ఇక్కడ జరిగిన జి 20 సమ్మిట్, శ్రీనగర్‌ను స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దడం, కొత్త టన్నెల్స్ ఏర్పాటు... ఇంతకు ముందు చూడ లేదు. మా ఊరు కంగన్ నుంచి శ్రీనగర్‌కు వెళ్లాలంటే గతంలో గంటన్నర పట్టేది. ఇప్పుడు గండర్‌బల్ దగ్గర బ్రిడ్జి కట్టాక ముప్పై నిమిషాల్లో వెళ్లిపోతున్నాము. ఇదంతా మారుతున్న కశ్మీరే' అంటుంది హుమైరా జా.


హుమైరా జా

తొమ్మిదో తరగతి చదువుతున్న హుమైరా అలవోకగా ర్యాప్ సాంగ్స్ రాసి పాడుతుంది. హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ పదాలను టక్కున పట్టేట్టుగా వాడుతూ పాటలు రాసి పాడటం వల్ల గతంలోనే గుర్తింపు పొందినా 'బదల్తా కశ్మీర్' పాటతో ప్రపంచానికి తెలిసింది.

'నేను రెండో క్లాస్‌లో ఉండగా యోయో హనీసింగ్ రాప్ ఆల్బమ్ విన్నాను. అది నాకు చాలా నచ్చింది. ఆ వయసులోనే అలా ర్యాప్ పాటలు ట్రై చేసేదాన్ని. అప్పుడే బజరంగి భాయ్‌జాన్ (2015) సినిమా షూటింగ్ మా ఏరియాలో జరిగితే అందులోని బాల నటి హర్షాలికి నేను బాడీ డబుల్ (డూప్)గా నటించాను. అలా నేను కూడా సినిమాల్లో నటించాలనుకున్నానుగానీ మా కశ్మీర్‌లో సినిమా పరిశ్రమ లేదు. అందుకని ర్యాపర్‌గా రాణించాలని నిశ్చయించుకున్నాను' అంటుంది హుమైరా.

కశ్మీర్‌లో ప్రతి ఏటా జరిగే 'ర్యాప్ బ్యాటిల్' పోటీల్లో పాల్గొని 2022, 2023 సంవత్సరాల్లో టైటిల్ గెలిచింది హుమైరా. '2022లో 15 మంది అబ్బాయిలు నాకు పోటీగా వచ్చారు. నేను ఒక్కదాన్నే ఆడపిల్లను. నేనే గెలిచాను' అంటుంది హుమైరా. 'కశ్మీర్‌లో అమ్మాయిలు స్పోర్ట్స్‌లో, కళల్లో, చదువులో, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. ఆ విషయాన్ని నా పాటలో చెప్పాను' అందామె.

ఈ పాటలోనే మేల్ వాయిస్ ఇచ్చిన ఎం.సి.రా 'ఇక్కడ ఇప్పుడు జీన్స్ ప్యాంట్ అమ్మాయిలు తొడుక్కుంటున్నారు. బట్టల్ని బట్టి వారిని జడ్జ్ చేసే రోజులు పోయాయి' అనే లైన్‌లు పాడాడు. హుమైరా, ఎం.సి.రా కలిసి 'మై కశ్మీరి... మేరా దేశ్ హై హిందూస్తాన్' అని పాటను ముగిస్తారు.

ఈ పాటలో హుమైరా 'టెర్రరిస్టులకు ఇక్కడ చోటు లేదు. అనవసరంగా ఎవరి రక్తం పారడానికి వీల్లేదు' అనే లైన్లు పాడింది. 'నువ్వు చూపుతున్న అభివృద్ధి ఉత్తుత్తదే. అసలు వాస్తవం వేరే ఉంది అని కొందరంటున్నారుగా' అని విలేకరులు ప్రశ్నిస్తే 'అది వారి దృష్టికోణం. ఇది నా దృష్టికోణం' అంటుంది హుమైరా.

'కొంతమంది నన్ను ట్రోల్ చేస్తున్నారు. నేను పట్టించుకోను. నేను ఇలాగే ముందుకెళతాను. నా వెనుక ఒక్కరు నిలబడినా చాలు' అందామె.

కశ్మీర్ వెనుక హుమైరా వెనుక ఇప్పుడు చాలామంది ఉన్నారు. కశ్మీర్ అభివృద్ధికి అందరూ ప్రయత్నిస్తే 'నయా కశ్మీర్' దగ్గరిలోనే సాధ్యమవుతుంది.

ఊరు రమ్మంది..!

ఒక ఎంబీయే సర్పంచ్.. ఒక మోడల్ గ్రామం

ఛావీ రాజావత్ రాజస్థాన్‌లోని సోడా గ్రామంలో పుట్టి పెరిగింది. పట్నంలో ఉన్నత చదువులు చదివి, కళ్లు చెదిరే ప్యాకేజీతో కార్పొరేట్ ఉద్యోగంలో చేరింది. కానీ, చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి గ్రామానికి వెళ్లింది. సర్పంచ్‌గా ఎన్నికల్లో నిలబడి గెలిచింది. పదేళ్లపాటు సర్పంచ్‌గా పనిచేసింది. మొదటి ఎంబీయే మహిళా సర్పంచ్‌గా వార్తల్లో నిలిచి, యుఎన్‌లో ప్రసంగం చేసింది. గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దింది. ఇప్పుడు గ్రామాభివృద్ధికి కృషి చేస్తూనే, హోటల్ వ్యాపారం చేస్తోంది. ఆసక్తి గలవారికి గుర్రపు స్వారీలో శిక్షణ ఇస్తోంది.

"2010లో తొలిసారి సర్పంచ్ అయినప్పుడు గ్రామ పరిస్థితి ఏ మాత్రం బాగా లేదు. గ్రామం తీవ్ర కరువుతో అల్లాడిపోయింది. సాగునీరు లేదు. 13–14 సంవత్సరాలుగా రుతుపవనాలు లేవు. భూగర్భ జలాలను వాడుకోలేకపోయేవారు. 3–4 గంటలకు మించి విద్యుత్ సరఫరా లేదు. రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. ఈ సవాళ్లతో సోడా పంచాయితీ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాను. మొదటి టర్మ్‌లో కొన్ని పనులు పూర్తయ్యాయి.

మా ఊరు తనవైపు లాగింది..

మా తాత బ్రిగేడియర్ రఘుబీర్‌సింగ్ 1990 వరకు సర్పంచ్‌గా చేశారు. నాకు మా ఊరు అంటే ఎప్పుడూ ఇష్టమే. బెంగుళూరులోని రిషి వ్యాలీ స్కూల్, జైపూర్‌లోని మాయో కాలేజ్ గర్ల్స్ స్కూల్‌లో చదువుకున్నాను. వేసవి సెలవులు వచ్చినప్పుడల్లా మా ఊరిలోనే ఉండేదాన్ని. ఢిల్లీలోని మహిళా శ్రీరామ్ కాలేజీ నుండి డిగ్రీ తీసుకున్నాక, పూణెలోని బాలాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మోడ్రన్ మేనేజ్‌మెంట్ నుండి ఎంబీయే పూర్తి చేశాను. ఏడేళ్లపాటు కార్పొరేట్ సెక్టార్‌లో వర్క్ చేశాను. లక్షల రూపాయల జీతం. కానీ, మా ఊరు వైపు నన్ను తన వైపు లాగింది.

■ మహిళకు రిజర్వ్ అని..

2010లో మా గ్రామ పంచాయితీ మహిళలకు రిజర్వ్ చేయబడింది. అప్పుడు మా ఊరి పెద్దలు నన్ను ఎన్నికల్లో నిలబడమని అడిగారు. ఆ సమయంలో సర్పంచ్‌ని అవ్వాలనే ఆలోచన కూడా చేయలేదు. గ్రామస్తులు మా అమ్మ నాన్నలను అడిగారు. 'ఏం చేయాలనుకున్నా తన ఇష్టం, మా బలవంతం ఉండదు' అని చెప్పారు. నాకు అప్పటి వరకు గ్రామ సభలు ఎలా జరుగుతాయి, పంచాయితీలకు నిధులు ఎలా వస్తాయో తెలియదు. ఆ విషయాలను గ్రామస్తులే చెప్పారు. ఆ విధంగా పంచాయితీ ఎన్నికల్లో నిలబడి, గెలిచాను. మా ఇంట్లో మా తాత తర్వాత నేను సర్పంచ్‌ని అయ్యాను.

■ వర్షపు నీటి సంరక్షణ

ముందుగా ఊరి భవితవ్యాన్ని ఒంటరిగా మార్చలేమని, ప్రజలంతా కలిసికట్టుగా కృషి చేస్తేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని అందరికీ స్పష్టంగా చెప్పాను. నేను వ్యూహంతో పనిచేయడం ప్రారంభించాను. ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, గ్రామాలను అనుసంధానించడం, కరువును ఎదుర్కోవడం నేను ఎదుర్కొన్న అతిపెద్ద సవాళ్లు. గ్రామంలోని నీటివనరులన్నీ పూడికతో నిండిపోయాయి. సుమారు 100 ఎకరాల్లో విస్తరించి ఉన్న నీటి వనరుల్లో పూడిక మట్టిని తొలగించేందుకు లక్షల రూపాయలు సేకరించి, ఖర్చు చేశాం.

■ మహిళలు ముందు

గ్రామపంచాయితీ నా కుటుంబం లాంటిది. నేను మీటింగులు పెట్టడం మొదలు పెట్టగానే ఏయే ప్రాజెక్టుల్లో ఎలా పనిచేస్తున్నానో చెప్పేదాన్ని. ఈ ప్రాజెక్టుల గురించి వారు ఏమనుకుంటున్నారో అందరి అభిప్రాయాలు తెలుసుకునేదాన్ని. అలాగే, ఎంత డబ్బు ఖర్చు అవుతుందో కూడా వివరించేదాన్ని. పనులు సజావుగా అయ్యేలా అధికారులను కలిసి ఆరా తీయమని గ్రామస్తులకు చెప్పేదాన్ని. మహిళల బృందం డిజైనర్ ల్యాంప్‌లు, కొవ్వొత్తులు, మసాలా దినుసులు వంటి ఉత్పత్తులు తయారు చేయడం మొదలుపెట్టారు. ఇవి మంచి ధరకు అమ్ముడు పోవడం మొదలయ్యింది. దీంతో మహిళల జీవితం మెరుగుపడింది. రెండేళ్లలో 950 ఇళ్లకు గాను 800 మరుగుదొడ్లు నిర్మించాం. 24 గంటలూ కరెంట్ అందుబాటులోకి వచ్చింది.


ఛావీ రాజావత్





■ రోడ్ల ప్రాధాన్యత

నా ఎజెండాలో రోడ్ల ప్రాధాన్యత స్పష్టంగా ఉంచాను. ముందు ప్రైవేట్ బస్సుల సహాయం తీసుకున్నాను. బాలికల కోసం పాఠశాల, మహిళల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశాను. మూతపడిన బి.ఎడ్ కాలేజీని స్వాధీనం చేసుకొని దానిని బాలికల చదువుకోసం కేటాయించాను. ఓ ప్రైవేట్ కంపెనీ 200 టేబుళ్లు, బెంచీలను అందజేసి మా వెన్ను తట్టింది.

■ అందరికీ బ్యాంకు ఖాతా..

సర్పంచ్ అయిన ఐదేళ్లలోనే రోడ్లు, డ్రైన్లు, అందరికీ బ్యాంకు ఖాతా తెరిపించాను. ఎప్పుడూ ఫీల్డ్ వర్క్‌లోనే ఉండేదాన్ని. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల, చదువు ప్రాముఖ్యతను వివరించేదాన్ని.. నా స్వభావం అందరినీ కలుపుకొని ఉంటుంది. ఐక్యరాజ్య సమితి 11వ ఇన్ఫో పావర్టీ వరల్డ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించినప్పుడు మొదటి సారి భారతదేశం నుండి ఒక మహిళా సర్పంచ్‌గా దేశం తరఫున ప్రాతినిధ్యం వహించాను. ఇది నాకు గర్వంగా అనిపించింది. అక్కడ వారందరి మదిలో సర్పంచ్ అంటే తలపై ముసుగు వేసుకుని ఉన్న గ్రామస్థురాలు అనుకున్నారు. కానీ, నన్ను కార్పొరేట్ లుక్‌లో చూసి అందరూ ఆశ్చర్యపోయారు. సోడా విలేజ్ అభివృద్ధికి డబ్బు కంటే వ్యక్తులు, అందరి సమష్టి కృషి అవసరం అని ఫోరమ్‌లో చెప్పాను.

రెండుసార్లు సర్పంచ్‌గా నా విధులను నిర్వర్తించాను. తర్వాతి వారికి అవకాశాలు ఇవ్వాలని నేను మళ్లీ పోటీ చేయలేదు. ఇప్పుడు హోటల్‌ని నిర్వహిస్తున్నాను. గుర్రపు స్వారీ వచ్చు కాబట్టి, ఆసక్తి గలవారికి శిక్షణ ఇస్తున్నాను' అని వివరిస్తుంది ఈ యంగ్ లీడర్.

బాత్ చూపిన బాట

"ఎదుటి వారు చెప్పేది శ్రద్ధగా వింటే మనకు తెలియని ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీబాత్ కార్యక్రమంలో అనేక విషయాలను ప్రస్తావిస్తుంటారు. వాటిలో ఒకటి నన్ను ఏకంగా ఎంట్రప్రెన్యూర్‌గా మార్చింది. ఈరోజు నేను ఆర్గానిక్ ఎంట్రప్రెన్యూర్‌గా ఎదిగాను. అదే మన్‌కీ బాత్ కార్యక్రమంలో నన్ను ప్రశంసించడం ఎంతో సంతోషంగా ఉంది" అని చెబుతూ తెగ మురిసిపోతోంది వర్ష.


వర్ష

కర్ణాటకలోని చామరాజ్‌నగర్ జిల్లా ఆలహళ్లీ గ్రామానికి చెందిన వర్ష ఎమ్‌టెక్ చదివింది. చదువు పూర్తి కాగానే అందరిలా ఉద్యోగం కోసం చూడకుండా సరికొత్తగా ఏదైనా చేయాలనుకుంది. ఈ క్రమంలోనే ఏం చేయాలా అని ఆలోచిస్తున్న వర్ష.. ఓ రోజు అనుకోకుండా మన్‌కీబాత్ వినింది. ఆ కార్యక్రమంలో అరటి ఆకులను ఉపయోగపడే వనరులుగా ఎలా మారుస్తున్నారో మోదీ ప్రస్తావించారు. ప్రకృతిని ఇష్టపడే వర్షకు ఇది బాగా నచ్చడంతో.. అరటి బోదె, ఆకులతో హ్యాండిక్రాఫ్ట్స్ తయారు చేయాలని నిర్ణయించుకుంది.



వీడియో చూసి...

అరటి కాండాలను ఉపయోగపడే వస్తువులుగా ఎలా మార్చాలో వర్షకు తొలుత అర్థం కాలేదు. తరువాత యూట్యూబ్‌లో వెతికి ఒక వీడియో ద్వారా కొంత సమాచారం తెలుసుకుంది. కోయంబత్తూరు, తమిళనాడులోని మరికొన్ని ప్రాంతాల్లో అరటి వ్యర్థాలను అందమైన వస్తువులుగా ఎలా మారుస్తున్నారో వివరంగా తెలుసుకుంది. ఆ తరవాత వ్యాపారానికి కావాల్సిన యంత్రాలను కొనుగోలు చేసి ఉమ్మతూరు సమీపంలో 'ఆకృతి ఇకోఫ్రెండ్లీ' పేరిట ఎంటర్‌ప్రైజ్‌ను ఏర్పాటు చేసింది.

అరటికాండాలు, ఆకులను సేకరించి యంత్రాలతో ప్రాసెస్ చేసి నారతీసి, ఫ్లోర్‌మ్యాట్స్, బ్యాగ్స్, పర్సులు, హ్యాండీ క్రాఫ్ట్స్, అరటి గుజ్జు నుంచి తీసిన రసంతో సహజసిద్ధమైన ఎరువులు తయారు చేసి విక్రయిస్తోంది. కష్టమర్ల నుంచి మంచి ఆదరణ లభించడంతో ఆర్గానిక్ షాపులు, గూగుల్, ఫ్లిప్‌కార్ట్, అమేజాన్ వంటి ఆన్‌లైన్ షాపుల్లో సైతం ఆకృతి వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయి. ఇలా అరటి వ్యర్థాలను అందమైన వస్తువులుగా మారుస్తూ కొంతమందికి ఉపాధి కల్పించడంతోపాటు.. రైతులకు ఆదాయం వచ్చేలా చేస్తోంది వర్ష.

వర్ష తన భర్త శ్రీకాంత్ సాయంతో చేస్తున్న ఈ ఇకో-ఫ్రెండ్లీ బిజినెస్ గురించి తెలియడంతో కొన్ని కంపెనీల నుంచి భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. "భవిష్యత్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరించి ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తాను" అని వర్ష చెబుతోంది. గ్రామాల్లోని మహిళలు సైతం వ్యాపారవేత్తలుగా మారేందుకు, ఉద్యోగం దొరకనివారు ఉపాధిని ఇలా సృష్టించుకోవచ్చని చెప్పడానికి ఉదాహరణగా నిలుస్తోంది వర్ష. నవంబర్ నెల మన్‌కీ బాత్ కార్యక్రమంలో వర్ష ఎంట్రప్రెన్యూర్ జర్నీ గురించి మోదీ ప్రస్తావించడం విశేషం.

Generation Z

భవిష్యత్ చిత్ర'వర్ణ'మాల

యూత్ పల్స్

కొత్త సంవత్సరం దగ్గరలో ఉంది. కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ 'హ్యాపీ న్యూ ఇయర్' పాట పాడగానే సరిపోతుందా? 'పాటతోపాటు ప్రణాళిక కూడా ఉంది' అంటుంది మన జెన్ జెడ్. కొత్త సంవత్సరంలో జెన్ జెడ్ లక్ష్యాలు, ప్రణాళికలు, అభిరుచులకు సంబంధించి 'ట్రెండ్ టాక్ రిపోర్ట్-2024' అద్దం పడుతోంది.

ఇండియా, యూఎస్, యూకే, బ్రెజిల్, సౌత్ కొరియా దేశాలలోని జెన్ జెడ్ ట్రెండ్స్‌కు సంబంధించి 'ట్రెండ్ టాక్ రిపోర్ట్'ను విడుదల చేసింది ఇన్‌స్టాగ్రామ్. వర్త్ గ్లోబల్ స్టైల్ నెట్‌వర్క్ (డబ్ల్యూజీఎస్ఎన్)తో కలిసి నిర్వహించిన ఈ సర్వేలో 2024 సంవత్సరానికి సంబంధించి ఫ్యాషన్, బ్యూటీ, సోషల్ మీడియా, ఫ్రెండ్‌షిప్‌కు సంబంధించిన ప్రశ్నలు జెన్ జెడ్‌ను అడిగారు.

ఈ రిపోర్ట్ ప్రకారం ఫ్యాషన్ ట్రెండ్స్, బ్యూటీ అండ్ ఫుడ్ విభాగాలలో మన దేశం ట్రెండ్ సెట్టర్‌గా ఉంది. ఫుడ్ విషయానికి వస్తే కొత్త రుచులను ఆస్వాదించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇతరుల కంటే భిన్నంగా కనిపించే వస్త్రధారణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొత్త హెయిర్‌స్టైల్‌ను ఎంపిక చేసుకుంటున్నారు.

2024కు సంబంధించి 'జెన్ జెడ్' ప్రాధాన్యతలలో హెల్త్, ట్రావెల్, కెరీర్‌లు మొదటి స్థానంలో ఉన్నాయి.

తమ కెరీర్‌పై ప్రధానంగా దృష్టి పెట్టబోతున్నట్లు 43 శాతం మంది తెలియజేశారు. ఇతర దేశాలతో పోల్చితే మన 'జెన్ జెడ్' వ్యాపారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. సంపద సృష్టికి వ్యాపారమే మార్గం అని చెబుతోంది.

మన దేశంలో 'జెన్ జెడ్'లో ఎక్కుమంది స్పోర్ట్స్‌కు సంబంధించి సూపర్ ఫ్యాన్స్ ఉన్నారు.

లైఫ్ అడ్వైజ్, తమ ప్రొఫెషన్‌కు సంబంధించి కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చేవారి సంఖ్య ఎక్కువగానే ఉంది.

జీఆర్‌డబ్ల్యూఎం(గెట్ రెడీ విత్ మీ)లాంటి క్రియేటివిటీతో కూడిన ఫ్యాషన్ ట్రెండ్స్‌పై అమిత ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. మన దేశంలో జెన్ జెడ్‌లో 44 శాతం మంది సొంత ఆలోచనలకు ప్రాధాన్యత ఇచ్చే డీఐవై(డూ-ఇట్-యువర్ సెల్ఫ్) విధానాన్ని ఇష్టపడుతున్నారు.

సంగీతం విషయానికి వస్తే ఏఆర్ రెహమాన్, శ్రేయా ఘోషల్, అనిరుథ్ నుంచి సౌత్ కొరియన్ మ్యూజిక్ బ్యాండ్ 'బీటీఎస్ ఆర్మీ' వరకు ఇష్టపడుతున్నారు. వారికి నచ్చిన వీడియో గేమ్స్‌లో ఫోర్ట్‌నైట్, కాల్ ఆఫ్ డ్యూటీ, రాబ్లక్స్... మొదలైనవి ఉన్నాయి.

గుడ్ ప్లానింగ్

2024లో యువతరం ఆసక్తి చూపుతున్న రంగాలలో ట్రావెల్ ఒకటి. ట్రావెల్ ప్రేమికులకు టాన్యాలాంటి ట్రావెల్ వ్లోగర్‌ల సలహాలు ఉపయోగపడుతున్నాయి. అడ్వర్‌టైజింగ్ రంగంలో ఉద్యోగం చేసిన టాన్యా సోలోగా ట్రావెలింగ్ మొదలుపెట్టి తాను వెళ్లిన ప్రదేశాలకు సంబంధించి వ్లోగింగ్ మొదలుపెట్టింది. యూట్యూబ్, ఎయిర్‌టెల్‌లాంటి పెద్ద కంపెనీలతో కలిసి పనిచేసింది. ట్రావెలింగ్‌పై ఆసక్తి ఉన్నవారికి గుడ్ ప్లానింగ్ అనేది ముఖ్యం అంటుంది టాన్యా. 'గుడ్ ప్లానింగ్'కు సంబంధించి టిప్స్ చెబుతుంటుంది.



జెన్ జెడ్‌లోని పదిమందిలో తొమ్మిదిమంది వారు ఇష్టపడే రంగాలకు సంబంధించి సెలబ్రిటీల అభిమానగణంలో ఉన్నారు. తమ అభిమాన సెలబ్రిటీలు, అథ్లెట్లు, క్రియేటర్ నుంచి జెన్ జెడ్ రాబోయే కాలంలో ఆశిస్తున్నది ఏమిటి? అనే ప్రశ్నకు వినిపించే జవాబు... లైఫ్ అడ్వైజెస్, వారి ప్రొఫెషన్‌కు సంబంధించిన కంటెంట్... ఇక మీమ్స్ విషయానికి వస్తే మూడింట ఒక వంతు మంది 'బ్యాడ్ టేస్ట్ మీమ్స్'ను తమ 'టాప్ టర్న్ ఆఫ్'గా ఎంచుకున్నారు.



ప్రణాళిక ఉండాలి

ఢిల్లీకి చెందిన మౌనికా మాలిక్ బిజినెస్ అండ్ ఫైనాన్స్‌కు సంబంధించి కంటెంట్ క్రియేటర్‌గా చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది. పర్సనల్ ఫైనాన్స్ నుంచి స్టాక్‌మార్కెట్ వరకు ఎన్నో విషయాలను సులభంగా అర్థమయ్యేలా చెబుతోంది. 'ఒక రంగంపై ఇష్టం ఉన్నంత మాత్రాన విజయం చేరువ కాదు. భవిష్యత్ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలి. పరిశ్రమకైనా, వ్యక్తికైనా ఇది ముఖ్యం' అంటుంది మాలిక్.

గతం సంగతి ఎలా ఉన్నా భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి నిర్ణయాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో యువతరం ముందు ఉంటుంది. అభిరుచుల నుంచి కెరీర్ ఆప్షన్స్ వరకు కొత్తగా ఆలోచిస్తోంది.

'కాలేజీ చదువు పూర్తయిన తరువాత వైట్-కాలర్ జాబ్ తెచ్చుకోవాలి' అనేది సంప్రదాయ ఆలోచన. అయితే యువతరంలో అందరూ ఇలాగే ఆలోచించడం లేదు. 'కంఫర్టబుల్ లైఫ్‌స్టైల్'కు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీనికి కారణం జెనరేటివ్ ఏఐ. జెనరేటివ్ ఏఐ ప్రభావంతో వైట్-కాలర్ జాబ్స్‌కు ఉద్యోగభద్రత తక్కువ అనే అభిప్రాయం ఉంది. పియర్సన్ రిపోర్ట్ ప్రకారం జెనరేటివ్ ఏఐ వల్ల వైట్-కాలర్ ఉద్యోగాలలో 30 శాతం రిప్లేస్‌మెంట్ జరుగుతుంది. వైట్-కాలర్ జాబ్‌లతో పోల్చితే బ్లూ-కాలర్ జాబ్‌లకు అధిక ఉద్యోగ భద్రత ఉంది. రోబోట్స్ చేయలేని పనులు వీటిలో ఉండడమే కారణం. ఈ పనులు చేయడానికి ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం అవసరం. అయితే జెన్ జెడ్‌లో ఎక్కువమంది ఈ హై-డిమాండ్ ఫీల్డ్‌పై ఆసక్తి ప్రదర్శించడం లేదు.

వైట్-కాలర్ జాబ్, బ్లూ-కాలర్ జాబ్ అనేదానితో సంబంధం లేకుండా ప్రతి ఉద్యోగికి విశ్లేషణాత్మక ఆలోచన విధానం, సమస్య పరిష్కార నైపుణ్యం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, స్ట్రెస్ మెనేజ్‌మెంట్ స్కిల్స్... మొదలైన వాటికి సంబంధించి ప్రొఫెషనల్ స్కిల్స్ అవసరం. వీటిపై జెన్ జెడ్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

నిర్ణయాలు తీసుకోవడంలో 'లైఫ్‌స్టైల్' అనేది కీలకపాత్ర పోషిస్తోంది. డబ్బు నుంచి ఫ్రీ టైమ్ అండ్ ఫ్లెక్సిబిలిటీ వరకు ఎన్నో విషయాలను దృష్టిలో పెట్టుకుంటుంది జెన్ జెడ్.



ఆసియా చాంపియన్‌షిప్ పోటీలకు మీరాబాయి దూరం

భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను గాయం నుంచి ఇంకా కోలుకోలేదు. దాంతో ఫిబ్రవరిలో తాష్కెంట్‌లో జరిగే ఆసియా చాంపియన్‌షిప్ పోటీలకు ఆమె దూరం కానుంది. అక్టోబర్‌లో జరిగిన హాంగ్జౌ ఆసియా క్రీడల సందర్భంగా ఆమె తుంటికి గాయమైంది. దీంతో అప్పటి నుంచి ఆమె మరే టోర్నీ బరిలోనూ దిగలేకపోయింది. ప్రపంచ మాజీ చాంపియన్, టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత అయిన మీరాబాయి మార్చిలో థాయ్‌లాండ్‌లో పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీల్లో భాగమైన ప్రపంచకప్ టోర్నీతో పునరాగమనం చేసే అవకాశముంది.

అప్పుడు సెరెనా... ఇప్పుడు స్వియాటెక్!



పోలాండ్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియాటెక్ వరుసగా రెండో ఏడాది 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును గెలుచుకుంది. మహిళల టెన్నిస్ సంఘంలో ఈ ఘనత సాధించిన రెండో ప్లేయర్‌గా ఆమె నిలిచింది. 22 ఏళ్ల స్వియాటెక్ 2023లో ఆరు టైటిళ్లను సాధించింది. గతంలో వరుసగా రెండేళ్లు, అంతకుమించి 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచిన రికార్డు అమెరికన్ దిగ్గజం సెరెనా విలియమ్స్ పేరిట ఉంది. సెరెనా 2012 నుంచి నాలుగేళ్ల పాటు ఆ అవార్డు సాధించింది.

భారత్ అదరహో

- జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీలో సెమీస్‌లోకి ప్రవేశం
- క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్‌పై గెలుపు
- రేపు జర్మనీతో సెమీఫైనల్ పోరు

కౌలాలంపూర్: ఆద్యంతం అద్భుతమైన పోరాట పటిమ కనబరిచిన భారత జట్టు జూనియర్ పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఉత్తమ్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 4–3 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ జట్టును ఓడించింది. భారత్ తరఫున ఆదిత్య అర్జున్ లలాగే (34వ ని.లో), అరిజీత్ సింగ్ హుండల్ (35వ ని.లో), సౌరభ్ ఆనంద్ కుష్వా (52వ ని.లో), ఉత్తమ్ సింగ్ (57వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. నెదర్లాండ్స్ జట్టుకు టిమో బోర్స్ (5వ ని.లో), వాన్ డెర్ హెజ్డెన్ (16వ ని.లో), ఒలివియర్ హోర్‌టెన్‌సియస్ (44వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. మిగతా క్వార్టర్ ఫైనల్స్‌లో జర్మనీ 2–1తో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాపై, ఫ్రాన్స్ 3–2తో ఆస్ట్రేలియాపై, స్పెయిన్ 4–2తో పాకిస్తాన్‌పై విజయం సాధించాయి. గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ జర్మనీతో భారత్; స్పెయిన్‌తో ఫ్రాన్స్ తలపడతాయి.



జూనియర్ స్థాయిలో చివరిసారి 2005లో నెదర్లాండ్స్‌పై గెలిచిన భారత జట్టుకు ఈసారీ గట్టి పోటీ ఎదురైంది. అయితే మ్యాచ్‌లో మూడుసార్లు వెనుకబడ్డ భారత్ ఏమాత్రం ఆందోళన చెందకుండా పోరాడింది. రెండు క్వార్టర్లు ముగిసేసరికి 0–2తో వెనుకబడిన భారత్ ఆ తర్వాత నిమిషం వ్యవధిలో రెండు గోల్స్ చేసి స్కోరును సమం చేసింది. మూడో క్వార్టర్‌లో నెదర్లాండ్స్ మూడో గోల్ చేసి మరోసారి ఆధిక్యంలోకి వచ్చింది. మ్యాచ్ ముగిసేందుకు ఎనిమిది నిమిషాలు ఉన్నాయనగా భారత్ మళ్లీ స్కోరును సమం చేసింది. అదే జోరులో మ్యాచ్ ముగియడానికి మూడు నిమిషాలముందు నాలుగో గోల్‌తో తొలిసారి ఆధిక్యంలోకి వచ్చింది. చివర్లో నెదర్లాండ్స్ జట్టు స్కోరును సమం చేసేందుకు విశ్వప్రయత్నాలు చేసింది. నెదర్లాండ్స్ ఏకంగా ఆరు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించినా... భారత జట్టు గోల్‌కీపర్ మోహిత్‌తోపాటు రక్షణపంక్తి ఆటగాళ్లు అప్రమత్తంగా ఉండి నెదర్లాండ్స్‌కు గోల్ చేసే అవకాశం ఇవ్వలేదు. చివరి పది సెకన్లలోనూ నెదర్లాండ్స్‌కు పెనాల్టీ కార్నర్ లభించినా భారత ఆటగాళ్లు దానిని నిర్వీర్యం చేసి చిరస్మరణీయ విజయం అందుకున్నారు. మ్యాచ్ మొత్తంలో నెదర్లాండ్స్‌కు 12 పెనాల్టీ కార్నర్‌లు రాగా వాటిలో మూడింటిని గోల్స్‌గా మలిచింది. భారత జట్టుకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు లభించగా... ఒక దానిని భారత్ లక్ష్యానికి చేర్చింది.

6 జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత్ సెమీఫైనల్ చేరడం ఇది ఆరోసారి. గతంలో భారత జట్టు 2001, 2016లలో విజేతగా, 1997లో రన్నరప్‌గా నిలిచింది. 2005, 2021లలో సెమీఫైనల్‌తోపాటు మూడో స్థానం కోసం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో భారత జట్టు ఓడిపోయింది.

దక్షిణాఫ్రికాదే రెండో టి20

- 5 వికెట్లతో ఓడిన భారత్
- రింకూ, సూర్య మెరుపులు వృథా

పోర్ట్ ఎలిజబెత్: భారత్‌తో టి20 సిరీస్‌లో దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ ఓడిన టీమిండియా బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై ముందుగా 19.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. రింకూ సింగ్ (39 బంతుల్లో 68 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (36 బంతుల్లో 56; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగారు. సఫారీ బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీకి 3 వికెట్లు దక్కాయి. భారత్ ఇన్నింగ్స్‌లో మరో 3 బంతులు మిగిలి ఉండగానే వర్షం రావడంతో ఆట ఆగిపోగా... వాన తగ్గిన తర్వాత భారత ఇన్నింగ్స్‌ను కొనసాగించకుండా అక్కడితో ముగించారు. అనంతరం దక్షిణాఫ్రికా విజయలక్ష్యాన్ని (డక్‌వర్త్ లూయిస్ ప్రకారం) 15 ఓవర్లలో 152 పరుగులుగా నిర్దేశించారు. చివరకు సఫారీ టీమ్ 13.5 ఓవర్లలో 5 వికెట్లకు 154 పరుగులు సాధించి గెలిచింది. రీజా హెన్‌డ్రిక్స్ (27 బంతుల్లో 49; 8 ఫోర్లు, 1 సిక్స్), మార్క్‌రమ్ (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. తొలి టి20 వర్షంతో రద్దు కాగా, తాజా ఫలితంతో సఫారీ 1–0తో పైచేయి సాధించింది. చివరిదైన మూడో టి20 రేపు జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతుంది.

కీలక భాగస్వామ్యాలు...

ఫామ్‌లో ఉన్న రుతురాజ్ అనారోగ్యం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరం కాగా... ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (0), శుబ్‌మన్ గిల్ (0) డకౌట్ కావడంతో 6 పరుగులకే భారత్ 2 వికెట్లు కోల్పోయింది. అయితే మూడో స్థానంలో వచ్చిన తిలక్ వర్మ (20 బంతుల్లో 29; 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి స్కోరుబోర్డును పరుగెత్తించాడు. సూర్య కూడా తనదైన శైలిలో జోరు ప్రదర్శించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 24 బంతుల్లోనే 49 పరుగులు జోడించారు. 10 ఓవర్లలో స్కోరు 84 పరుగులకు చేరగా, 29 బంతుల్లో సూర్య అర్ధ సెంచరీ పూర్తయింది. తన తొలి 20 బంతుల్లో 6 ఫోర్లు బాది రింకూ కూడా ధాటిని కొనసాగించాడు. సూర్య, రింకూ నాలుగో వికెట్‌కు 48 బంతుల్లో 70 పరుగులు జత చేశారు. సూర్య వెనుదిరిగిన తర్వాత జితేశ్ శర్మ (1) విఫలం కాగా, 30 బంతుల్లో రింకూ కెరీర్‌లో తన తొలి హాఫ్ సెంచరీని అందుకున్నాడు.



సూర్య

రింకూ సింగ్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) మిల్లర్ (బి) జాన్సెన్ 0; గిల్ (ఎల్బీ) (బి) విలియమ్స్ 0; తిలక్ (సి) జాన్సెన్ (బి) కొయెట్జీ 29; సూర్యకుమార్ (సి) జాన్సెన్ (బి) షమ్సీ 56; రింకూ (నాటౌట్) 68; జితేశ్ (సి) స్టబ్స్ (బి) మార్క్‌రమ్ 1; జడేజా (ఎల్బీ) (బి) కొయెట్జీ 19; అర్ష్‌దీప్ (సి) ఫెలుక్వాయో (బి) కొయెట్జీ 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.3 ఓవర్లలో 7 వికెట్లకు) 180. వికెట్ల పతనం:** 1–0, 2–6, 3–55, 4–125, 5–142, 6–180, 7–180. **బౌలింగ్:** జాన్సెన్ 3–0–39–1; విలియమ్స్ 3–0–32–1; కొయెట్జీ 3.3–0–32–3; ఫెలుక్వాయో 3–0–29–0; షమ్సీ 4–0–18–1; మార్క్‌రమ్ 3–0–29–1. **దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** బ్రీట్‌జె (రనౌట్) 16; హెన్‌డ్రిక్స్ (సి) సూర్యకుమార్ (బి) కుల్దీప్ 49; మార్క్‌రమ్ (సి) సిరాజ్ (బి) ముకేశ్ 30; క్లాసెన్ (సి) యశస్వి (బి) సిరాజ్ 7; మిల్లర్ (సి) సిరాజ్ (బి) ముకేశ్ 17; స్టబ్స్ (నాటౌట్) 14; ఫెలుక్వాయో (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (13.5 ఓవర్లలో 5 వికెట్లకు) 154. వికెట్ల పతనం:** 1–42, 2–96, 3–108, 4–108, 5–139. **బౌలింగ్:** సిరాజ్ 3–0–27–1, అర్ష్‌దీప్ 2–0–31–0, జడేజా 2.5–0–28–0, ముకేశ్ 3–0–34–2, కుల్దీప్ 3–0–26–1.

రాజ్ 9.1-3-13-7

- ఏడు వికెట్లతో హడలెత్తించిన పేసర్
- ఆసియా కప్ అండర్–19 టోర్నీ సెమీస్‌లోకి టీమిండియా



దుబాయ్: భారత టీనేజ్ సీమర్ రాజ్ లింబాని (7/13) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో నేపాల్‌ను కూల్చేశాడు. దీంతో అండర్–19 ఆసియా కప్‌లో యువ భారత్ అలవోక విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 10 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘనవిజయం సాధించింది. రెండు విజయాలతో భారత్ గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంలో... ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన పాకిస్తాన్ గ్రూప్ టాపర్‌గా నిలిచి సెమీఫైనల్ చేరాయి. మొదట బ్యాటింగ్‌కు దిగిన నేపాల్‌ను 18 ఏళ్ల రాజ్ లింబాని స్పెల్ హడలెత్తించింది. దీంతో నేపాల్ 22.1 ఓవర్లలో 52 పరుగులకే కుప్పకూలింది. రాజ్ 9.1 ఓవర్లలో 3 మెయిడెన్లు వేసి 13 పరుగులిచ్చి 7 వికెట్లు తీశాడు. నేపాల్ ఓపెనర్ల నుంచి ఆఖరి వరుస బ్యాటర్ వరకు అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అనంతరం భారత జట్టు 7.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 57 పరుగులు చేసి ఛేదించింది. అర్షిన్ కులకర్ణి (30 బంతుల్లో 43 నాటౌట్; 1 ఫోర్, 5 సిక్స్‌లు) భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. అర్షిన్, ఆదర్శ్ సింగ్ (13 నాటౌట్; 2 ఫోర్లు) అబేధ్యమైన ఓపెనింగ్ బాగస్వామ్యంతో జట్టును గెలిపించారు.

భారత జట్టులో అవినాశ్, అభిషేక్

అండర్–19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీ

ముంబై: అండర్–19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత జట్టును మంగళవారం బీసీసీఐ జూనియర్ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ప్రస్తుతం దుబాయ్‌లో అండర్–19 ఆసియా కప్‌లో పాల్గొంటున్న జట్టునే ఒక్క మార్పూ లేకుండా ఈ మెగా టోర్నీ కోసం కూడా ఎంపిక చేయడం విశేషం. 15 మంది సభ్యుల వరల్డ్‌కప్ టీమ్‌కు పంజాబ్‌కు చెందిన ఉదయ్ సహరన్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, సౌమీ కుమార్ పాండే వైస్ కెప్టెన్‌గా ఉంటాడు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు క్రికెటర్లు అరవెల్లి అవినాశ్ రావు, మురుగన్ అభిషేక్‌లకు ఈ జట్టులో చోటు దక్కింది. వికెట్ కీపర్ అవినాశ్, ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్ అభిషేక్ ఇద్దరూ ఆసియా కప్‌లో భారత్ ఆడిన 3 మ్యాచ్‌లలోనూ బరిలోకి దిగారు. దక్షిణాఫ్రికా వేదికగా జనవరి 19 నుంచి ఫిబ్రవరి 11 వరకు వరల్డ్‌కప్‌ను నిర్వహిస్తారు.



అవినాశ్



అభిషేక్

భారత జట్టు: ఉదయ్ (కెప్టెన్), సౌమీ కుమార్ (వైస్‌కెప్టెన్), అర్షిన్, ఆదర్శ్, రుద్రమయూర్ పటేల్, సచిన్, ప్రియాన్షు, ముషీర్ ఖాన్, అవినాశ్ రావు, మురుగన్ అభిషేక్, ఇనేశ్ మహాజన్, ధనుశ్ గౌడ, ఆరాధ్య శుక్లా, రాజ్ లింబాని, నమన్ తివారి.

వారియర్స్ ఘనవిజయం

బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో బెంగాల్ వారియర్స్ జట్టు మూడో విజయం నమోదు చేసింది. పట్నా పైరేట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 60–42తో గెలిచింది. వారియర్స్ తరఫున



కెప్టెన్ మణీందర్ సింగ్ 15 పాయింట్లు, నితిన్ 14 పాయింట్లు స్కోరు చేశారు. ఈ గెలుపుతో వారియర్స్ జట్టు 18 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో తమిళ్ తలైవాస్‌తో తెలుగు టైటాన్స్; బెంగళూరు బుల్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్ తలపడతాయి.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
బెంగాల్ వారియర్స్	4	3	0	1	18
గుజరాత్ జెయింట్స్	5	3	2	0	17
యూపీ యోధాస్	4	2	2	0	12
పుణేరి పల్టన్	2	2	0	0	10
పట్నా పైరేట్స్	3	2	1	0	10
హరియాణా స్టీలర్స్	3	2	1	0	10
జైపూర్ పింక్ పాంథర్స్	3	1	1	1	9
బెంగళూరు బుల్స్	5	1	4	0	9
దబంగ్ ఢిల్లీ	3	1	2	0	6
యు ముంబా	3	1	2	0	6
తమిళ్ తలైవాస్	2	1	1	0	5
తెలుగు టైటాన్స్	3	0	3	0	1

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

సినిమా

ఎర పడాల్సిందే!



● రజనీకాంత్

'గురి పెడితే ఎర పడాల్సిందే..' అని అంటున్నారు రజనీకాంత్. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రానికి 'వేట్టయాన్' (వేటగాడు అని అర్థం) టైటిల్‌ను ఖరారు చేసి, ఈ సినిమా టైటిల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. మంగళవారం రజనీకాంత్ బర్త్ డే. ఈ సందర్భంగా 'వేట్టయాన్' టైటిల్ వీడియోను విడుదల చేశారు. 'గురి పెడితే ఎర పడాల్సిందే..' అని రజనీకాంత్ చెప్పే డైలాగ్, విజువల్స్‌తో ఈ వీడియో సాగుతుంది. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై ఈ చిత్రాన్ని సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. అలాగే లైకా ప్రొడక్షన్స్ సంస్థలో రజనీకాంత్ ఓ లీడ్ రోల్ చేస్తున్న చిత్రం 'లాల్ సలామ్'. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మొయిద్దీన్ భాయ్ పాత్రలో రజనీకాంత్ నటిస్తున్నారు. రజనీ బర్త్ డే సందర్భంగా మొయిద్దీన్ భాయ్ పాత్రకు సంబంధించిన యాక్షన్ టీజర్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటిస్తున్న ఈ సినిమా జనవరిలో సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది. ఈ సినిమాలే కాకుండా.. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే.



● శ్రుతీహాసన్

కాంబినేషన్ సెట్



● అడివి శేష్

అడివి శేష్, శ్రుతీహాసన్ ప్రధాన పాత్రధారులుగా ఓ యాక్షన్ డ్రామా తెరకెక్కనుంది. అడివి శేష్ హీరోగా నటించిన 'క్షణం', 'గూఢచారి' చిత్రాలకు ఛాయాగ్రాహకుడిగా చేసిన షానీల్ డియో ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారు. కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు అధికారికంగా ఎంపికైన 'లైలా' అనే షార్ట్ ఫిల్మ్‌కు షాన్ దర్శకత్వం వహించారు. శేష్, శ్రుతి కాంబినేషన్‌లో ఆయన దర్శకత్వం వహించనున్న తాజా చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మించనున్నారు. ''ఈ సినిమాలోని ప్రతి సీన్, డైలాగ్‌లను హిందీతోపాటు తెలుగులో కూడా చిత్రీకరించనున్నాం. ప్రతి భాషకు ఉన్న ప్రత్యేకతకు ప్రాధాన్యం ఇస్తూ, ఈ సినిమాను విభిన్నంగా చేస్తున్నాం. ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: సునీల్ నారంగ్.



● సంయుక్తా మీనన్, కళ్యాణ్ రామ్, మాళవికా నాయర్

రాసుకోండి... సినిమా బాగుంటుంది

- కల్యాణ్ రామ్

''మంచి కథ, విజువల్స్, మ్యూజిక్ ఉండి.. దానికి తగ్గ టీమ్ వర్క్ చేసినప్పుడు ప్రేక్షకులు థియేటర్స్‌కి వద్దన్నా వస్తారని 'బింబిసార' సినిమా టైమ్‌లో చెప్పాను. దాన్ని మీరు (ఫ్యాన్స్, ఆడియన్స్) నిజం చేశారు. అదే కోవలో 'డెవిల్' మంచి కథా కథనాలతో వస్తోంది. రాసుకోండి.. సినిమా చాలా బావుంటుంది. ఈ చిత్రం సరికొత్త కథతో ఉంటుంది'' అని హీరో కల్యాణ్ రామ్ అన్నారు. ఆయన హీరోగా, మాళవికా నాయర్, సంయుక్తా మీనన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డెవిల్'. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కల్యాణ్ రామ్ మాట్లాడుతూ– ''ఖర్చుకి వెనకాడకుండా 'డెవిల్'ని రూపొందించిన అభిషేక్ నామాగారికి థ్యాంక్స్. సినిమా అనేది టీమ్ ఎఫర్ట్. దాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే వచ్చే ఆనందమే వేరు. 'బింబిసార 2'ను వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మేలో మొదలుపెడతాం. తమ్ముడు ఎన్టీఆర్ 'దేవర' సినిమా గ్లింప్స్‌ని త్వరలో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''డెవిల్' కోసం రెండేళ్ల పాటు కల్యాణ్ రామ్‌గారు మరో సినిమా చేయకుండా పని చేశారు. ఇందులో ఆయన యాక్షన్, నటన అదిరిపోతాయి. మా 'డెవిల్' హిట్‌తో 2023 ముగుస్తుంది'' అన్నారు అభిషేక్ నామా.

హారర్ అంటే ఉలిక్కిపడేలా ఉండాలి

- శ్రీరామ్

''హారర్ సినిమాల విషయంలో నాకు ఓ భయం ఉంటుంది. పేరుకి హారర్ సినిమా అంటారు కానీ అందులో అనవసరమైన కామెడీ, రొమాన్స్, సాంగ్స్‌ను ఇరికిస్తుంటారు. హారర్ అంటే థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు ఉలిక్కిపడేలా ఉండాలి. సాయికిరణ్ దైదా 'పిండం' మూవీ కథ చెప్పినప్పుడు ప్రేక్షకులు ఉలిక్కి పడతారనిపించింది'' అని హీరో శ్రీరామ్ అన్నారు. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'పిండం'. యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీరామ్ చెప్పిన విశేషాలు.

● నేను నటించిన తొలి తెలుగు చిత్రం 'ఒకరికి ఒకరు' రిలీజై 20 ఏళ్లయింది. ఇన్నేళ్లయినా అలాగే ఉన్నారు. ఆరోగ్య రహస్యం ఏంటి? అని అడుగుతుంటారు. ఆహారం విషయంలో శ్రద్ధ తీసుకుంటాను. ఎక్కువగా ఇంటి భోజనం తింటాను. బయటకు వెళ్లినా ఎక్కువగా పప్పు, సాంబారు వంటి ఆహారమే తీసుకుంటాను. ఉన్న దాంతో సంతృప్తి చెంది, ఆనందంగా ఉంటాను. ● సాయి కిరణ్ దైదా తీసిన 'స్మోక్' అనే షార్ట్ ఫిల్మ్ చూసి తన ప్రతిభపై నమ్మకం కలిగింది. చెప్పిన బడ్జెట్, టైమ్‌కి 'పిండం' పూర్తి చేశారు. యశ్వంత్ ఈ కథను నమ్మి సినిమా నిర్మించారు. ఇది థియేటర్‌లో చూసి అనుభూతి చెందాల్సిన హారర్ సినిమా. 1930, 1990, ప్రస్తుతం.. ఇలా మూడు కాలాల్లో ఈ చిత్రకథ జరుగుతుంది. ● నా దృష్టిలో ఇప్పటిదాకా తెలుగులో భయంకరమైన హారర్ సినిమా అంటే రామ్‌గోపాల్ వర్మగారు తీసిన 'రాత్రి'. ఆ మూవీని చాలాసార్లు చూశాను. 'పిండం' అనేది కేవలం హారర్ సినిమా కాదు... ఇందులోని బలమైన కథ, భావోద్వేగాలకు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ● నేను చేసిన 'రెక్కీ' వెబ్ సిరీస్ సంతృప్తినిచ్చింది. ప్రస్తుతం ఓటీటీ కోసం 'నెట్ వర్క్, హరికథ' అనే ప్రాజెక్ట్‌లు చేస్తున్నాను. నేను, జీవీ ప్రకాశ్ తమిళ్‌లో 'బ్లాక్ మెయిల్' అనే మూవీ చేస్తున్నాం. అలాగే 'సంభవం' చిత్రం చేస్తున్నా. ప్రస్తుతం ఆరు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను.





● అను ప్రసాద్, నిరీష్, సాయి కుమార్, పూజితా పొన్నాడ, విరాజ్ అశ్విన్

మా సినిమా చేనేత కార్మికులకు అంకితం

- సాయి కుమార్

''జోరుగా హుషారుగా'లో చేనేత కార్మికుడిగా నటించడం నా అదృష్టం. పోచంపల్లి చేనేత కార్మికుల గురించి చక్కగా చూపించాడు అను ప్రసాద్. ఈ చిత్రాన్ని చేనేత కార్మికులకు అంకితం ఇస్తున్నాం'' అన్నారు సాయి కుమార్. విరాజ్ అశ్విన్, పూజితా పొన్నాడ జంటగా అను ప్రసాద్ దర్శకత్వం వహించిన చిత్రం 'జోరుగా హుషారుగా'. నిరీష్ తిరువీధుల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి అతిథిగా హాజరైన దర్శకుడు మల్లిడి వశిష్ఠ మాట్లాడుతూ– ''బెక్కం వేణుగోపాల్‌గారు కొత్త దర్శకులను, కొత్త కథలను, చిన్న సినిమాలను బాగా ప్రోత్సహిస్తారు. 'జోరుగా హుషారుగా' సక్సెస్ అవ్వాలి'' అన్నారు. ''ఈ మూవీలో తండ్రీ కొడుకుల మధ్య వచ్చే సీన్స్ ఆకట్టుకుంటాయి'' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. ''ఇదొక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్'' అన్నారు విరాజ్ అశ్విన్. ''ఇది నా మొదటి చిత్రం'' అన్నారు అను ప్రసాద్. ''సినిమా రిలీజ్‌కి బెక్కం వేణుగోపాల్‌గారు అందించిన సపోర్ట్ మర్చిపోలేను'' అన్నారు నిరీష్ తిరువీధుల.

పాన్ ఇండియా కంటెంట్ ఉన్న చిత్రం శాంతల

- కేఎస్ రామారావు



● ఇర్రంకి సురేష్, కేయస్ రామారావు, అశ్లేషా ఠాకూర్, నిహాల్ కోదాటి, శేషు పెద్దిరెడ్డి

నిహాల్ కోదాటి, అశ్లేషా ఠాకూర్ జంటగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'శాంతల'. క్రియేటివ్ కమర్షియల్ సూపర్ విజన్‌తో శేషు పెద్దిరెడ్డి ఈ సినిమాను తెరకెక్కించారు. ఇండో అమెరికన్ ఆర్ట్స్ పతాకంపై ఇర్రంకి సుబ్బలక్ష్మి సమర్పణలో డా. ఇర్రంకి సురేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిహాల్ మాట్లాడుతూ– ''ఈ కథతో రెండున్నరేళ్లు ప్రయాణం చేశారు మా దర్శకుడు శేషు. సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ మా సినిమాకు ప్రాణం పోశారు. నటీనటులందరూ అద్భుతంగా నటించారు. ఈ సినిమాను ప్రేక్షకులు విజయవంతం చేయాలి'' అన్నారు. ''జైలర్, జవాన్, యానిమల్' వంటి హెవీ డోస్ ఉన్న సినిమాలతో పాటు, 'బలగం', 'బేబీ' వంటి చిత్రాలనూ ప్రేక్షకులు ఆదరించారు. ఇలా 'శాంతల' సినిమాను కూడా ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను. నేను 'శాంతల' చూశాను. సినిమా బాగా వచ్చింది. పాన్ ఇండియాకు సరిపడా కంటెంట్ ఉంది కాబట్టి ఆ స్థాయిలో రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు నిర్మాత కేఎస్ రామారావు. ''సవాల్‌గా తీసుకుని ఈ సినిమాను పూర్తి చేశాం'' అన్నారు అశ్లేషా ఠాకూర్. ''మాకు సపోర్ట్‌గా నిలిచిన కేఎస్ రామారావుగారికి థ్యాంక్స్. ప్రేక్షకులకు నచ్చే విధంగా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు ఇర్రంకి సురేష్.

కరావళి ఊరి కథ

● ప్రజ్వల్ దేవరాజ్



కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కరావళి'. స్వీయ దర్శకత్వంలో గురుదత్త గనిగ నిర్మించిన ఈ మూవీ త్వరలోనే థియేటర్లోకి రానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్, ప్రోమోలను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాత గురుదత్త గనిగ మాట్లాడుతూ–''కరావళి అనేది కర్ణాటకలోని ఓ ప్రాంతం. కంబాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. కరావళిలోని కన్నడ భాష, సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, మూలాల్లోంచి ఓ కథని తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రజ్వల్ దేవరాజ్ నటించిన 40వ సినిమా ఇది. ఈ సినిమా అన్ని ప్రాంతాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సచిన్ బస్రూర్, కెమెరా: అభిమన్యు సదానందన్.

సాక్షి బిజినెస్
బుధవారం
13-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	378	69,551
నిఫ్టీ ▽	91	20,906

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తాజి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,463	▲	31
డోజోన్స్	36,554	▲	158
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,543	▽	2
డాక్స్	16,792	▽	3
షాంఘై	3,003	▲	12
నికాయ్	32,844	▲	52

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
61,277	▽	175
బంగారం (99.5 స్వచ్ఛత)		
61,032	▽	174
వెండి (కిలో)		
71,575	▲	173

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.97	83.99
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.45	106.00
€	యూరో	ఒకటి	88.72	91.07
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.67	57.96
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.06	55.99
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.38	63.37
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.22	21.98
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.79	23.58
¥	చైనా యువాన్	పదింటికి	10.45	12.56

రూ. లక్షకు యూపీఐ ఆటోమేటిక్ చెల్లింపుల పరిమితి

ముంబై: యూపీఐ ద్వారా ఆటోమేటిక్ చెల్లింపు లావాదేవీ పరిమితిని ఆర్‌బీఐ రూ. లక్షకు పెంచింది. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ చందా తదితర కొన్ని విభాగాలకు ఆటోమేటిక్ లావాదేవీ పరిమితి



రూ.15,000గా ఉంది. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి, బీమా ప్రీమియం, క్రెడిట్‌కార్డు బిల్లు చెల్లింపుల ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.15,000 నుంచి రూ.లక్షకు పెంచాలని నిర్ణయించినట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. యూపీఐ ప్రధాన చెల్లింపుల మాధ్యమంగా మారిన తరుణంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

యూనియన్ బ్యాంక్‌కు ఐబీఎస్‌ఐ అవార్డు



ముంబై: ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2023కి గాను ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ సిస్టమ్ ఇంటెలిజెన్స్ (ఐబీఎస్‌ఐ) గ్లోబల్ ఫిన్‌టెక్ ఇన్నోవేషన్ అవార్డును దక్కించుకుంది. 'ఉత్తమ డిజిటల్ చానల్/ప్లాట్‌ఫాం' కేటగిరీలో దీన్ని అందుకుంది. ఈ అవార్డు కోసం 49 దేశాలకు చెందిన 106 బ్యాంకుల నుంచి 250 పైగా నామినేషన్లు వచ్చా యి. టెక్నాలజీతో కస్టమర్లకు మెరుగైన సేవలందించడంలో తమ సంస్థకు గల నిబద్ధతకు ఈ పురస్కారం నిదర్శనమని బ్యాంక్ సీటీవో అనిల్ కురిల్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-12-2023	
విశాఖ	583-00
చిత్తూరు	585-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	576-00
విజయవాడ	576-00
రిటైల్ ధర (డజను)	72.00
12-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	555-00
వరంగల్	557-00
రిటైల్ ధర	6.15

పరిశ్రమలు రయ్.. ధరలు షాక్!

- అక్టోబర్‌లో పారిశ్రామిక వృద్ధి 11.7 శాతం
- 16 నెలల గరిష్ట స్థాయి
- నవంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.55 శాతం
- మూడు నెలల గరిష్టానికి అప్



న్యూఢిల్లీ: భారత స్థూల ఆర్థిక గణాంకాల విషయంలో రెండు కీలక విభాగాలకు సంబంధించి మంగళవారం వెలువడిన గణాంకాలు మిశ్రమ ఫలితాలను అందించాయి. అక్టోబర్ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) 11.7 శాతం వృద్ధిని (2022 అక్టోబర్ గణాంకాలతో పోల్చి) నమోదుచేసుకుంది. గడచిన 16 నెలల్లో ఇంత అధిక స్థాయిలో (2022 జూన్‌లో 12.6 శాతం తర్వాత) పారిశ్రామిక ఉత్పత్తి సూచీ నమోదుకావడం ఇదే తొలిసారి. కాగా, గత ఏడాది ఇదే నెల్లో (2022 అక్టోబర్) ఐఐపీలో అసలు వృద్ధి లేకపోగా 4.1 శాతం క్షీణించడంతో తాజా సమీక్షా నెల భారీ వృద్ధి గణాంకాలు కనబడ్డానికి 'బేస్ ఎఫెక్ట్' కారణమన్న విశ్లేషణలూ ఉన్నాయి. ఇక రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన నిర్ణయానికి ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (పీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం నవంబర్‌లో 5.55 శాతంగా నమోదయ్యింది. గడచిన మూడు నెలల్లో మొదటిసారి ఇంత అధిక స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం నమోదయ్యింది. నిజానికి ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశాల ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం ప్లస్ 2 లేదా మైనస్ 2తో 4 శాతంగా ఉండాలి. దీని ప్రాతిపదికన ఎగువ దిశలో రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం వరకూ ఉండవచ్చు. అయితే ద్రవ్యోల్బణం పట్ల చాలా అప్రమత్తత అవసరమని, 4 శాతం కట్టడే తమ లక్ష్యమని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ పలు సందర్భాల్లో స్పష్టం చేస్తున్న సంగతి తెలిసిందే. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన ఐఐపీ కీలక విభాగాల గణాంకాల్లో పరిశీలిస్తే..

'బేస్ ఎఫెక్ట్'తో జూమ్!

- భారత్ మొత్తం స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) దాదాపు 28.3% వాటా కలిగిన పారిశ్రామిక రంగం ఉత్పత్తి 11.7% పెరిగితే, అందులో దాదాపు 70% వాటా కలిగిన తయారీ రంగం పురోగతి సమీక్షా నెల్లో 10.4%. గత ఏడాది ఇదే నెల్లో ఈ విభాగంలో అసలు వృద్ధి లేకపోగా 5.8 శాతం క్షీణత నమోదయ్యింది.

ఏప్రిల్–అక్టోబర్ మధ్య 6.9 శాతం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) ఏప్రిల్-అక్టోబర్ మధ్య ఐఐపీ వృద్ధి రేటు 6.9%గా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో వృద్ధి రేటు 5.3%.

ఆహార ధరల తీవ్రత



దిగువబాటలో కొనసాగుతున్న రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) నవంబర్‌లో 'యూ-టర్న్' (సెప్టెంబర్‌లో 5.02 శాతం, అక్టోబర్‌లో 4.87 శాతం) తీసుకుని, 5.55 శాతంగా నమోదయ్యింది. ఆహార ధరల పెరుగుదల దీనికి కారణం. ఉత్పత్తుల బాస్కెట్‌లో ఒక్క ఫుడ్ బాస్కెట్‌ను చూస్తే, 2022 నవంబర్‌లో ద్రవ్యోల్బణం 4.67 శాతం, 2023 అక్టోబర్‌లో 6.61 శాతం ఉంటే, తాజా సమీక్షా నెల నవంబర్‌లో ఇది 8.7 శాతానికి ఎగసింది. మొత్తం సీపీఐలో ఫుడ్ బాస్కెట్ వెయిటేజ్ 50 శాతం. ఇందులో రెండంకెల్లో ధరలు పెరిగిన జాబితాలో సుగంధ ద్రవ్యాలు (21.55 శాతం) పప్పు దినుసులు (20.23 శాతం) కూరగాయలు (17.70 శాతం), పండ్లు (10.95 శాతం), తృణ ధాన్యాలు (10.25 శాతం) ఉన్నాయి. ధరలు పెరిగిన మిగిలిన ఉత్పత్తుల్లో చక్కెర, తీపి ఉత్పత్తులు (6.55 శాతం) గుడ్లు (5.90 శాతం), పాలు, పాల ఉత్పత్తులు (5.75 శాతం), ప్రిపేర్డ్ మీల్స్ (4.22 శాతం), నాన్ ఆల్కాహాలిక్ బేవరేజెస్ (3.58 శాతం) ఉన్నాయి. ఆయిల్, ఫ్యాట్స్ ధరలు మాత్రం 15.03 శాతం తగ్గాయి. ఇక ఫుడ్ అండ్ బేవరేజెస్ ధరల పెరుగుదల 8.02 శాతంగా ఉంది.

రూ. 800 కోట్లతో బ్యాటరీ ఫాయిల్ ప్లాంటు

ఒడిశాలో ఏర్పాటుపై హిందాల్కో కసరత్తు


న్యూఢిల్లీ: అల్యూమినియం తయారీ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్ తాజాగా బ్యాటరీ ఫాయిల్ ఉత్పత్తి కోసం ఒడిశాలోని సంబల్‌పూర్‌లో ప్లాంటు ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ. 800 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. 2025 జూలై నాటికి ఈ ప్లాంటు అందుబాటులోకి వస్తుందని సంస్థ తెలిపింది. ఇందులో ప్రాథమికంగా 25,000 టన్నుల అల్యూమినియం ఫాయిల్‌ను తయారు చేయనున్నట్లు వివరించింది. లిథియం అయాన్, సోడియం అయాన్ బ్యాటరీల్లో అల్యూమినియం ఫాయిల్ కీలకంగా ఉంటుంది.



ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ వేగంగా విస్తరిస్తుండటంతో ఫాయిల్‌కు కూడా డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని హిందాల్కో ఎండీ సతీష్ పాయ్ తెలిపారు. 2030 నాటికి దేశీయంగా బ్యాటరీ గ్రేడ్ అల్యూమినియం ఫాయిల్‌కు డిమాండ్ అనేక రెట్లు పెరిగి 40,000 టన్నులకు చేరవచ్చనే అంచనాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర మౌదాలోని బ్యాటరీ ఫాయిల్స్ తయారీ ప్లాంటుకు సంబల్‌పూర్ అనుబంధంగా పని చేస్తుందని పాయ్ చెప్పారు.

'డిస్నీ-స్టార్'పై రిలయన్స్ కన్ను!

- వచ్చే వారం ఒప్పందం కుదుర్చుకునే అవకాశం
- నగదు, స్టాక్ రూపంలో డీల్



న్యూఢిల్లీ: భారత్‌లో డిస్నీ-స్టార్ వ్యాపారాన్ని దక్కించుకోవడంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ మరింతగా దృష్టి పెట్టింది. 51% మెజారిటీ వాటా కొనుగోలుకు సంబంధించి వచ్చే వారం ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నగదు, స్టాక్ రూపంలో ఈ డీల్ ఉండొచ్చని పేర్కొన్నాయి. ప్రస్తుతం ఇంకా చర్చలు జరుగుతున్నాయని, తుది నిర్ణయమేదీ తీసుకోలేదని వివరించాయి. ఒప్పందం కుదుర్చుకున్నాక ఇరు సంస్థలు వ్యాపార మదింపు ప్రక్రియ చేపడతాయని తెలిపాయి. ఒప్పందం సాకారమైతే మీడియా రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ మరింతగా విస్తరించేందుకు దోహదపడనుంది. పలు సవాళ్ల నేపథ్యంలో భారత విభాగాన్ని విక్రయించే యోచనలో ఉన్నట్లు వాల్ట్ డిస్నీ సీఈవో బాబ్ ఐగర్ ఇటీవల సంకేతాలిచ్చిన నేపథ్యంలో తాజా డీల్ వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కన్సాలిడేషన్ దిశగా ..

ఇప్పటికే జీ ఎంటర్‌టైన్‌మెంట్, కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ (గతంలో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా) విలీన ప్రక్రియ జరుగుతుండగా కొత్తగా రిలయన్స్, డిస్నీ-స్టార్ డీల్ కూడా కుదిరితే దేశీయంగా మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో కన్సాలిడేషన్ జరిగే అవకాశం ఉందని ఎలారా క్యాపిటల్ ఎస్‌వీపీ కరణ్ తౌరానీ తెలిపారు. రెండు మీడియా దిగ్గజాలకు (సోనీ/రిలయన్స్) టీవీ/ఓటీటీ మార్కెట్లో సింహభాగం వాటా ఉంటుందని పేర్కొన్నారు. డిస్నీ-స్టార్ భారత వ్యాపార విభాగంలో స్టార్ ఇండియా తదితర టీవీ చానళ్లు, డిస్నీప్లస్ హాట్‌స్టార్ ఓటీటీ ప్లాట్‌ఫాం ఉన్నాయి. డీల్ అనంతరం డిస్నీ-స్టార్‌కు దేశీ వ్యాపారంలో మైనారిటీ వాటాలు ఉంటాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఒప్పందం అమలైతే విలీన సంస్థ దేశంలోనే అతి పెద్ద మీడియా సంస్థల్లో ఒకటిగా ఆవిర్భవించనుంది. రిలయన్స్ అనుబంధ సంస్థ వయాకామ్ 18కి చెందిన 38 చానళ్లు, స్టార్ ఇండియాకి ఎనిమిది భాషల్లో ఉన్న చానళ్లతో కలిపి మొత్తం 70 టీవీ చానళ్లు ఉంటాయి. వాటితో పాటు 2 స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు–డిస్నీప్లస్‌హాట్‌స్టార్, జియోసినిమా కూడా ఉంటాయి. 2019లో స్టార్‌ను ట్వంటీఫస్ట్ సెంచరీ ఫాక్స్ నుంచి డిస్నీ కొనుగోలు చేసింది.

గణాంకాల ముందు అప్రమత్తత

- రికార్డుల ర్యాలీకి బ్రేక్
- సెన్సెక్స్ నష్టం 378 పాయింట్లు
- నిఫ్టీ 91 పాయింట్లు డౌన్



ముంబై: భారత్, అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల వెల్లడికి ముందు స్టాక్ మార్కెట్లో అప్రమత్తత చోటు చేసుకోవడంతో సూచీల రికార్డు ర్యాలీకి మంగళవారం బ్రేక్ పడింది. మెటల్, ఐటీ, మీడియా మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ 378 పాయింట్లు నష్టపోయి 69,551 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 91 పాయింట్లు క్షీణించి 20,906 వద్ద నిలిచింది. ప్రారంభంలోనే సెన్సెక్స్ 106 పాయింట్లు పెరిగి 70,034 వద్ద, నిఫ్టీ 41 పాయింట్లు బలపడి 21,038 వద్ద కొత్త రికార్డు స్థాయిలను నమోదు చేశాయి. కీలక స్థూల ఆర్థిక గణాంకాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు రికార్డు స్థాయిల వద్ద ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ, ఇంధన, యుటిలిటీ, వినిమయ, క్యాపిటల్ గూడ్స్, మౌలిక రంగాల షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను ప్రభావితం చేసే అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు అంచనాలకు తగ్గట్లే వెల్లడి కావొచ్చనే ఆశలతో ప్రపంచ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- రిలయన్స్ 1.50%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1%, ఇన్ఫోసిస్ 1% నష్టపోయి సూచీలను రికార్డు గరిష్టాల నుంచి వెనక్కి లాగాయి.
- క్యూఐపీ ద్వారా రూ.750 కోట్ల నిధుల సమీకరణకు బోర్డు ఆమోదం తెలపడంతో జమ్మూఅండ్‌కాశ్మీర్ షేరు 7% లాభపడి రూ.134 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 12% ర్యాలీ చేసి రూ.140 వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది.
- మినిరత్న కంపెనీ ఐఆర్‌ఈడీఏ షేరు 20% లాభపడి రూ.102 వద్ద ముగిసింది.

భవిత

జాబ్ పాయింట్

ఐడీబీఐ బ్యాంక్‌లో 86 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులు

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ).. స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 86
» **పోస్టుల వివరాలు:** మేనేజర్ గ్రేడ్ బి-46, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఏజీఎం) గ్రేడ్‌సి-39, డిప్యూటీ జనరల్ మేనేజర్(డీజీఎం)గ్రేడ్ డి-01
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, ఎంబీఏ, సీఎఫ్ఏ, ఎఫ్ఆర్ఎం, ఐసీడబ్ల్యూఏ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.11.2023 నాటికి మేనేజర్ పోస్టులకు 25 నుంచి 35 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 28 నుంచి 40 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులకు 35 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.76,010 నుంచి రూ.89,890, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు రూ.63,840 నుంచి రూ.78,230, మేనేజర్‌కు రూ.48,170 నుంచి రూ.69,810.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, పని అనుభవం, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.12.2023
» **వెబ్‌సైట్:** www.idbibank.in

బ్యాంక్ ఆఫ్ బరోడా, ముంబైలో 250 సీనియర్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని బ్యాంక్ ఆఫ్ బరోడా.. ఎంఎస్‌ఎంఈ విభాగంలో రెగ్యులర్ ప్రాతిపదికన సీనియర్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 250
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ లేదా పీజీ/ఎంబీఏ(మార్కెటింగ్ అండ్ ఫైనాన్స్)ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.12.2023 నాటికి 28 నుంచి 37 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.63,840 నుంచి రూ.78,230.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, సైకోమెట్రిక్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, వైద్య పరీక్ష, ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.12.2023
» **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

ట్రిపుల్ ఐటీ శ్రీ సిటీ చిత్తూరులో 18 ఫ్యాకల్టీ పోస్టులు

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శ్రీ సిటీ(ఐఐఐటీఎస్).. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్-08, అసోసియేట్ ప్రొఫెసర్-06, ప్రొఫెసర్-04.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్, ఇంగ్లిష్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ, ఎంఫిల్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, పని అనుభవం, సెమినార్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.01.2024.
» **వెబ్‌సైట్:** iiits.ac.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 363 అప్రెంటిస్‌లు


హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. ఏడాది అప్రెంటిస్‌షిప్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 363
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్-250, డిప్లొమా/టెక్నీషియన్ అప్రెంటిస్-113.
» **విభాగాలు:** ఈసీఈ, సీఎస్ఈ, మెకానికల్, ఈఈఈ, సివిల్, ఈఐఈ.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 31.12.2023 నాటికి 25 ఏళ్లు మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు జీఈఏలకు రూ.9000, టీఏ అభ్యర్థులకు రూ.8000.
» **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం.
» **ఎంపిక విధానం:** డిప్లొమా, బీఈ, బీటెక్ పరీక్షల్లో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **డాక్యుమెంట్ వెరిఫికేషన్ స్థలం:** ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, కార్పొరేట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, నలంద కాంప్లెక్స్, టీఐఎఫ్ఆర్ రోడ్, ఈసీఐఎల్, హైదరాబాద్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.12.2023
» **ధ్రువపత్రాల పరిశీలన తేదీలు:** 21.12.2023, 22.12.2023.
» **వెబ్‌సైట్:** www.ecil.co.in

స్టెమ్.. కెరీర్ షైనింగ్!

» స్టెమ్ కోర్సులతో విస్తృత విద్య, ఉద్యోగావకాశాలు
» విదేశాల్లో మన స్టెమ్ నిపుణులకు డిమాండ్
» స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో చేరేందుకు విద్యార్థుల ఆసక్తి

సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్.. సంక్షిప్తంగా స్టెమ్! వీటిల్లో ఎందులో నైపుణ్యం సాధించినా.. కెరీర్‌కు ఢోకా ఉండదు. ప్రోగ్రామింగ్ నుంచి పరిశోధనల వరకూ.. నచ్చిన కెరీర్‌ను ఎంచుకోవచ్చు. అమెరికా మొదలు ఆస్ట్రేలియా దాకా.. ఎక్కడైనా అవకాశాలు అందుకోవచ్చు. అందుకే మన విద్యార్థులు దేశవిదేశాల్లో స్టెమ్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో.. స్టెమ్ ప్రోగ్రామ్స్‌తో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక కథనం..



కెరీర్ గైడెన్స్

స్టెమ్.. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్‌లను సమ్మిళితం చేస్తూ.. అమెరికాలో వీటిని ప్రత్యేక ప్రోగ్రామ్స్‌గా పరిగణిస్తున్నారు. మన దేశంలోనూ ఈ కోర్సులకు ప్రాధాన్యం పెరుగుతోంది. కారణం.. ఆవిష్కరణలకు ఊతమిచ్చే సైన్స్ మొదలు నేటి డిజిటల్ యుగంలో ఏఐ వరకూ.. స్టెమ్ స్కిల్స్ కీలకంగా మారుతుండడమే! ఆయా విభాగాల్లో ఆసక్తి ఉన్న వారు అకడమిక్ స్థాయి నుంచే వీటిపై పట్టు సాధిస్తే.. ఉజ్వల అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.

స్టెమ్ ప్రోగ్రామ్స్

సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్.. ఈ నాలుగు విభాగాలను కలిపి సంక్షిప్తంగా స్టెమ్ ప్రోగ్రామ్స్‌గా పిలుస్తున్నారు. కారణం..ఈ నాలుగు విభాగాలు ఒకదానికొకటి అనుసంధానంగా ఉండటమే. ఉదాహరణకు లేటెస్ట్ టెక్నాలజీస్‌ను ఆవిష్కరించే క్రమంలో సైంటిస్ట్‌లు.. సైన్స్, మ్యాథమెటిక్స్ సూత్రాలను అన్వయించాల్సి ఉంటుంది.ఇదే విధంగా ఇంజనీరింగ్‌కు మూలం సైన్స్, మ్యాథ్స్ సిద్ధాంతాలే. దీంతో.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనల్లో స్టెమ్ ప్రోగ్రామ్స్‌కు ప్రాధాన్యం ఏర్పడింది.

నిపుణుల కొరత

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్టెమ్ విభాగాల్లో నిపుణుల కొరత ఉన్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. యూఎస్, యూకే, కెనడా, జర్మనీ, చైనా, భారత్.. ఇలా అన్ని దేశాల్లోనూ స్టెమ్ నిపుణులకు డిమాండ్ నెలకొంది. నేటి ఏఐ, రోబోటిక్స్ టెక్నాలజీ యుగంలో పరిశోధనలు, ఆవిష్కరణలకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ఫలితంగా స్టెమ్ నిపుణుల సేవల అవసరం పెరుగుతోంది. జర్మనీలో స్టెమ్ విభాగంలో దాదాపు 2.5 లక్షల మంది నిపుణుల అవసరం ఉన్నట్లు అంచనా. అమెరికాలో దాదాపు 10 లక్షల మంది నిపుణులకు డిమాండ్ నెలకొంది. అదే విధంగా..యూకేలోనూ ఈ ఏడాది చివరి నాటికి 6.5 లక్షల మంది స్టెమ్ నిపుణుల అవసరం ఉంటుందని అంచనా.

సైన్స్, మ్యాథమెటిక్స్

ప్రస్తుతం ఎక్కువ మంది టెక్నాలజీ, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరుతున్నారు. కారణం.. ఈ విభాగాల్లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు లభిస్తుండటమే! ఫలితంగా ప్యూర్ సైన్సెస్, మ్యాథమెటిక్స్‌లో అడుగుపెట్టే వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. దీంతో సైన్స్, మ్యాథమెటిక్స్‌లలో నిపుణుల కొరత సమస్యగా మారింది. అంతేకాకుండా ఇంజనీరింగ్, టెక్నాలజీ కోర్సులు పూర్తి చేసుకున్నప్పటికీ.. పరిశ్రమ అవసరాలకు తగ్గ స్కిల్స్ ఉన్న వారి సంఖ్య ఆశించిన స్థాయిలో లేదు. ముఖ్యంగా ఆధునిక టెక్నాలజీలుగా పేర్కొంటున్న ఏఐ, బిగ్ డేటా, ఐఓటీ వంటి విభాగాల్లో నిపుణుల కొరత దాదాపు 40 శాతం మేరకు ఉంది.

పెరుగుతున్న ఆసక్తి

స్టెమ్ ప్రోగ్రామ్స్‌పై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. మన దేశంలో గత కొన్నేళ్లుగా స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో చేరే వారి సంఖ్య గణనీయంగా ఉంది. సైన్స్, టెక్నాలజీ విభాగాల్లో ఉపాధి అవకాశాలతో పాటు రీసెర్చ్ అభ్యర్థులకు ప్రభుత్వాలు పలు ప్రోత్సాహకాలు అందించడమే ఇందుకు కారణం. అంతర్జాతీయంగా కూడా అమెరికా, రష్యా, యూకే, కెనడా వంటి దేశాలు స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నాయి. దీంతో అక్కడ కూడా ఉపాధి అవకాశాలు అందుకునేందుకు వీలవుతుంది.

స్కూల్ స్థాయి నుంచే ప్రోత్సాహం

సైన్స్, మ్యాథమెటిక్స్‌లో పరిశోధనలు, ఆవిష్కరణలు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు పలు చర్యలు చేపడుతున్నాయి. అందుకోసం హైస్కూల్ స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు సైన్స్, మ్యాథమెటిక్స్ విద్యార్థులకు పలు ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నాయి. యూనివర్సిటీ స్థాయిలో పీహెచ్‌డీ విద్యార్థులకు ఇచ్చే ఫెలోషిప్‌లను సైతం ఇటీవల ప్రభుత్వం పెంచింది. స్టెమ్ ప్రోగ్రామ్స్ ద్వారా నైపుణ్యాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పేరుతో ప్రత్యేక ఇన్‌స్టిట్యూట్స్‌ను నెలకొల్పింది. సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐటీల్లో సైన్స్, మ్యాథమెటిక్స్ మేజర్స్‌గా ప్రత్యేక కోర్సులను సైతం ప్రవేశపెట్టారు.

బిజినెస్ స్కూల్స్.. స్టెమ్ బాట

మేనేజ్‌మెంట్ విద్యను అందించే ఇన్‌స్టిట్యూట్స్ సైతం ఎంబీఏ, పీజీడీఎం స్థాయిలో స్టెమ్ ప్రోగ్రామ్స్‌ను ప్రారంభిస్తున్నాయి. ప్రధానంగా డేటా సైన్స్, డేటా అనలిటిక్స్ కోర్సులను బోధిస్తున్నాయి. వీటితోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ),మెషీన్ లెర్నింగ్‌లకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయి. కార్పొరేట్ ప్రపంచంలో డేటా అనలిటిక్స్‌కు ప్రాధాన్యం పెరగడం, అనలిటిక్స్‌లో నైపుణ్యానికి టెక్ స్కిల్స్ పునాదిగా నిలవడం ఇందుకు కారణంగా చెప్పొచ్చు. ఎంబీఏ విద్యార్థులకు డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, డేటా మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తే.. అటు మేనేజ్‌మెంట్‌తోపాటు ఇటు టెక్ స్కిల్స్ కూడా సొంతమై కార్పొరేట్ వర్గాల నుంచి మరింత ఆదరణ లభిస్తుందని భావిస్తున్నారు.

స్టెమ్‌తో నైపుణ్యాలు

స్టెమ్ ప్రోగ్రామ్స్ పూర్తి చేసుకుంటే లభించే సబ్జెక్ట్, టెక్నికల్ నైపుణ్యాలతోపాటు పలు ఇతర స్కిల్స్ లభిస్తాయని చెప్పొచ్చు. ఇందులో ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, అనలిటికల్ స్కిల్స్, రీసెర్చ్ ఓరియెంటేషన్ స్కిల్స్ ముఖ్యమైనవి. ఫలితంగా ఆయా విభాగాల్లో భవిష్యత్తులో విధుల నిర్వహణపరంగా మెరుగైన పనితీరు కనబరుస్తారని కంపెనీల భావన.

ఆకర్షణీయ వేతనాలు

స్టెమ్ ప్రోగ్రామ్స్ ఉత్తీర్ణులకు కంపెనీలు ఆకర్షణీయమైన వేతనాలు అందిస్తున్నాయి. గ్రాడ్యుయేషన్ స్థాయి కోర్సులు పూర్తిచేసుకున్న వారికి స్కిల్స్ ఉంటే ప్రారంభంలోనే సగటున నెలకు రూ.30 వేల వేతనం లభిస్తోంది. పీజీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు వారి స్పెషలైజేషన్‌కు అనుగుణంగా నెలకు గరిష్టంగా రూ.50 వేల వేతనం అందుతోంది. పీహెచ్‌డీ అభ్యర్థులకు రూ.లక్ష వరకు వేతనం ఇవ్వడానికి సైతం సంస్థలు సిద్ధంగా ఉంటున్నాయి.

అవకాశాలు

స్టెమ్ ప్రోగ్రామ్స్ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలకు కొదవలేదని చెప్పొచ్చు. ముఖ్యంగా ఆర్ అండ్ డీ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఇవే కాకుండా.. మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలు, బయో మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్, హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్స్, ఐటీ సంస్థల్లోనూ కొలువులు దక్కించుకోవచ్చు. ఇంజనీరింగ్, టెక్నాలజీకి సంబంధించి సాఫ్ట్‌వేర్ సంస్థలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఐఓటీ తదితర విభాగాల్లోనూ ఉజ్వల కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి.

అకడమిక్ మార్గాలెన్నో!

స్టెమ్ కోర్సుల పరంగా.. మ్యాథమెటిక్స్, సైన్స్‌లో బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లు; ఇంజనీరింగ్, టెక్నాలజీలో బీటెక్ ప్రోగ్రామ్స్ ముందు వరుసలో ఉన్నాయని చెప్పొచ్చు. సీయూఈటీ-యూజీ, పీజీ ఎంట్రన్స్‌లలో ఉత్తీర్ణత ఆధారంగా.. మ్యాథమెటిక్స్, సైన్స్‌కు సంబంధించి సెంట్రల్ యూనివర్సిటీల్లో అడుగుపెట్టొచ్చు. జేఈఈ, గేట్ ఉత్తీర్ణత ఆధారంగా ఐఐటీలు, ఎన్ఐటీలు వంటి ప్రతిష్టాత్మక టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌తోపాటు మరెన్నో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో బీటెక్, ఎంటెక్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశించొచ్చు.

స్టెమ్ ప్రోగ్రామ్స్.. ముఖ్య సమాచారం

- సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్‌ల సమాహారమే స్టెమ్ ప్రోగ్రామ్స్.
- దేశ, విదేశాల్లో స్టెమ్ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్.
- అర్హతలను అనుసరించి రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు వేతనం.
- దేశంలో.. స్టెమ్ ప్రోగ్రామ్స్‌కు కేరాఫ్‌గా ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు.
- సీయూఈటీ-యూజీ, పీజీ; జేఈఈ, గేట్ స్కోర్ల ఆధారంగా స్టెమ్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం పొందే అవకాశం.

2024లో 27 సాధారణ సెలవులు

- మరో 25 ఐచ్ఛిక సెలవులు
- గరిష్టంగా 5 ఐచ్ఛిక సెలవుల వాడకానికి అనుమతి
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: వచ్చే సంవత్సరంలో 27 సాధారణ సెలవులు, 25 ఐచ్ఛిక సెలవులు ఉండనున్నాయి. ఈ మేరకు సాధారణ, ఐచ్ఛిక సెలవులను ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఈ సాధారణ సెలవులు, ఐచ్ఛిక సెలవులను పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అన్ని ఆదివారాలు, అన్ని రెండో శనివారాల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను మూసి ఉంచాలని ఆదేశించారు. 2024 జనవరి 1న సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఫిబ్రవరి నెలలోని రెండో శనివారం (ఫిబ్రవరి 10) రోజును పనిదినంగా పాటించాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 25 ఐచ్ఛిక సెలవుల్లో గరిష్టంగా 5 సెలవులను మాత్రమే వినియోగించాలని కోరారు. తమ ఇష్టాలకు అనుగుణంగా మతాలతో సంబంధం లేకుండా ఏదైనా పండుగకి సంబంధించిన ఐచ్ఛిక సెలవును ఉద్యోగులు వాడుకోవచ్చని తెలిపారు. అయితే దీనికోసం పైఅధికారికి ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సాధారణ సెలవులు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థలు, పారిశ్రామిక సంస్థలకు వర్తించవని స్పష్టం చేశారు. సంబంధిత సంస్థలే సెలవులపై ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తాయన్నారు. నెలవంక ఆధారంగా రంజాన్, బక్రీద్, మొహర్రం, మిలాద్ ఉన్ నబీ పర్వదినాల సెలవులను తర్వాత మారుస్తామని తెలిపారు.

2024లో సాధారణ సెలవుల జాబితా..

సందర్భం	తేదీ	రోజు
కొత్త సంవత్సరం	01-01-2024	సోమవారం
భోగి	14-01-2024	ఆదివారం
సంక్రాంతి	15-01-2024	సోమవారం
గణతంత్ర దినోత్సవం	26-01-2024	శుక్రవారం
మహాశివరాత్రి	08-03-2024	శుక్రవారం
హోలీ	25-03-2024	సోమవారం
గుడ్ ఫ్రైడే	29-03-2024	శుక్రవారం
బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి	05-04-2024	శుక్రవారం
ఉగాది	09-04-2024	మంగళవారం
రంజాన్	11-04-2024	గురువారం
రంజాన్ తర్వాతి రోజు	12-04-2024	శుక్రవారం
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి	14-04-2024	ఆదివారం
శ్రీరామనవమి	17-04-2024	బుధవారం
బక్రీద్	17-06-2024	సోమవారం
షహదత్ ఇమామ్-ఏ-హుస్సేన్ (10వ మొహర్రం)	17-07-2024	బుధవారం
బోనాలు	29-07-2024	సోమవారం
స్వాతంత్ర్య దినోత్సవం	15-08-2024	గురువారం
శ్రీకృష్ణాష్టమి	26-08-2024	సోమవారం
వినాయక చవితి	07-09-2024	శనివారం
ఈద్ మిలాద్-ఉన్-నబీ	16-09-2024	సోమవారం
మహాత్మాగాంధీ జయంతి/ బతుకమ్మ ప్రారంభం రోజు	02-10-2024	బుధవారం
విజయదశమి	12-10-2024	రెండో శనివారం
విజయదశమి తర్వాతి రోజు	13-10-2024	ఆదివారం
దీపావళి	31-10-2024	గురువారం
కార్తీక పౌర్ణమి/గురునానక్ జయంతి	15-11-2024	శుక్రవారం
క్రిస్మస్	25-12-2024	బుధవారం
క్రిస్మస్ తర్వాతి రోజు (బాక్సింగ్ డే)	26-12-2024	గురువారం

బోరులో నుంచి గులాబీ రంగు నీరు



బకెట్లలో నిల్వ చేసిన గులాబీ రంగు నీరు

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో బోరు నుంచి గులాబీ రంగు నీరు వస్తోంది. దీంతో ఈ నీటిని చూసేందుకు ప్రజలు తరలివస్తున్నారు. కాలనీలోని ఆర్‌ఎంపీ కట్ల శ్రీనివాసాచారి మంగళవారం ఉదయం స్నానం చేయడానికి తన ఇంట్లో బోర్ ఆన్ చేశాడు. గులాబీ రంగులో నీరు రావడంతో కొంత సమయం వరకు బోరు నడిపించాడు. గంట వరకు చూసినా నీటి రంగు మారలేదు. 4 గంటలపాటు బోరు ఆన్‌చేసి ఉంచినా నీరు అలాగే వస్తోంది. రంగు నీటి విషయమై మంచిర్యాలకు చెందిన ప్రైవేటు జియాలజిస్ట్ గణేశ్‌ను సంప్రదించగా.. బోరు వేసిన సమయంలో అడుగు భాగంలో రంగు రాళ్లు ఉంటే కొన్నాళ్లకు నీళ్లు రంగులో వస్తాయని, కొన్ని సమయాల్లో నీటిలో కొత్తగా మినరల్స్ చేరితే కూడా నీళ్లు రంగుల్లో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

ఉస్మానియాలో లింగ మార్పిడి శస్త్ర చికిత్స



లింగ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న యువకుడితో మాట్లాడుతున్న డాక్టర్లు నాగేందర్, ఎండీ రఫీ, సుష్మ తదితరులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో తొలిసారిగా లింగ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. వరంగల్ జిల్లాకు చెందిన 23 ఏళ్ల సోంపెల్లి సోను (యశ్వంత్ కుమార్) పుట్టుకతోనే స్త్రీ అవయవాలను పోలిన లక్షణాలతో ఉన్నారు. ఉస్మానియాలో ఎండోక్రైనాలజీ, జనరల్ సర్జరీ, అనస్థీషియా వైద్యుల బృందం, పేట్లబుర్జులోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాలతి, నిపుణుల సహకారంతో సోను ఉస్మానియాలో ల్యాప్రోస్కోపిక్ అసిస్టెడ్ వెజైనల్ హిస్టరెక్టమీ శస్త్ర చికిత్స చేయించుకున్నారు. హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీని అందించి అవయవ మార్పిడి శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ప్రత్యేకమైన లింగ మార్పిడి శస్త్ర చికిత్సను చేసిన వైద్యుల బృందాన్ని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ అభినందించారు. ఆ బృందంలో వైద్యులు పాండూ నాయక్, పావని, బాలాజీ, మల్లికార్జున్ ఉన్నారు.

క్రిస్మస్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: క్రిస్మస్ పండుగ సందర్భంగా విద్య, వైద్య, సాహిత్యం, కళలు, క్రీడా రంగాల్లో ఉత్తమ సేవ, ప్రతిభ కనబరిచిన క్రైస్తవ వ్యక్తులు, సంస్థలను తెలంగాణ ప్రభుత్వం సత్కరించనుంది. ఇందుకోసం బుధవారం నుంచి ఈనెల 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నామని, 30 ఏళ్లకు పైబడిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. దరఖాస్తు ఫారాలను మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ ఫైనాన్స్ కార్పొరేషన్, హైదరాబాద్ కార్యాలయంలో వ్యక్తిగతంగా అయినా లేదా www.tscmfc.in వెబ్‌సైట్‌లో నుంచి అయినా పొందవచ్చని తెలిపింది. మరింత సమాచారం కోసం 040–23391067 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని సూచించింది.

శబరిమలకు 22 అదనపు రైళ్లు



సాక్షి, హైదరాబాద్: శబరిమలకు వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో 22 అదనపు రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. సికింద్రాబాద్–కొల్లాం (07111/07112) ప్రత్యేక రైలు ఈ నెల 27, జనవరి 3, 10, 17 తేదీల్లో సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.55కు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 29, జనవరి 5, 12, 19 తేదీల్లో తెల్లవారు జామున 2.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.40 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. కాకినాడ టౌన్–కొట్టాయం (0713/0714) ప్రత్యేక రైలు డిసెంబర్ 28, జనవరి 4, 11, 18 తేదీల్లో సాయంత్రం 5.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు కొట్టాయంకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 30, జనవరి 6, 13, 20 తేదీల్లో అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు జామున కాకినాడకు చేరుకుంటుంది. సికింద్రాబాద్–కొట్టాయం (07117/07118) స్పెషల్ ట్రైన్ జనవరి 2వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు కొట్టాయం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో జనవరి 4వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. సికింద్రాబాద్–కొట్టాయం (07009/07010) స్పెషల్ ట్రైన్ జనవరి 6, 13 తేదీల్లో సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.05 గంటలకు కొట్టాయంకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 8, 15 తేదీల్లో అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది.

హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక కౌంటర్

రాంగోపాల్‌పేట్: తెలంగాణ నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికుల కోసం సికింద్రాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పాంతీయ పాస్‌పోర్టు అధికారిణి స్నేహజ ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఏడాదికి సంబంధించి హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 4 నుంచి ప్రారంభమైందని ఈనెల 20వ తేదీన గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. హజ్‌కు వెళ్లాలనుకునే యాత్రికులందరూ 2025, జనవరి 31వ తేదీ వరకు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టు కలిగి ఉండాలని స్పష్టంచేశారు. తెలంగాణకు చెందిన దరఖాస్తుదారులందరూ తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సిఫార్సు చేసిన వారి పాస్‌పోర్టు దరఖాస్తులను ఈనెల 13, 15, 18వ తేదీల్లో సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ప్రాసెస్ చేస్తామని స్నేహజ వెల్లడించారు. తెలంగాణ హజ్ కమిటీ సిఫార్సు చేసిన దరఖాస్తుదారులు మాత్రమే రావాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలని, హజ్‌కు వెళ్లే యాత్రికులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

మూడేళ్లలో 1.68 లక్షల సైబర్ క్రైం కేసులు నమోదు



- 71 వేల మందిని అరెస్ట్ చేసిన పోలీసులు
- తెలంగాణలో 30,624, ఏపీలో 6,115 కేసులు
- ఇప్పటివరకు 16.72 లక్షల ఆర్థిక మోసాల గుర్తింపు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 2020 నుంచి 2022 మధ్య 1,68,902 సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా తెలిపారు. ఎన్‌సీఆర్‌బీ విడుదల చేసే నివేదిక ప్రకారం ఈ మూడేళ్లలో సైబర్ నేరాలకు పాల్పడిన 71,593 మంది నిందితులను అరెస్ట్ చేశామని కాంగ్రెస్ ఎంపీ అబ్దుల్ ఖాలీక్ అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి బదులిచ్చారు. కాగా, 2020 నుంచి 2022 మధ్య తెలంగాణలో 30,624 సైబర్ క్రైం కేసులు నమోదుకాగా, 5,089 మందిని పోలీసులు అరెస్ట్ చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో 6,115 సైబర్ క్రైం కేసులు నమోదుకాగా, 1,376 మందిని అరెస్ట్ చేశారని కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. దేశంలో సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రారంభమైనప్పటి నుంచి ఈ నెల 4 వరకు 16.72 లక్షలకుపైగా ఆర్థిక మోసాల కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు, 4 లక్షలకుపైగా ఘటనల్లో రూ.వెయ్యి కోట్లు కాపాడగలిగామని తెలిపారు.

తెలంగాణలో 631 మంది ట్రాన్స్‌జెండర్‌లకు ఐడీకార్డులు

తెలంగాణలో 1,236 మంది ట్రాన్స్‌జెండర్లు గుర్తింపుకార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా, 631 మందికి వాటిని జారీ చేసినట్లు కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయమంత్రి నారాయణస్వామి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 2,525 మంది ట్రాన్స్‌జెండర్లు దరఖాస్తు చేసుకోగా 2,124 మందికి జారీచేసిందని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.